
RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:299 హైదరాబాద్, శనివారం, 24 మే 2025 పేజీలు: 12 వెల: 1.00

## ఎన్నిసార్లైనా ప్రధానిని కలుస్తా..

# నిధులు తెస్తా

సంగారెడ్డి, మే 23: ఎన్నికలప్పుడే రాజకీయాలు అని.. తర్వాత అందరినీ కలుపుకుని ముందుకెళ్తామని అన్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి . తెలంగాణ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తామని తెలిపారు. ఎన్నిసార్లైనా ప్రధాని మోదీని కలుస్తామని.. తెలంగాణకు అవసరమైన నిధులు తీసుకొస్తామని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి అ న్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఈరోజు (శుక్రవారం) జహీరాబాద్ హుగ్గెల్లిలో బసవేశ్వర విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. ఆపై కేంద్రీయ విద్యాలయం ప్రారంభించారు. అనంతరం పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. జహీరాబాద్ పారిశ్రామికవాడ భూసేకరణలో అన్యాయం జరిగిందని తన దృష్టికి వచ్చిందన్నారు.



భూములు ఇచ్చిన రైతులకు పరిహారం పెంచామని.. జహీరాబాద్ నిమ్జ్‌లో భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని... నిమ్జ్‌లో భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. మెదక్ జిల్లా పేరు చెబితేనే ఇందిరమ్మ గుర్తొస్తుంది అని ముఖ్యమంత్రి అన్నారు. మెదక్ ప్రజలను కాంగ్రెస్ ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకుంటుందన్నారు. గేట్ వే ఆఫ్ ఇండస్ట్రీస్‌గా జహీరాబాద్ కావాలని కృషి చేశామని తెలిపారు. జహీరాబాద్‌కు అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. నారాయణఖేడ్ అభివృద్ధిపై ప్రత్యేకంగా సమీక్ష చేస్తామన్నారు. భవిష్యత్‌లోనూ మెదక్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

సింగూరు ప్రాజెక్ట్‌ను ఎకో టూరిజం కింద తీర్చిదిద్దుతామన్నారు. సింగూరును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిధులు ఇస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతులను అప్పుల బాధ నుంచి తప్పించామని.. రైతు భరోసా పథకం అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. గతంలో వరి వేస్తే ఉరే అన్నారని గుర్తుచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం రూ.5 వేల కోట్లకు పైగా కేటాయించామని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు కంకణం కట్టుకున్నామని స్పష్టం చేశారు.

ఆడబిడ్డను ఆర్థికంగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆడబిడ్డ ఆర్థికంగా నిలబడితే కుటుంబాలు బాగుపడతాయని తెలిపారు. ఐదేళ్లలోపు కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామన్నారు. 'మీరు అండగా ఉండండి... ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాది' అని వెల్లడించారు. గత ప్రభుత్వ నేత అలిగి ఫామ్‌హౌస్‌లో పడుకున్నారంటూ విమర్శించారు. అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తామన్నారు. ప్రతిపక్ష నేతల అసెంబ్లీకి రావాలని... సలహాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర, కొండా సురేఖ పాల్గొన్నారు.


## ఏ తప్పూ చేయకుంటే నోటీసు ఇవ్వగానే ఉలుకు ఎందుకు?: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: కాళేశ్వరంలో అక్రమాలు తేల్చేందుకే దేశంలోనే పేరు మోసిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో కమిషన్ వేశామని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్కతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఏ తప్పూ చేయకుంటే నోటీసు ఇవ్వగానే అంత ఉలుకు ఎందుకని ప్రశ్నించారు. నోటీసు ఇవ్వగానే కమిషన్‌ను తప్పుబడుతూ మాట్లాడటం విచారకరమన్న ఉత్తమ్.. ఇందిరగాంధీ లాంటి వాళ్లే కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారని గుర్తు చేశారు. నోటీసులు ఇచ్చాక జ్యుడీషియల్ కమిషన్‌నే కించపరిచేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. చట్టపరమైన చర్యలు తీసుకునేందుకే జ్యుడీషియల్ కమిషన్ వేశామన్నారు.

# మళ్లీ క్వారంటైన్ భయం...

హైదరాబాద్, విజయవాడ, మే 23

కరోనా కొత్త వేరియంట్ నిజంగానే అంత భయానకమా..? మళ్లీ క్వారెంటైన్ కష్టాలు తప్పవా..? పరిస్థితి లాక్‌డౌన్‌కు దారితీస్తుందా? అనే భయాల కంటే ముందుగా గుర్తొచ్చేది కొవిడ్ బూస్టర్ వ్యాక్సిన్. కానీ.. బూస్టర్ వెయ్యించుకోవాలా వద్దా అనేది కూడా ఇప్పుడు ప్రపంచ సమస్యగా మారింది. ఔను.. కోవిడ్ వ్యాక్సినేషన్‌తో గుండెపోటు వచ్చే ఛాన్సుందట.ఐదేళ్ల కిందట ప్రపంచాన్ని కుదిపేసిన పీడకల కొవిడ్-19.. నేను బతికే ఉన్నా అంటూ అడపాదడపా హెచ్చరిస్తూనే ఉంది. వారం రోజులుగా ఆసియన్ కంట్రీస్‌లో టెర్రర్ పుట్టిస్తోంది. మనదాకా రాలేదుగా అనుకుంటుండగానే భారత్‌లో పాజిటివ్ కేసుల సంఖ్య అమాంతం పెరుగుతూ.. కొవిడ్ భయాన్ని మళ్లీ పరిచయం చేస్తోంది.ప్రస్తుతం మన దేశంలో 250కి పైగా యాక్టివ్ కేసులున్నాయి. కేరళ, తమిళనాడు, మహారాష్ట్రలో పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. గతంలోలాగే ఈ సీజన్‌లో కూడా కొవిడ్ ఫియర్‌లో కేరళ రాష్ట్రమే ముందుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. ఎటువంటి పరిస్థితికైనా సిద్ధమవ్వాలని అని స్వయానా కేరళ ఆరోగ్య మంత్రే హెచ్చరించారు. పాండిచ్చేరి, ఢిల్లీ, గుజరాత్, రాజస్థాన్, సిక్కిం, హర్యానా, కర్ణాటక, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు సైతం అటెన్షన్ మోడ్‌లోకి వచ్చేశాయి.తెలుగురాష్ట్రాల్ని కూడా ఎలర్ట్ చేసింది కొవిడ్ ఫియర్. పొరుగు రాష్ట్రాల్లో కేసుల సంఖ్య పెరగడంతో స్పెషల్ అడ్వైజరీ జారీ చేసింది ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ. వీలైనంతవరకు పార్టీలు, ఫంక్షన్లు, ప్రార్థనలకు దూరంగా ఉండాలి. రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, ఎయిర్‌పోర్ట్‌ల్లో మాస్క్ వేసుకోవడం భౌతిక దూరం పాటించడం తప్పనిసరి. 60 ఏళ్లు పైబడిన వాళ్లు, గర్భవతులు ఇంట్లోంచి బైటికి రావద్దు. తరచూ చేతులు కడుక్కోవాలి, జ్వరం, దగ్గు, గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే కోవిడ్ టెస్ట్ చేయించుకోవాలి. అనారోగ్యంగా ఉంటే బైటకు వెళ్లకండి.. అని సూచించింది ఏపీ హెల్త్ డిపార్ట్‌మెంట్. పరీక్షల కోసం ల్యాబ్స్ సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్యాధికారుల్ని అప్రమత్తం చేసింది కూడా.ఈ ఏడాది జనవరిలో మహారాష్ట్ర కోవిడ్ సంబంధిత సమస్యలతో ఇద్దరు మరణించారు. వీళ్లకు మిగతా అనారోగ్య సమస్యలు కూడా ఉండడంతో అప్పట్లో తేలిగ్గా తీసుకున్నాయి ప్రభుత్వాలు. ఇప్పుడు కూడా మిగతా ఆసియా దేశాలతో పోలిస్తే భారత్‌లో ఆందోళన పడాల్సిన పనే లేదు. ఎందుకంటే.. ఒక్క హాంకాంగ్‌లోనే 30మందికి పైగా చనిపోయారు. థాయ్‌లాండ్‌లో ఏప్రిల్ నుంచే కొవిడ్ టెర్రర్ ఉంది. ఒక్క బ్యాంకాక్‌లోనే ఆరువేల




కేసులు నమోదయ్యాయి. మన దేశపు జనాభాతో పోలిస్తే ప్రస్తుతమున్న కేసుల సంఖ్య చాలా తక్కువ. అంతమాత్రాన కరోనా ఉనికి లేదని ఊపిరి పీల్చుకోడానికి లేదు. ఎందుకంటే.. టెస్టుల సంఖ్యను బట్టే కేసుల సంఖ్య ఆధారపడి ఉంటుంది. కొవిడ్ సంకేతాలు కనిపించగానే టెస్టుల కోసం క్యూ కట్టే పరిస్థితి ఇంకా మన దేశంలో లేదు.ఇప్పుడు సర్క్యులేషన్‌లో ఉన్న వైరస్.. ఒమిక్రాన్ ఫ్యామిలీలోని జేఎన్1 అనే వేరియంట్ నుంచి వచ్చిన సబ్‌వేరియంట్. ఒరిజినల్ వైరస్‌తో పోలిస్తే, దీని తీవ్రత చాలాచాలా తక్కువ. థర్డ్ వేవ్‌లో వచ్చిన ఒమిక్రాన్ వేరియంటే అప్పట్లో పెద్దగా ప్రభావం చూపలేదు. తాజా వేరియంట్‌తో పెద్దగా భయపడాల్సిన అవసరం లేనట్టే..! 100 మందికి వైరస్ సోకితే ఐదుగురు కూడా ఆస్పత్రిలో చేరే అవసరం రాదు. కానీ.. కొవిడ్ ఉనికి తీవ్రతను బట్టి దేశాలన్నీ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నదీ ప్రపంచ ఆరోగ్య సంస్థ గైడ్‌లైన్. అందుబాటులో ఉన్నంత మాత్రాన బూస్టర్ వ్యాక్సిన్ వేసుకోవచ్చా..? అనేది కొత్తగా పుట్టిన భయం.ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఈఆం.. కొవిడ్ వ్యాక్సిన్ రెగ్యులేషన్స్‌ని మార్చేసింది. 65 ఏళ్లు పైబడినవాళ్లు మాత్రమే బూస్టర్ షాట్స్ తీసుకోడానికి అర్హులని తేల్చింది. ఇంతకంటే భయపెట్టే విషయం ఏంటంటే.. వ్యాక్సినేషన్ తర్వాత గుండెసంబంధిత వ్యాధులు రావొచ్చని హెచ్చరిస్తోంది ఈఆం. ఈ మేరకు లేబుల్ మీద వార్నింగ్ ఇవ్వాలని వ్యాక్సిన్ తయారీ కంపెనీలను ఆదేశించింది కూడా. సో.. బూస్టర్ వ్యాక్సిన్ వేసుకుందాం.. కొవిడ్ బారిన పడకుండా తప్పించుకుందాం అని ఆశపడితే గుండెపోటుకు దొరికిపోయే ఛాన్సు ఉంది. తస్మాత్ జాగ్రత్త..!

# ఈడీ చిక్కుల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

## విమర్శలు మొదలు పెట్టిన కేటీఆర్

హైదరాబాద్, మే 23

కాంగ్రెస్‌ను చికాకు పెడుతున్న కేసుల్లో నేషనల్ హెరాల్డ్ కేసు ఒకటి. ఇందులో నిందితులుగా రాహుల్ గాంధీ, సోనియా గాంధీతోపాటు మరో ఐదుగురు ఉన్నారు. ఇప్పుడు ఈ కేసులో తెలంగాణ ముఖ్యమంత్రికి కూడా భాగం ఉందని ఈడీ పేర్కొనడంతో సంచలనంగా మారుతోంది. దీంతో ప్రతిపక్షాలు కూడా విమర్శలు ఎక్కుపెడుతున్నాయి. నేషనల్ హెరాల్డ్ కేసులో గత నెలలోనే ఈడీ ఛార్జ్‌షీట్‌ను కోర్టుకు సమర్పించింది. ఇందులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీతోపాటు ఐదుగుర్ని నిందితులుగా చేర్చింది. కానీ ఈ కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పవన్ బన్సల్, చనిపోయిన నేత అహ్మద్ పటేల్ పేర్లు రావడం ఇప్పుడు సంచలనంగా మారుతోంది.యంగ్ ఇండియా సంస్థ ఏర్పాటు చేసి అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ఆస్తులు కొట్టేయడానికి యత్నించారని ఈడీ ఆరోపిస్తోంది. ఈ ఆస్తుల విలువ దాదాపు రెండు వేల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ యంగ్ ఇండియా సంస్థ ఏర్పాటులో చాలా మంది కాంగ్రెస్ నేతలు భాగమయ్యారని 2019-22 మధ్య విరాళాల రూపంలో డబ్బులు వసూలు చేశారని పేర్కొంది ఈడీ. పదవులు, ఇతర ప్రయోజనాలు ఎర చూపించి డబ్బులు వసూలు చేసినట్టు పేర్కొంది. అందులో అప్పటి పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి, పవన్ బన్సల్, అహ్మద్ పటేల్ భాగమయ్యారని తెలిపింది. పూర్తి స్థాయి విచారణ తర్వాత ఈ విషయాన్ని ఛార్జిషీట్‌లో పెట్టినట్టు ఈడీ వెల్లడించింది. ఈ కేసులో విచారణలో భాగంగా గతంలో సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, అంజన్ కుమార్ యాదవ్, గీతారెడ్డి, గాలి అనిల్ కుమార్‌ను కూడా ఈడీ విచారించింది. ఇప్పుడు ఈడీ ఛార్జ్‌షీట్‌ను అస్త్రంగా మార్చుకుంటోంది బీఆర్ఎస్. ఈ విషయంపై కేటీర్ ట్వీట్ చేశారు. రేవంత్ రెడ్డి అవినీతి ఈడీ కేసుతో తేటతెల్లమైందని పేర్కొన్నారు." యంగ్ ఇండియా సంస్థకు విరాళాలు ఇస్తే పదవులు ఇప్పిస్తానని రేవంత్ రెడ్డి ప్రలోభ పెట్టినట్టు ఈడీ నమోదు చేసిన ఛార్జిషీట్‌తో సీఎం అవినీతి సామ్రాజ్యం బట్టబయలైంది.అధికారం కోసం ముఖ్యమంత్రి కాకముందే కాంగ్రెస్ పార్టీ పెద్దలకు వందల కోట్లు కట్టబెట్టిన వ్యవహారం కుండబద్దలు కొట్టినట్లైంది. వందల కోట్లతో మొదలైన రేవంత్ అవినీతి బాగోతం గత ఏడాదిన్నరలో సీఎం పదవిని అడ్డం పెట్టుకుని ఏకంగా వేల కోట్లకు చేరింది. దివ్యమైన తెలంగాణని దివాళా తీసి వేల కోట్లు కొల్లగొట్టడం వల్లే ఈడీ కేసులో రేవంత్ రెడ్డి అడ్డంగా ఇరుక్కుపోయారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ? పొంగులేటి తరహాలో చీకట్లో బీజేపీ పెద్దల కాళ్లు పట్టుకుంటారా అంటూ అనుమానం వ్యక్తం చేశారు. ఈడీ, కేవలం ఛార్జిషీటులో పేరు పెట్టడం వరకే



పరిమితం అవుతుందా ? లేక రేవంత్ రెడ్డిని విచారణను పిలిచి మొత్తం అవినీతి కుంభకోణాలను కక్కిస్తుందా ??" అని అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో రోజురోజుకూ పేట్రేగిపోతున్న అంతర్గత కుమ్ములాటలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా కకావికలమైందన్నారు కేటీఆర్. పెరిగిపోతున్న తిరుగుబాట్లతో సీఎం కుర్చీ ఎప్పుడూ కూలిపోతుందో అనే భయం రేవంత్ రెడ్డిని అడుగడుగునా వెంటాడుతోందని విమర్శించారు. ఏం చేయాలో తెలియని దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్న కాంగ్రెస్, ముఖ్యమంత్రి.. అటెన్షన్ డైవర్షన్ కోసం రోజురోజుకూ చేస్తున్న చిల్లర చేష్టలు, కొత్త కుట్రలకు తెరపడినట్టేనని అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్ కు పిల్లనిచ్చిన మామ సూదిని పద్మారెడ్డియే స్వయంగా కాళేశ్వరంలో అవినీతి జరగలేదనడంతో ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ పార్టీ ఫ్యూజులు ఒక్కసారిగా ఎగిరిపోయినట్టు అయిందన్నారు కేటీఆర్. కమిషన్లు లేనిదే ప్రభుత్వంలో ఒక్కటంటే ఒక్క ఫైలు కదలడం లేదని స్వయంగా కేబినెట్ మంత్రి కొండా సురేఖ కుండబద్దలు కొట్టడంతో కాంగ్రెస్ నిర్వాకాలన్నీ వరుసగా వెలుగుచూస్తున్నాయని తెలిపారు. 30 శాతం పర్సెంటేజీలు ఇవ్వనిదే సొంత ప్రభుత్వంలో పనులు కావడం లేదని సాక్షాత్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆ పార్టీ బట్టలిప్పడంతో కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. నాలుగు కోట్ల ప్రజల ముందు ముఖ్యమంత్రి అవినీతి బాగోతం బట్టబయలు కావడంతో కుడితిలో పడిన ఎలుకలా కాంగ్రెస్ పార్టీ కొట్టుకుంటోందని ఎద్దేవా చేశారు కేటీఆర్. పచ్చని రాష్ట్రంలో చిచ్చుపెట్టడమే కాకుండా వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీచేస్తూ, పేదల జీవితాలతో చెలగాటమాడుతున్న ముఖ్యమంత్రి పాపం పండింది... చివరికి ధర్మం గెలుస్తుందని అభిప్రాయపడ్డారు

# వాయుగండం, అల్పపీడనం.. వానలే ..వానలు

హైదరాబాద్, మే 23

రాగల 2-3 రోజులలో కేరళ తీరాన్ని నైరుతి రుతుపవనాలు తాకనున్నాయి. తూర్పు మధ్య అరేబియా సముద్రంపై ఏర్పడిన చక్రవాత ఆవర్తనం ప్రభావంతో, తూర్పు మధ్య అరేబియా సముద్రం, దక్షిణ కోంకణ్ ? గోవా తీర ప్రాంత సమీపంలో అల్పపీడనం ఏర్పడింది. దీంతో రాగల 24 గంటల్లో అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉంది. మరోవైపు ఈనెల 27న పశ్చిమ మధ్య, సమీప ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంలో మరో అల్పపీడన ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ రోజు తెలంగాణలోని అదిలాబాద్, కొమరంభీం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసే అవకాశం ఉంది. ఈ రోజు తెలంగాణలోని ఆరు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.తెలంగాణలోని రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, బయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ,



జనగాము, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉంది.

================

# ఇవాళ్టి నుంచి మెట్రో కొత్త చార్జీలు

హైదరాబాద్, మే 23

హైదరాబాద్‌లో అధిక మంది జనాలు మెట్రోల్లో ప్రయాణిస్తుంటారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా సులువుగా గమ్యస్థానాల్ని చేరడానికి మెట్రో మార్గాన్ని ఎంచుకుంటున్నారు. అయితే తాజాగా మెట్రోల్లో చార్జీలను పెంచుతూ యాజమాన్యం ప్రకటన జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై సర్వత్రా వ్యతిరేకత రావడంతో ఎల్ అండ్ టీ యూటర్న్ తీసుకుంది. పెంచిన మెట్రో చార్జీలను సవరించిన హైదరాబాద్ మెట్రో సంస్థ.. శుక్రవారం కొత్త చార్జీల చార్టును విడుదల చేసింది. ఇందులో 10 శాతం డిస్కౌంటు ఇస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. తగ్గిన చార్జీలు మే 24వ తేదీ నుంచి అమలులోకి రానున్నట్టు మెట్రో రైలు సంస్థ ప్రకటించింది. ఈ మేరకు కొత్త చార్జీలు విడుదల చేసింది.

ఫేర్ జోన్ వారీగా సవరించిన హైదరాబాద్ మెట్రో రైల్ కొత్త చార్జీల చార్టు ఇదే..

2 కిలోమీటర్లలోపు ఛార్జీ రూ.11

2 నుంచి 4 కిలోమీటర్ల వరకు ఛార్జీ రూ.17

4 నుంచి 6 కిలోమీటర్ల వరకు ఛార్జీ రూ.28

6 నుంచి 9 కిలోమీటర్ల వరకు ఛార్జీ రూ.37

9 నుంచి 12 కిలోమీటర్ల వరకు ఛార్జీ రూ.47

12 నుంచి 15 కిలోమీటర్ల వరకు ఛార్జీ రూ.51

15 నుంచి 18 కిలోమీటర్ల వరకు ఛార్జీ రూ.56

18 నుంచి 21 కిలోమీటర్ల వరకు ఛార్జీ రూ.61

21 నుంచి 24 కిలోమీటర్ల వరకు ఛార్జీ రూ.65

24 ఆపై కిలోమీటర్లకు ఛార్జీ రూ.69

జోన్ వారీగా ఫేర్ ఫిక్సేషన్ కమిటీ నిర్ణయించిన పెంపునకు సంబంధించి ప్రయాణికులకు 10 శాతం డిస్కౌంటు ఇస్తూ ఈ మేరకు ప్రకటన జారీ చేసింది. మే 24 నుంచి పేపర్ క్యూఆర్/టోకెన్, డిజిటల్ టికెట్లు, స్మార్ట్ కార్డులు.. అన్ని చెల్లింపులకు వర్తిస్తుంది. ప్రయాణికులు స్మార్ట్ కార్డులు, డిజిటల్ ప్లాట్‌ఫాంలను ఉపయోగించి స్మార్ట్‌గా ప్రయాణించాలని ప్రయాణికులకు మెట్రో సంస్థ విజ్ఞప్తి చేసింది. నగర వాసులకు సురక్షితమైన, విశ్వసనీయమైన, అందుబాటు స్థాయిలో చార్జీలతో మెట్రో సేవలను అందించాలన్న లక్ష్యంతో ఎల్ అండ్ టీ మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇతర వివరాలు అధికారిక వెబ్‌సైట్ లిలిలి.శ్రీబిఎవబితీసీ.ఇసీఎలో చెక్ చేసుకోవచ్చు.

భారత శక్తి
VOICE OF INDIAN

## వివాదంగా మారిన ఎంపిల పేర్ల ప్రకటన

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కు ప్రపంచ దేశాల నుంచి గట్టి మద్దతు లభించింది. చైనా, టర్కీ వంటి కొన్ని దేశాలు పాకిస్థాన్ కు మద్దతు పలికినా, మెజారిటీ దేశాలు మన దేశానికి సంపూర్ణ మద్దతునిచ్చాయి. మద్దతు ఇవ్వడమే కాదు పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని ఉగ్ర స్థావరాలపై జరిపిన దాడులను సమర్థించాయి. ఈ నేపథ్యంలో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నపాకిస్థాన్ ఉగ్ర రూపాన్ని ప్రపంచం ముందు ఉంచేందుకు.. తద్వారా అంతర్జాతీయంగా పాకిస్థాన్ ను ఏకాకిని చేసేందుకు,ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం దౌత్య వ్యూహాన్ని సిద్ధం చేసింది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల అమానుష ఉగ్ర దాడుల చరిత్రను, ఉగ్ర కుట్రల్ని ప్రపంచ దేశాలకు విశదీకరించేందుకు.. మరీ ముఖ్యంగా 26 మంది అమాయక పర్యాటకులను, అత్యంత కిరాతకంగా హతమార్చిన సంఘటన నేపథ్యంగా మన దేశం చేపటిన ఆపరేషన్ సిందూర్ పూర్వపరాలను వివరించేందుకు పార్లమెంట్ సభ్యుల ప్రతినిధి బృందాలను వివిధ దేశాలకు పంపాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది.ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, భారత్‌లో ఉగ్రమూకల చర్యలకు ఊతంగా వున్న పాకిస్థాన్ ధోరణిని ప్రపంచ దేశాలకు వివరించాల ని మోదీ ప్రభుత్వం తలపెట్టింది. అఖలపక్ష ఎంపీలతో ఏర్పాటు చేసిన ఏంపీల బృందాలు వివిధ దేశాల్లో పర్యటించనున్నాయి. బుధవారం ఇం దులో రెండు బృందాల పర్యటన మొదలైంది. పహల్గాంలో ఉగ్రవాదులు ఆమాయకులైన టూరిస్టులు 26 మందిని పొట్టనపెట్టుకోవడం, దానికి ప్రతిగా 'ఆపరేషన్ సిందూర్'తో భారత సైన్యం పాకిస్థాన్‌లో ఎంపిక చేసుకున్న ఉగ్రవాదుల శిబిరాలను ధ్వంసం చేయడం జరిగింది. పాకిస్థాన్‌తో గతంలో జరిగిన సింధూ జలాల ఒప్పందం రద్దు మొదలు వాణిజ్యం, ఇతర అంశాలపై భారత్ అన్ని విధాలుగా ఆ దేశంతో సంబంధాలను తెగదెంపులు చేసుకున్నది. 'ఆపరేషన్ సిందూర్' మింగుడు పడని పాకిస్థాన్ ఏకంగా భారత సరిహద్దుల రాష్ట్రాల్లోని మిలిటరీ స్థావరాలను, నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని క్షిపణులు, డ్రోన్లతో దాడులకు తెగబడింది.తమ దగ్గరున్న అణ్వాయుధాలతోనూ భారత్‌పై దాడి చేస్తామని కూడా పాకిస్థాన్‌లోని కొందరు రాజకీయ నాయకులు ప్రగల్భాలు పలికా రు. ఉగ్రవాదులకు తావుగా వున్న పాకిస్థాన్, కశ్మీర్ సమస్యను బూచిగా చూపి ఉగ్రసంస్థలను భారత్ భూభాగంలోకి ప్రయోగించడం కొత్తేమి కా దు. కాని దృఢ సంకల్పంతో భారత్, పాకిస్థాన్‌కు ఈసారి బుద్ధిచెప్పిన తీరు ను ప్రపంచ దేశాలు మౌనంగానే ఆమోదించాయని చెప్పవచ్చు. రెండు దే శాల మధ్య ఉద్రిక్తతలు పెరిగి, అది యుద్ధంగా పరిణమించకూడదనే పలు దేశాలు హితవు పలికాయి. ప్రపంచ దేశాలకు ఉగ్రదాడులపై భారత్ వైఖరి ఎలా వుండబోతున్నది, పాక్ ప్రదర్శిస్తున్న వైఖరి ఏమిటనేది వివరించాలని మోదీ ప్రభుత్వం సంకల్పించింది. ఉగ్రతండాలను భారత్‌లో దాడులకు ఉసిగొల్పడం, భారత్ ప్రతిగా దాడులు చేస్తే అ ణ్వాయుధాలను బూచి చూపడం ఇకపై చెల్లదనేది భారత్ స్పష్టం చేస్తున్నది. అణ్వాయుధాలను చూపి బ్లాక్‌మెయిల్ చేసే ధోరణి విడనాడకపోతే పాకిస్థాన్ సైన్యం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందనేది భారత్ ఈ సందర్భంలో ప్రపంచ దేశాలకు స్పష్టం చేయనున్నది.ఇందుకు సంబధించి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రధన పార్టీలకు లేఖలు రాశారు. ప్రపంచ దేశాలకు భారత వాణిని బలంగా వినిపించే ఎంపీల పేర్లను పంపాలని కోరారు. అందుకు సమాధానంగా కాంగ్రెస్ పార్టీ, నలుగురు ఎంపీల పేర్లను పంపింది. అయితే.. ఆ పేర్లలో ఐక్య రాజ్య సమితి కీలక బాధ్యతలు నిర్వహించిన అనుభవంతో పాటుగా,విదేశీ వ్యవహార స్థాయి సంఘం చైర్మన్ గా ఉన్న సీనియర్ ఎంపీ శశిథరూర్ పేరు లేదు. మాజీ మంత్రి ఆనంద్ శర్మ, లోక్ సభలో కాంగ్రెస్ పార్టీ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్, మరో ఇదరు ఎంపీలు సయ్యద్ నసీర్ హుస్సేన్, రాజా బ్రార్ పేర్లను కాంగ్రెస్ పార్టీ పంపింది. అయితే, ప్రభుత్వం విడుదలచేసిన జాబితాలో కాంగ్రెస్ నుంచి శశిథరూర్ పేరు ఉండటం అందర్నీ ఆశ్చర్యపరిచింది. కాంగ్రెస్ పంపిన జాబితాలో శశిథరూర్ పేరు లేకపోయినా ఆయన పేరును కేంద్రం ప్రకటించడం, వివాదంగా మారింది. మరో వంక. శశిథరూర్ అఖిలపక్ష బృందానికి నాయకత్వం నడిపించే అవకాశం దక్కడం ఆనందంగా ఉందన్నారు. పహల్గాం దాడి నుంచి ఇటీవల చోటుచేసుకున్న కార్యకలాపాలపై భారత వైఖరిని ప్రపంచ దేశాల ముందు చెప్పేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. దేశానికి తన సేవలు అవసరమైనప్పుడు తప్పకుండా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.సింధూ జలాలు పాకిస్థాన్‌కు వెళ్లకుంగా కట్టడి చేయాలన్న నిర్ణయంలోనూ మార్పు ఉండదని ప్రపంచ దేశాలకు స్పష్టంగా చెప్పాలని భారత విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రీ తాజాగా ఎంపీల ప్రతినిధి బృందానికి దిశానిర్దేశం చేశారు. 'ఆపరేషన్ సిందూర్' అనంతరం రెండు దేశాల మధ్య కాల్పుల విరమణకు అమెరికా మధ్యవర్తిత్యం నెరపిందా? అందుకు అవును అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు చేసిన ప్రకటనను భారత ప్రభుత్వం పూర్వపక్షం చేస్తున్నా, కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో స్పష్టమైన ప్రకటనను అశిస్తున్నది. పార్టీ ఎంపీ శశిథరూర్‌ను ఎంపీల బృందంలో కేంద్ర ప్రభుత్వం చేర్చుకోవడం.. తమ అభిమతాన్ని కాదని రాజకీయం చేయడమేనని అ పార్టీ బీజేపీపై గుర్రుగా వుంది. ప్రపంచ దేశాల్లో ఈ ఏంపీల బృందం పర్యటించి ఏం సాధిస్తుందని పెదవి విరుస్తున్న పార్టీలూ ఉన్నాయి. ప్రతినిధి బృం దంలో ఎంపీలు ఎవరనేది, ఆయా పార్టీల ప్రాతినిథ్యం అడగాలని.. కేంద్ర మే ఎలా పేర్లు ప్రకటిస్తుందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ముందు ఆగ్రహం వ్యక్తం చేసినా.. ఆ తర్వాత ఆమె మెత్తబడ్డారు.

# వినూత్న కార్యక్రమాలతో పవన్



గుంటూరు, మే 23,

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జనంలోకి వెళ్లాలంటే కొంత ఇబ్బందులు తప్పవు. ఆయన ఇతర రాజకీయ నేతలు తరహా కాదు. సినీ హీరో కావడంతో పాటు లక్షలాది మంది అభిమానులు ఉండటంతో పవన్ కల్యాణ్ అంత సులువుగా జనంలోకి వెళ్లలేరు. ఏదైనా బహిరంగ సభలు, రోడ్ షోలకు మాత్రమే పరిమితమవుతారు. పాదయాత్ర వంటివి చేయాలన్నా ఆయనకు భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తుతాయి. వాహనంపై ఉన్నప్పటికీ అభిమానులు పోలీసు వలయాన్ని ఛేదించుకుని మరీ వచ్చి రచ్చ చేయడం అనేకసార్లు చూశాం. అభిమానుల తాకిడిని తట్టుకోవడం కూడా పవన్ కల్యాణ్ కు కష్టంగా మారి జనంలోకి రావడం అంటే పవన్ భయపడిపోతున్నారు. పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలను చేపట్టిన నాటి నుంచి అభివృద్ధి కార్యక్రమాలపైనే ఎక్కువ ఫోకస్ పెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను ప్రత్యేకంగా వినియోగించుకోవడమే కాకుండా, తనకున్న పలుకుబడితో నిధులు తీసుకు రావడంతో గ్రామీణ రహదారులు మాత్రమే కాకుండా గిరిజన ప్రాంతాల్లో దశాబ్దాల నుంచి రోడ్డు సౌకర్యం లేక అల్లాడుతున్న ఏజెన్సీ ఏరియాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టారు. స్వయంగా గిరిజన ప్రాంతాలను దర్శించి వారితో చర్చించి సమస్యలను అడిగి తెలుసుకుని మరీ పరిష్కారం చేసే దిశగా పవన్ కల్యాణ్ అడగులు వేస్తున్నారు. ఒక్క గిరిజన ప్రాంతాలకు మాత్రమే నేరుగా పవన్ కల్యాణ్ జనంలోకి వెళుతున్నారు. పంచాయతీలకు నిధులు మంజూరు చేయించి పల్లె పండగ పేరుతో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను సర్పంచ్ తో పాటు గ్రామ కమిటీలు కూర్చుని పరిష్కరించుకునేందుకు వీలుగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పంచాయతీలకు ప్రభుత్వం చేత నిధులు విడుదల చేయించి విద్యుత్తు బకాయిలతో పాటు, రహదారులు, మంచినీటి సౌకర్యం వంటివి కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడింది. గత వైసీపీ పాలనలో పంచాయతీలను నిర్వీర్యం చేయడంతో సర్పంచ్ లు అప్పుల పాలయ్యారు. దీంతో పవన్ కల్యాణ్ పట్టుబట్టి మరీ చంద్రబాబు నాయుడును ఒప్పించి నిధులను పంచాయతీలకు విడుదల చేయించి పల్లె పండగను నిర్వహించారు. మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మన ఊరు-మాటామంతీ పేరుతో ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా పవన్ కల్యాణ్ ఈ కార్క్రమానికి శ్రీకారం చుట్టారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నేడు శ్రీకాకుళం జిల్లా రావివలస ప్రజలతో పవన్ కల్యాణ్ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. మన ఊరు-మాటామంతీ కార్యక్రమం జరగనుంది. టెక్కలిలోని థియేటర్ ఇందుకు వేదిక కానుంది. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను నివేదించవచ్చు. అక్కడికక్కడే సమస్యలన పరిష్కరించేలా పవన్ కల్యాణ్ ప్లాన్ చేశారు. పవన్ కల్యాణ్ ప్రజల్లోకి వెళ్లకుండా ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టడం శుభపరిణామమని అంటున్నారు.

# టీడీపికి దూరంగా టాలీవుడ్

ఏలూరు, మే 23,

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. రెండు సార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ, రెండు సార్లు విభజిత ఏపీలోనూ ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించారు. చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చి దాదాపు యాభై ఏళ్లు అవుతున్నప్పటికీ ఆయన కు తొలి నుంచిటాలీవుడ్ తో మంచి సంబంధాలున్నాయి. అసలు ఆ మాటకొస్తే తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు టాలీవుడ్ లో అగ్రస్థానంలో కొన్ని దశాబ్దాల పాటు వెలిగి చివరకు పార్టీ ని పెట్టి రాజకీయాల్లోకి వచ్చారు. దీంతో తెలుగుదేశం పార్టీకి, టాలీవుడ్ కు మధ్య సంబంధాలు దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. ఎన్టీఆర్ హయాం నుంచి ప్రారంభమైన ఈ సంప్రదాయాన్ని చంద్రబాబు కూడా కొనసాగించారు. చంద్రబాబు నాయుడు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా టాలీవుడ్ కు చెందిన వారిలో ఎవరో ఒకరు రాజ్యసభ లేదా పార్లమెంటు సభ్యులుగానో ఉండేవారు. ఎన్నికల ప్రచారంలోనూ టాలీవుడ్ నుంచి ఆయనకు సహకారం అందేది. చంద్రబాబు అంటే టాలీవుడ్ కు ప్రత్యేక అభిమానం ఉంది. అదే ఆయనను టాలీవుడ్ కు దగ్గర చేసింది. ఎన్నికల ప్రచారంలో దశాబ్దాల క్రితం సినిమాల్లో యాడ్స్ తో పాటు పాటలు వంటివి కూడా టాలీవుడ్ నుంచి వచ్చేవి. దర్శకులు, నిర్మాతలు, నటులు ఇలా 24 ఫ్రేమ్స్ నుంచి ఆయనకు వెన్నంటే ఉండేవారు. అలాగే ఆయన ఎప్పుడు అధికారంలోకి వచ్చినా టాలీవుడ్ నుంచి వచ్చి అందరూ కలిసేవారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కలసి అభినందనలుచెప్పి వెళ్లేవారు.. అంతేకాదు చంద్రబాబు కూడా వివిధ నామినేటెడ్ పోస్టుల్లో టాలీవుడ్ కుచెందిన వారిని నియమించేవారు. 2014 లో అధికారంలోకి వచ్చినప్పుడు కూడా ఎస్వీబీసీ ఛానల్ కు ఛైర్మన్ గా దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావును నియమించేవారు. నాడు మురళీ మోహన్ ఎంపీగా ఉండటంతో ఆయన అంతా తానే అయి టాలీవుడ్ ను చంద్రబాబు చెంతకు చేర్చేవారు. అలాగే రాజేంద్ర ప్రసాద్ వంటి నటులు కూడా వచ్చి చంద్రబాబును కలసి తమ సమస్యలను విన్నవించుకునే వారు. అలాంటిది కూటమి ప్రభుత్వం 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం టాలీవుడ్ నుంచి చంద్రబాబు వద్దకు వచ్చిన వారు తక్కువేననిచెప్పాలి. హైదరాబాద్ కు వచ్చినప్పుడు కలవడమే తప్ప ప్రత్యేకంగా అమరావతికి వచ్చి కలిసిన వారు ఎవరూ లేరు. దీనికి ప్రధాన కారణం జనసేన అధినేత పవన్ కల్యాణ్. టాలీవుడ్ ను శాసిస్తున్న మెగా కుటుంబానికి చెందిన పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా ఉండటం, సినిమాటోగ్రఫీ మంత్రిగా జనసేన ఎమ్మెల్యే కందుల దుర్గేశ్ కూడా ఉండటంతో చంద్రబాబు ఇక తనంతట తానే టాలీవుడ్ కు దూరమయినట్లు అంటున్నారు. పవన్ కల్యాణ్ అంటేనే టాలీవుడ్ కు చెందిన వారు కలుస్తారు. ఆయనకు సినీరంగంలో ఉన్న పరిచయాలతో ఆ పరిశ్రమలో ఉన్న సమస్యలు కూడా తెలుసు. అందుకే ఆ విషయాల్లో తాను జోక్యం చేసుకోవడం అనవసరమని భావించి చంద్రబాబు టాలీవుడ్ కు దూరంగా ఉంటున్నారని తెలిసింది. ఏ నిర్ణయం తీసుకున్నా పవన్ కల్యాణ్ హర్ట్ అవుతారేమోనని భావించి చంద్రబాబు తెలుగు చలన చిత్ర పరిశ్రమ గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. నిజంగా నలభై ఏళ్ల తర్వాత చంద్రబాబు టాలీవుడ్ కు దూరమయ్యారా? అన్న టాక్ మాత్రం చిత్ర పరిశ్రమలో బలంగా వినిపిస్తుంది.

# కరోనా ఆంక్షలు...

విజయవాడ, మే 23

దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. దక్షిణాది రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఏపీలో కోవిడ్ నియంత్రణ కోసం చేపట్టాల్సిన చర్యలపై మార్గదర్శకాలను వైద్య ఆరోగ్య శాఖ జారీ చేసింది. కోవిడ్ కేసులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. దక్షిణాది రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు నమోదు అవుతుండటంతో ముందస్తు చర్యలు చేపట్టింది.దేశంలో మళ్లీ కోవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఆరోగ్య శాఖ ప్రజలకు పలు సూచనలు జారీ చేసింది. ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రార్థన సమావేశాలు, సామాజిక సమావేశాలు, పార్టీలు, బహిరంగ కార్యక్రమాలు వంటి అన్ని సామూహిక సమావేశాలను తక్షణం నిలిపి వేయాలని పేర్కొన్నారు.

రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్‌లు, విమానాశ్రయాలలో అన్ని ఊఎఠఆ-19 ప్రవర్తన నియమావళి పాటించాలని స్పష్టం చేశారు.

వృద్ధులు (60 ఏళ్లు పైబడిన వారు) గర్భిణీ స్త్రీలను ఖచ్చితంగా ఇంటి లోపలే ఉండాలని సూచించారు.

మంచి పరిశుభ్రతను పాటించాలని-క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం, దగ్గు/తుమ్ములు వచ్చినప్పుడు నోటిని కప్పి, పదేపదే ముఖాన్ని తాకడం వంటి పనులు చేయొద్దని సూచించారు.

ప్రమాదకర ప్రాంతాలలో మాస్కులు ధరించాలని, రద్దీ ప్రదేశాలు, తక్కువ గాలి ప్రసరణ ఉన్న ప్రదేశంలో ఉంటే, మాస్క్ ధరించడం ద్వారా వైరస్ వ్యాప్తిని తగ్గించడంలో సహాయ పడుతుందని సూచించారు.

కోవిడ్ సంబంధిత లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షించుకోవాలని-ఊఎఠఆ-19 కేసులను ముందుగానే గుర్తించడంలో నిర్ధారణ పరీక్ష కీలకంగా ఉంటుందన్నారు.

కోవిడ్ ప్రభావిత దేశాలకు ప్రయాణించిన వ్యక్తికి పరీక్షలు చేయించుకోవాలని, సాధారణ లక్షణాలలో లక్షణాలు వ్యక్తిని బట్టి మారుతూ ఉంటాయని తేలికపాటి నుండి మితమైన లక్షణాలలో జ్వరం, చలి, దగ్గు, అలసట, గొంతు నొప్పి, రుచి లేదా వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాలు లేదా శరీర నొప్పులు, ముక్కు కారటం లేదా ముక్కు దిబ్బడ, వికారం, వాంతులు లేదా విరేచనాలు ఉంటాయి.

ఇలాంటి లక్షణాలు గమనించినట్లయితే నిర్ధారణ మరియు చికిత్స కోసం సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు.

అనారోగ్యంగా ఉంటే ఇంట్లోనే ఉండాలని ఇతరులను సంప్రదించకుండా ఉండటం ద్వారా ఇతరులను కోవిడ్ బారిన పడకుండా కాపాడొచ్చని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

ఆరోగ్య శాఖ ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలతో 24/7 ల్యాబ్‌లతో మాస్క్, ఖఖఇ కిట్, ట్రిపుల్ లేయర్ మాస్క్‌లను తగినంత పరిమాణంలో ఉంచుకోవాలని సూచించారు.

## అనుమానాస్పద స్థితిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి

రంగారెడ్డిరంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి మంగళపల్లి గేట్ వద్ద, సుప్రియ బాయ్స్ హాస్టల్ రెండవ అంతస్తు ఓ గదిలో ఉంటున్న, భారత్ ఇంజనీరింగ్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోలే నాగిరెడ్డి(32)

అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం జరిగింది. ఘటన స్థలానికి చేరుకున్న ఏసిపి కెపివి రాజు, సిఐ జగదీష్ హాస్టల్ గదిలో ఇద్దరు ఉంటున్నట్టు పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్ కి తరలించారు పోలే నాగిరెడ్డి, జంగమహేశ్వర గ్రామం, గురజాల మండలం, గుంటూరు జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు.

## ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.17 లక్షలు విరాళం

తిరుమల,

హైదరాబాద్ కు చెందిన పవర్ మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ ఎండీ శ్రీ సత్య రోహిత్ ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.17 లక్షలు విరాళంగా అందించారు.ఈ మేరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకులమండపంలో టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.ఈ విరాళాన్ని భక్తులకు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద భవనంలో ఒక పూట మధ్యాహ్నం భోజనంవడ్డించేందుకు ఉపయోగించాలని దాత కోరారు.

# డీఎస్సీలో ఒక్కో పోస్టుకు 25 మంది పోటీ

విజయవాడ, మే 23

డీఎస్సీ పరీక్షా కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు జరుగుతోంది. గడువుకంటే ముందే పరీక్షలు పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. రోజుకి 40 నుంచి 50 వేల మందికి రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే ఐయాన్ కేంద్రాలు ఎంపిక పూర్తయ్యింది.మెగా డీఎస్సీ-2025 పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మే 15వ తేదీతో ఆన్‌లైన్ అప్లికేషన్ల నమోదు గడువు పూర్తయిన సంగతి తెలిసిందే. ఇప్పటికే మొత్తం ఎంత మంది అభ్యర్థులు పరీక్షలు రాయబోతున్నారన్న డేటా అధికారుల వద్ద ఉంది. దీంతో పరీక్ష కేంద్రాల ఎంపికపై దృష్టి సారించారు. రోజుకి సరాసరి 40 నుంచి 50 వేల మందికి ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు. ఆ మేరకు కేంద్రాలను ఎంపిక చేస్తున్నారు.అధికారిక సమాచారం మేరకు.. ఇప్పటి వరకు అన్ని రకాల పరీక్ష కేంద్రాలు నిర్వహిస్తున్న టీసీఎస్ అయాన్ వారితో అధికారులు సంప్రదింపులు జరిపారు. జూన్ 6 తేదీ నుంచి జరగనున్న డీఎస్సీ పరీక్షలకు తమ కేంద్రాలను ఇచ్చేందుకు ఈ సంస్థ అంగీకరించింది. ఈ కేంద్రాలతోపాటు.. రాష్ట్రంలోని ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కళాశాలల్లో కూడా పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వారితోకూడా సంప్రదింపులు జరిపారని తెలిసింది.డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి ఎలాంటి డీవియేషన్స్, షెడ్యూల్ మార్పులు లేకుండా.. అధికారులు ముందుకెళ్తున్నారు. వారి స్పీడ్ చూస్తుంటే.. పరీక్షల కోసం ఇచ్చిన 30 రోజుల షెడ్యూల్ కంటే ముందే పూర్తిచేసేలా ఉన్నారు. ఇప్పటికే టీసీఎస్ అయాన్ కేంద్రాలు ఎంపిక చేయగా.. వాటి సామర్థ్యం రోజుకి సరాసరి 20 వేల మందికి రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించగలరు. వీటితోపాటు ఇంజినీరింగ్ కళాశాలలు అందుబాటులోకి వస్తే.. మరో 20 నుంచి 30 వేల మందికి ఒకేరోజు పరీక్షలు జరిపే వెసులుబాటు ఉంటుంది. ఈ లెక్కన రోజుకి 40 వేల మంది చొప్పున చూసుకున్నా.. గరిష్టంగా 20 రోజులు కూడా పరీక్షల నిర్వహణకు ఎక్కువే అని అధికారులు చెబుతున్నారు.ఎస్సీ వర్గీకరణ ఈ డీఎస్సీ నోటిఫికేషన్ నుంచే అమలు చేస్తున్నారు. ఆ మేరకు పోస్టులను ప్రకటించగా.. ఎంత మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు అన్నది కూడా అధికారులు తెలియజేశారు. ఎస్సీ జీఆర్ 1, జీఆర్ 2, జీఆర్ 3 కింద మూడు కేటగిరీల్లో వరుసగా.. 1,848, 45,419, 61,905 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేశారు. మొత్తం 16,347 ఉద్యోగాలకు 3,35,401 మంది అభ్యర్థులు వివిధ పోస్టులకు కలిపి 5,77,417 దరఖాస్తులను నమోదు చేశారు.ఒక్కో పోస్టుకు సరాసరి 35 మంది పోటీ పడనున్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్ల నమోదులో మహిళలు ముందంజలో ఉన్నారు. దాదాపు 2,03,647 మంది మహిళా అభ్యర్థులు, 1,31,754 మంది పురుషుల నుంచి దరఖాస్తులు వచ్చినట్లు ఎస్సీఆర్టీ డైరెక్టర్, డీఎస్సీ కన్వీనర్ కృష్ణారెడ్డి వెల్లడించారు. ఈ నెల 30వ తేదీ నాటికి హాల్‌టికెట్లు విడుదల చేస్తామని ఆయన చెప్పారు.డీఎస్సీ పోస్టులు అధికంగా ఉన్న కర్నూలు జిల్లాలకు సంబంధించి అభ్యర్థుల నుంచి భారీగా దరఖాస్తులు నమోదయ్యాయి. మొత్తం 2678 పోస్టులు ఉండగా.. 39,997 మంది అభ్యర్థుల నుంచి మొత్తం 73,605 అప్లికేషన్లు వచ్చాయి. నెల్లూరు జిల్లాలో మొత్తం పోస్టులు 673 ఉండగా... 15,993 మంది అభ్యర్థుల నుంచి 28,772 అప్లికేషన్లు వచ్చాయి. ఇక్కడే అత్యల్పంగా దరఖాస్తులు వచ్చాయి. ఇతర రాష్ట్రాల నుంచి 7,159 మంది అభ్యర్థుల నుంచి 10,143 అప్లికేషన్లు వచ్చాయి.

# గండికోట జలాశయ పునర్వసతి ప్యాకేజీలో అక్రమాలు.

## ఆర్డీఓ వినాయకంపై ర్యాంక్ తగ్గింపు

## గతంలో వినాయకం బద్వేల్ ఎమ్మార్వో

బద్వేలు

కడపలోని గండికోట జలాశయం పునర్వసతి ప్యాకేజీలో ప్రభావితులకు ఆర్థిక సహాయం అందజేయడంలో అక్రమాలు చేసినందుకు జమ్మలమడుగు ఆర్డీఓ కె. వినాయకంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కఠిన చర్య తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (వర్గీకరణ, నియంత్రణ ఢ అప్పీల్) నియమాల ప్రకారం జరిగిన విచారణలో 21 ఆరోపణల్లో 15 పూర్తిగా నిరూపితమయ్యాయి. దాంతో, రెవెన్యూ (విజిలెన్స్) శాఖ శుక్రవారం (24-02-2025) జారీ చేసిన జీఓ ఆర్టీ నంబర్ 148 ప్రకారం, వినాయకంపై "ర్యాంక్ తగ్గింపు" శిక్ష విధించబడింది.

2017లో కడప కలెక్టర్ నుండి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా వినాయకపై నియమం-20 ప్రకారం క్రమశిక్షణా చర్యలు ప్రారంభమయ్యాయి. ఆయన 2018లో తన రక్షణ వాదనను సమర్పించినా, కడప జాయింట్ కలెక్టర్ నేతృత్వంలోని విచారణ సంఘం 2023లో తన నివేదికలో 21 ఆరోపణల్లో 15 పూర్తిగా, 2 పాక్షికంగా నిరూపితమని పేర్కొంది. ఈ నివేదికను 2024 జనవరిలో వినాయకకు అందజేసినప్పటికీ, ఆయన నుంచి సరైన సమాధానం అందలేదు.

ప్రభుత్వం ఈ పరిణామాల దృష్ట్యా వినాయకను డిప్యూటీ కలెక్టర్ హోదా నుంచి ర్యాంక్ తగ్గిస్తూ శిక్షను అమలు చేయాలని ఆదేశించింది. ఈ ఆదేశాల అమలు బాధ్యత కడప కలెక్టర్ మరియు భూమి సంఘం చీఫ్ కమిషనర్ (మంగళగిరి) ఆధీనంలో ఉంటుంది. ప్రస్తుతం పల్నాడు జిల్లా డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వినాయకంపై తక్షణమే ఈ శిక్ష అమలు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఈ చర్య "సర్వీస్ నియమాల పట్ల నిర్లక్ష్యం" కారణంగా తీసుకున్నది అని ప్రభుత్వం వివరించింది. ఈ అంశంలో మరిన్ని చర్యలు భూమి సంఘం చీఫ్ కమిషనర్ మరియు కడప కలెక్టర్ చేపట్టాలని ఆదేశించారు.

# ఇద్దరు అంతర్ జిల్లా దొంగలు అరెస్ట్.

మైదుకూరు (బ్రహ్మంగారిమఠం)

ది లక్షల విలువ చేసే 8 మోటర్ బైక్ లను స్వాధీనం చేసుకుని ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసినట్లు మైదుకూరు అర్బన్ సీఐ రమణారెడ్డి తెలిపారు శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో




విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు వీరు అనేక ప్రాంతాలలో దొంగతనాలు చేసి గతంలోనే కేసులు నమోదు అయ్యాయని ఆయన తెలిపారు ఈ సమావేశంలో మైదుకూరు ఎస్సై సుబ్బారావు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు ఈ సందర్భంగా అర్బన్ సిఐ మాట్లాడుతూ ఈ దొంగల కేసులో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్ వెంకట కిరణ్ ప్రసాద్ రాజు శివ గణేష్ నవీన్ తిరుమలయ్య ప్రసాద్ లను మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్ అభినందించారని ఆయన తెలిపారు త్వరలో వారికి రివార్డ్స్ కూడా ప్రకటించినట్లు తెలిపారు.

# గద్దర్ సతీమణి ఆపరేషన్ కగార్ ను తక్షణమే నిలిపివేయాలి

## మావోయిస్టులచే శాంతి చర్చలు జరపాలి

## గవర్నర్ను కోరిన గద్దర్ సతీమణి విమల

హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఆపరేషన్ కగారును తక్షణమే నిలిపివేసి మావోయిస్టులచే శాంతి చర్చలు జరిపేలా కేంద్రానికి



విన్నవించాలని ప్రజాకవి గద్దర్ సతీమణి విమల గవర్నర్ విష్ణు దేవ్ వర్మ కు విజ్ఞప్తి చేశారు. రాజ్ భవన్ లో కుమార్తె వెన్నెల, దళిత నాయకుడు జిబి రాజులతో కలిసి ప్రతిపత్రం అందజేశారు. అనంతరం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో విలేకరితో మాట్లాడారు. కేంద్ర కగార్ లో ఆదివాసీలు ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని అన్నారు. దేశం పై దాడి చేసిన శత్రు దేశానికి చెందిన వారితో చర్చలకు సిద్ధపడుతున్న ప్రభుత్వం ఈ దేశంలోనే పుట్టి ఇక్కడి ప్రజల సమస్యల కోసం పోరాడుతున్న వారితో చర్చలు జరపడానికి సమస్య ఏమిటంటే ప్రశ్నించారు. ఎన్కౌంటర్ చేయాల్సింది ఆదివాసి బిడ్డలను కాదని సమస్యలను ఎన్కౌంటర్ చేయాలని సూచించారు. తమ వినతిపత్రం అందుకున్న గవర్నర్ సానుకూలంగా స్పందించారని అన్నారు.

# ప్రభుత్వ నిబంధనల మేరకే రేషన్ పంపిణీ జరగాలి:జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్






కడప, మే 23(భారత శక్తి) : ప్రభుత్వ నిబంధనలకు లోబడి.. రేషన్ సరుకులను వినియోగదారులకు సరఫరా చేయాలని, ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తప్పవని జేసీ అదితిసింగ్ రేషన్ షాపు డీలర్లకు సూచించారు.జూన్ 1 వ తేదీ నుంచి ప్రజాపంపిణీ విధానము ద్వారా పంపిణీ చేసే నిత్యావసర వస్తువులను ఎఫ్.పి. షాపుల (చౌక దుకాణాల)ద్వారానే పంపిణీ చేయడం జరుగుతుందనే అంశంపై గురువారం సాయంత్రం కాలెక్టరేట్ లోని సభా భవన్ లో జిల్లాలోని డీలర్లలతో జేసీ అదితిసింగ్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇక నుండి ప్రతి నెల 1 వతేదీ నుండి 15 వతేదీ వరకు ప్రతి రోజు ప్రభుత్వం వారు నిర్దేశించిన సమయాల్లో ఉదయము 8.00 నుండి 12.00 గంటల వరకు మరియు సా. 4.00 గంటల నుండి 8.00 గంటల వరకు ఎఫ్.పి. షాపులను తెరిచి ఉంచాలని రేషన్ డీలర్లకు ఆదేశించారు. ఎఫ్.పి. షాప్ నెం. పని వేళలు ధరలు, సరుకు నిల్వను సూచించే బోర్డును తప్పని సరిగా డిస్ప్లే చేయాలన్నారు. 65 సంవత్సరాలు పైన బడిన వారికి , దివ్యంగులకు వారి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఎఫ్.పి. షాపుల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతిరోజు ఎంతమందికి సరుకులు సరఫరా చేస్తున్నారు అనే అంశాన్ని.. ప్రతి రేషన్ డీలర్ షాపులో ఫోటోలతో సహా రికార్డ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ.పాస్, వేయింగ్ మిషన్లు కండిషన్ లో ఉంచుకోని కార్డుదారులందరికి ఖచ్చితమైన తూకంతో నిత్యావసర వస్తువు లను పంపిణీ చేసి రశీదును కూడా ఇవ్వాలని సూచించారు. ఎఫ్.పి. షాప్ లను ఒక మినీ మార్ట్ లాగా నిర్వహించేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. తద్వారా డీలర్లకు కొంతమేర ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఇక మీదట నిత్యావసర వస్తువులు రేషన్ షాపుల ద్వారానే పంపిణీ చేయడం జరుగుతుందన్న విషయాన్ని కార్డు దారులందరు గమనించాలని, డీలర్లు కూడా ఈ విషయాన్ని ప్రతి కార్డు హోల్డర్ కుటుంబానికి తెలియజేయాలన్నారు. అనంతరం రేషన్ షాపు డీలర్లకు ఎదురయ్యే సమస్యలను జేసీ అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో డిఎస్ఓ జి. చాముండేశ్వరి, డిఎం వెంకటేశ్వర్లు, ఏఎస్ఓ రెడ్డి చంద్రిక, ఎఫ్.పి. షాపుల డీలర్లు, పౌర సరఫరాల శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ నివేదిక ఆధారంగా సూర్యాపేట డి ఎం హెచ్ ఓ కోటాచలం ను బాధ్యతలనుండి తొలగింపు

## -ఇన్చార్జ్ డిఎంహెచ్ ఓ గా డాక్టర్ చంద్రశేఖర్ ను నియమించిన ప్రభుత్వం

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) మే 23:సూర్యాపేట జిల్లా లో వైద్య ఆరోగ్య శాఖ పరిస్థితి నానాటికి దారుణంగా తయారు కావడంతో సూర్యాపేట డిఎంహెచ్ఓ గా పనిచేసిన కోటాచలంపై సూర్యాపేట జిల్లాలో అనేక ఆరోపణలతో ఫిర్యాదులు అందడంతో ఎట్టకేలకు సూర్యాపేట జిల్లా కలెక్టర్ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డిఎంహెచ్ఓ డాక్టర్ కోట చలం ను డిఎంహెచ్ఓ సూర్యాపేట భాధ్యతల నుండి తప్పించారు. ఆయన స్థానంలో ఎల్ బి నగర్ డిఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్ ను సూర్యాపేట జిల్లా కు ఇంఛార్జ్ డిఎంహెచ్ఓ గా నియమించినట్లు వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ ప్రకటనలో తెలిపారు.



# అటెన్షన్ లో కేంద్రమంత్రులు

న్యూఢిల్లీ, మే 23,

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీకి వస్తున్నారంటే కేంద్ర మంత్రుల్లో గుండె దడ మొదలవుతుంది. ఆయన ఫైళ్లు పట్టుకుని మరీ వచ్చి రాష్ట్రానికి సంబంధించిన నిధులు, ప్రాజెక్టుల కోసం వస్తారు. అందుకే చంద్రబాబు ఢిల్లీ టూర్ అంటే కేంద్ర మంత్రులు ఆయన ఏ ప్రతిపాదనలు తీసుకు వస్తారోనన్న ఉత్కంఠ వారిలో నెలకొంటుందట. ఏ ముఖ్యమంత్రి కూడా ఢిల్లీకి ఇన్నిసార్లు వచ్చి తమ రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులు, నిధుల కోసం ప్రయత్నించడం లేదని, కానీ చంద్రబాబు మాత్రం నెలలో రెండు సార్లు ఢిల్లీకి వచ్చి తమను కలసి వినతులను సమర్పించి తమ పనులను సాధించుకు వెళుతున్నారని కేంద్ర మంత్రులే అనుకుంటున్నారట. చంద్రబాబు నాయుడు నేడు ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. మూడు రోజుల పాటు ఢిల్లీలోనే చంద్రబాబు ఉండనున్నారు. నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీకి బయలుదేరి వెళతారు. రేపు కేంద్ర మంత్రులను చంద్రబాబు కలవనున్నారు.కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో పాటు ఏడుగురు కేంద్ర మంత్రులతో శుక్రవారం భేటీ కానున్నారు.

# భూమా...గీతా దాటేస్తోందా...

కర్నూలు, మే 23

ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. క్రమశిక్షణతో ఉండాలని సూచిస్తున్నారు.వివాదాస్పద నియోజకవర్గాలపై టిడిపి నాయకత్వం దృష్టిపెట్టిందా? అక్కడ ఎమ్మెల్యేలతో నష్టం జరుగుతోందని గుర్తించిందా? అందుకే దిద్దుబాటు చర్యలకు దిగనుందా? వారి స్థానంలో ఇంచార్జ్ లకు బాధ్యతలు అప్పగించనుందా? అంటే అవును అనే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి తీవ్ర నష్టం జరుగుతున్న నియోజకవర్గాలపై టీడీపీ హై కమాండ్ దృష్టి పెట్టినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 11 అసెంబ్లీ నియోజకవర్గాలలో కొత్త ఇన్చార్జిలను నియమించడానికి కూడా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో ఎక్కువగా రిజర్వుడ్ నియోజకవర్గాలు ఉండడం విశేషం.ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. క్రమశిక్షణతో ఉండాలని సూచిస్తున్నారు. అయినా సరే కొందరు ఎమ్మెల్యేల తీరులో మార్పు రావడం లేదు. ఈ క్రమంలోనే కఠిన చర్యలకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా తిరువూరు, రైల్వే కోడూరు, రాజంపేట, సింగనమల, ఆళ్లగడ్డ నియోజకవర్గాలు ఈ జాబితాలో ఉన్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తరచు వివాదాల్లో చిక్కుకోవడం పార్టీకి మైనస్ గా మారింది. అందుకే చాలాసార్లు హెచ్చరించినా.. ఫలితం లేకపోవడంతో వారి స్థానంలో ఇన్చార్జిలను తెస్తారని తెలుస్తోంది. అదే జరిగితే విభేదాలు మరింత ముదరడం ఖాయం.నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలోఎమ్మెల్యే అఖిల ప్రియ పరిస్థితి మరింత వివాదంగా మారుతోంది. ఇక్కడ సొంత పార్టీ శ్రేణులే ఆమె తీరును వ్యతిరేకిస్తున్నారు. అందుకే సీఎం చంద్రబాబు తో పాటు మంత్రి లోకేష్ ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇక్కడ టిడిపి సమన్వయకర్తగా చింతకుంట శ్రీనివాసరెడ్డి నియమించడానికి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. శ్రీనివాస్ రెడ్డికి రాజకీయ నేపథ్యం ఉంది. ఈయన తాత సిపి తిమ్మారెడ్డి గతంలో ఎమ్మెల్యేగా పనిచేశారు. ఎమ్మెల్యే అఖిలప్రియ కు సమీప బంధువు కూడా. అఖిల ప్రియ తీరు రోజురోజుకు వివాదంగా మారడంతో.. ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని చూసుకోవాలని టిడిపి హై కమాండ్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా శ్రీనివాస్ రెడ్డిని ఇన్చార్జిగా నియమిస్తారని సమాచారం. శ్రీనివాసరెడ్డిరియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. హైదరాబాద్ తో పాటు రాజమండ్రిలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొనసాగుతున్నారు. ఇటీవల కాలంలో చికెన్ సెంటర్ ల నుంచి కూడా అఖిలప్రియ అనుచరులు కమిషన్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు టిడిపి ప్రతిష్టను మరింత ఇబ్బందుల్లో పెట్టాయి. స్థానిక పార్టీ శ్రేణులు సైతం అఖిలప్రియ తీరుపై హై కమాండ్కు ఎప్పటికప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ క్రమంలో టిడిపి పెద్దలు అక్కడ నాయకత్వం మార్పుతోనే వ్యతిరేకత తగ్గించుకోవాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అందుకే శ్రీనివాస్ రెడ్డికి ఆళ్లగడ్డ నియోజకవర్గం అప్పగిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

# విజయోత్సవ సభ: -నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో

ఎమ్మిగనూరు మే 23

పట్టణంలో స్థానిక ఏపీఎస్ఆర్టీసీ డిపో నందు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సభ్యులు విజయోత్సవ సభ జరుపుకున్నారు. గతంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎండికి ఇచ్చిన మెమరానంపై వారు రెండు రోజులు నిరసన రెండు రోజులు ధర్నా రెండు రోజులు ప్లేకార్డులతో నిరసన రెండు రోజులు రిలే నిరాహార దీక్షలు మరియు తాసిల్దార్ క గారికి మెమోరాండం ఇచ్చే కార్యక్రమం పంచలు అంచలుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల్లో నిరసనలు తెలిపారు. దానికి ఫలితంగానే ఏపీఎస్ఆర్టీసీలో 1/2019 సర్కులర్ ను పునరుద్ధరించాలని, చేసిన డిమాండ్ ను ఎట్టకేలకు ఏపీఎస్ఆర్టీసీ ఈడీలతో జరిగిన చర్చలలో ఫలితంగా ప్రభుత్వం 1/2019 సర్కులర్ ను పునరుద్ధరించింది. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ పెట్టిన మిగతా డిమాండ్లను ఒప్పుకుంటున్నట్లు ప్రకటించిన ప్రభుత్వ నిర్ణయం ద్వారా 48 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులకు గురట కలిగింది. ఈ విషయమై ఎమ్మిగనూరు డిపో లోని ఉద్యోగులంతా ఆర్టీసీ ఎం డి కి ధన్యవాదములు తెలిపారు. అదే కాకుండ ఈ విజయం సాధించుటకు నేషనల్ మద్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు ప్రత్యేక ధన్యవాదములు ఎమ్మిగనూరు డిపో మరియు గ్యారేజీ ఉద్యోగులు సభాముఖంగా తెలిపారు. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకలు తప్ప అన్నట్లు నేషనల్ మద్దూర్ యూనిటీ అసోసియేషన్ ఒక్కటే తన పోరాటాన్ని కొనసాగించడం గమనర్హం. ఈ విషయమై చొరవ తీసుకున్న సీఎం చంద్రబాబు నాయుడు గారిని మరియు మంత్రి మండిపల్లి గారికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమానికి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజినల్ సహాయ కార్యదర్శి ఎన్ పి ఎం సాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి ముస్తాక్ అహ్మద్, సహాయ కార్యదర్శి షరీఫ్, సురేష్ బాబు, లక్ష్మిరెడ్డి, బజార్ అప్ప, గ్యారేజీ కార్యదర్శి భాస్కర్, ఓంకార్, యూనసు లతోపాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

# పూతరేకుల తయారీలో కల్తీ నెయ్యి

ఆత్రేయపురం

ఆత్రేయపురం పేరు చెప్పగానే మొదటిగా గుర్తొచ్చేది పూతరేకులు అటువంటి పూతరేకుల్లో నెయ్యికి బదులు కల్తీ నెయ్యి వాడుతున్నట్టు ఫిర్యాదులు రావడంతో గతంలో ఆహార భద్రత అధికారులు దాడులు చేసి సుమారు 400 కేజీలు కల్తీ నెయ్యి పట్టుకోవడం జరిగింది . ఈరోజు ఉదయం ఆత్రేయపురం లక్ష్మి డ్రై ఫుడ్ షాపులో కల్తీ నెయ్యి ఉన్నట్టు స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు దాడి చేసి సుమారు 80 కేజీలు కల్తీ నెయ్యి పట్టుకుని ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందించారు.ఇప్పటికైనా అధికారులు కఠిన చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పూతరేకులు తయారీలో కల్తీ నెయ్యి అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# టిటిడి ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యునిగా దివాకర్ రెడ్డి ప్రమాణస్వీకారం

తిరుమల,

టిటిడి ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యునిగా తుడ ఛైర్మన్ దివాకర్ రెడ్డి శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి చెంత టిటిడి అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. దివాకర్ రెడ్డి శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం అదనపు ఈవో శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్నిఅందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, బోర్డు సెల్ డిప్యూటీ ఈఓ ప్రశాంతి, విజిఓ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నందిగం భార్య ఆడియో వైరల్

గుంటూరు, మే 23, (

ఆలూ లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్టు ఉంది ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల పరిస్థితి. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. ఇంకా కూటమికి నాలుగేళ్ల పదవీకాలం ఉంది. అయితే 2029 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది తామేనంటూ వైయస్సార్ కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరికొందరైతే పలానా పదవి తమదేనంటూ చెప్పుకొస్తున్నారు. మరోవైపు నేతల భార్యలు సైతం పెద్ద పెద్ద పదవులు తమ వేనంటూ బాహటంగా చెబుతున్నారు. అసలు రాజకీయాలతో సంబంధం లేని వారు సైతం ఇటువంటి వ్యాఖ్యలు చేస్తుండడం విశేషం. అయితే తాజాగా మాజీ ఎంపీ నందిగాం సురేష్ భార్య బేబీ లత అయితే.. తనను హోం మంత్రి అంటూ అంతా పిలుస్తున్నారని చెప్పుకొస్తున్నారు. ఆమెకు సంబంధించి ఓ ఆడియో సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తీవ్ర చర్చకు దారితీస్తోంది.బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ ఇటీవల అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనను ఓ హత్య కేసులో అరెస్టు చేశారు. సుమారు మూడు నెలల పాటు ఆయన గుంటూరు జైల్లోనే గడిపారు. మొన్న ఆ మధ్యన బెయిల్ పై విడుదలయ్యారు. అయితే ఇటీవల మరో కేసులో అరెస్టయ్యారు. అయితే సురేష్ ఎంపీగా ఉండగా ఆయన భార్య బేబీ లత ఎన్నడూ బయటకు రాలేదు. ఆయన అరెస్ట్ అయిన తర్వాత తరచూ జైలుకు రావడం, బెయిల్ ప్రయత్నాలు చేయడం వంటివి చేస్తూ వస్తున్నారు. అయితే ఆమె ఓ మహిళ న్యాయవాదితో చేసిన సంభాషణ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వచ్చే ఎన్నికల్లో తప్పకుండా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని.. మీరు హోం మంత్రి అవుతారని ఆ న్యాయవాది చెప్పిన ఆడియో రాజాగా వైరల్ అవుతోంది. అయితే మీరు ఒక్కరే కాదు చాలామంది అలానే అంటున్నారని.. అలా అనడం చాలా ఆనందంగా ఉందని బేబీ లత బదులు ఇవ్వడం విశేషం.మాజీ ఎంపీ సురేష్ తరపున ఆయన కేసులను వాదిస్తున్న ఓ మహిళా న్యాయవాది ఇటీవల ఆయన భార్య బేబీ లతకు ఫోన్ చేశారట. ఈ సందర్భంగా వారి మాటల మధ్యలో ఈసారి సురేష్ బదులుగా బేబీ లతకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తారని.. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రాష్ట్ర హోం మంత్రి అవుతారంటూ ఆ న్యాయవాది చెప్పినట్లు ఆ ఆడియో లో ఉంది. అదే సమయంలో తాను సురేష్ తో ములాకత్ అయ్యేందుకు జైలుకు వెళ్ళగా.. అక్కడ గతంలో తనతో దురుసుగా వ్యవహరించిన ఓ సి ఐ కూడా ఇదే మాదిరిగా అన్నారని బేబీ లతా చెప్పుకొచ్చారు. మీరు కాబోయే హోం మంత్రి.. మమ్మల్ని గుర్తుపెట్టుకోండి అంటూ ఆ సీఐ తనతో చెప్పినట్టు బేబీ లత ఆడియోలో పేర్కొన్నారు. అయితే ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల వ్యవధి ఉంది. అప్పుడే పదవుల కోసం కలలు కంటున్నారంటూ సోషల్ మీడియాలో సెటైర్లు పడుతున్నాయి. అయితే ఈ ఆడియో పై బేబీ లత కానీ.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కానీ ఇంతవరకు స్పందించలేదు.

## డీజేటీ హైకా ఈవీ ఛార్జింగ్ సదుపాయాలను ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్

అమరావతి మే 23,

ప్రముఖ విద్యుత్ వాహనాల ఉత్పత్తుల తయారీ సంస్థ డీజేటీ హైకా ఆధ్వర్యంలోని అధునాతన ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను మంత్రి డా. కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిశుభ్రమైన, స్థిరమైన రవాణాను ప్రోత్సహించే దిశగా ఒక అద్భుతమైన అడుగు ఇది అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డీజేటీ హైకా అభివృద్ధి చేసిన 60 కిలోవాట్ డీసీ ఫాస్ట్ ఛార్జింగ్ మెషిన్, 240 కిలోవాట్ డీసీ అల్ట్రా-ఫాస్ట్ ఛార్జింగ్ మెషిన్, 3.3 కిలోవాట్, 7.4 కిలోవాట్ ఏసీ ఛార్జర్లను రాష్ట్రంలో ప్రారంభించడం ఒక గొప్ప ముందడుగు అని పేర్కొన్నారు. విద్యుత్ వాహనాలు(ఈవీ) శబ్ద, వాయు కాలుష్యాలను తగ్గించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను పునరుద్ధరించడంలో గణనీయమైన పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. పర్యావరణ కాలుష్యం పెరిగిపోతున్న నేపథ్యంలో సమాజం శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని సూచించారు. అందుకు ప్రత్యామ్నాయంగా విద్యుత్ ఆధారిత వాహనాల వైపు మళ్లాల్సిన అవసరం ఉందని వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. మనం నివసించే పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవడమే కాకుండా, స్వచ్ఛమైన సాంకేతికత, పర్యావరణహిత ఇంధనాన్ని ప్రోత్సహించాలని మంత్రి డా. శ్రీనివాస్ కోరారు. తద్వారా భారతదేశ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతమవుతుందని అభిప్రాయపడ్డారు.

దేశీయంగా ఈవీ విస్తృతిని పెంపొందించేందుకు భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలు సబ్సిడీలు, ప్రోత్సాహకాలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నాయని వివరించారు. ఈ సహకారం వినియోగదారులు, వ్యాపారులు పర్యావరణహిత వాహనశ్రేణి వైపు మారడాన్ని ప్రోత్సహిస్తుందని ఆయన పేర్కొన్నారు.

పలు రాష్ట్రాలతోపాటు ఏపీలోనూ..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డీజేటీ హైకా సంస్థ ఈవీ ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్ల అతిపెద్ద తయారీదారుగా అవతరిస్తోందని మంత్రి డా. కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విశాఖపట్నంలో పరిపాలనా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని, రాష్ట్రమంతటా సేవలను విస్తరిస్తోందని వివరించారు. డీజేటీ హైకా ఇప్పటికే హర్యానా, ఢిల్లీ, మహారాష్ట్ర, తమిళనాడు సహా దేశంలోని పలు ఇతర ప్రాంతాలలోనూ ఈవీ చార్జింగ్ మెషిన్లను అందుబాటులోకి తెచ్చిందని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్లో తన పరిధిని విస్తరిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల ఎంటర్ప్రైజెస్ అధినేత యడ్ల పార్ధసారథి తదితరులు పాల్గొన్నారు.

## కడప జిల్లాలో కరోనా నమోదు కాలేదు: డిఎంహెచ్వో

కడప మే 23

కడప జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు కరోనా కేసులు నమోదు కాలేదని డిఎంహెచ్వో నాగరాజు తెలిపారు. షేక్ గౌసిన్ మోదిన్ బీబీ అనే మహిళ దగ్గు, జలుబు, జ్వరంతో కడప రిమ్స్ కు వస్తే కోవిడ్ వార్డులో అడ్మిట్ చేశారే తప్ప, ఆమెకు కరోనా లక్షణాలు లేవన్నారు


## ఎర్రవల్లి లోని ఫాంహౌస్‌లో కేసీఆర్.. హరీశ్ కీలక మంతనాలు

గజ్వేల్ మే 23

ఎర్రవల్లిలో కేసీఆర్ తో భేటీ అయిన మాజీ మంత్రి హరీశ్ రావుకాళేశ్వరం కమిషన్ నోటీసుల నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యత.

15 రోజుల్లో విచారణకు రావాలని కమిషన్ ఆదేశం.

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాజీ మంత్రి హరీశ్ రావు సమావేశమయ్యారు. హరీశ్ రావు ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసానికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నుంచి నోటీసులు అందిన నేపథ్యంలో వీరిద్దరి మధ్య జరిగిన ఈ సమావేశానికి రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది.



కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పలు అంశాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇటీవల కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్ రావు, ప్రస్తుతం బీజేపీ ఎంపీగా ఉన్న అప్పటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌కు కూడా కమిషన్ నోటీసులు పంపింది. నోటీసులు అందుకున్న 15 రోజుల్లోగా కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని అందులో స్పష్టం చేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నాణ్యత, నిర్మాణంలో లోపాలు తదితర అంశాలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ లోతుగా విచారణ జరుపుతోంది. కేసీఆర్ ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. ఆ ప్రభుత్వంలో హరీశ్ రావు నీటిపారుదల శాఖ మంత్రి గా కీలక బాధ్యతలు నిర్వర్తించగా, ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా వ్యవహరించారు ఈ క్రమంలోనే వీరికి కమిషన్ నోటీసులు జారీ చేసింది.

# అలా మారిపోతున్నారేంట్రా...

విశాఖపట్టణం, మే 23,

ఏపీలో వైసీపీకి వరుసగా అన్నీ ఎదురు దెబ్బలే తగులుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత ఫ్యాన్ పార్టీకి అన్నీ కష్టాలే ఎదురవుతున్నాయన్న టాక్ విన్పిస్తోంది. ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీకి ఇప్పటికే చాలా మంది సీనియర్లు గుడ్ బై చెప్పారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు..ఇలా వరుసపెట్టి నేతలు కూటమి పార్టీల్లోకి క్యూ కట్టారు. మరికొంతమంది కూడా పార్టీకి గుడ్ బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారట.ఇలా పార్టీ నుంచి నేతలంతా జారుకుంటుంటే అటు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను సైతం కూటమి దక్కించుకుంటుంది. ఇప్పటికే మెజార్టీ కార్పొరేషన్లను దక్కించుకున్న కూటమి?తాజాగా మున్సిపాలిటీలను కూడా తన ఖాతాలో వేసుకుంటూ వైసీపీకి వరుస షాకులిస్తోంది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఆపార్టీకి అన్నీ ఎదురుదెబ్బలే తగుతున్నాయి. మున్సిపాలిటీలు చేజారకుండా వైసీపీ ఎన్ని ప్రయత్నాలు చేసినా..సైకిల్ దెబ్బకు ఆపార్టీ మున్సిపాలిటీలన్నీ కూటమి వశం అవుతున్నాయి.ఇప్పటికే మెజార్టీ మున్సిపాలిటీలను తన ఖాతాలో వేసుకున్న కూటమి..తాజాగా కదిరి మున్సిపాలిటీని కూడా టీడీపీ కైవసం చేసుకుంది. ఛైర్‌పర్సన్‌గా దిల్షా దున్నీషా ఎన్నికకాగా..వైస్ చైర్మన్లుగా సుధారాణి, రాజశేఖర్ ఆచారి సైతం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే ఈ ఎన్నికను వైసీపీ బహిష్కరించింది. కదిరి మున్సిపాలిటీలో మొత్తం 36 మంది కౌన్సిలర్లు ఉండగా..వైసీపీకి చెందిన 11 మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. దీంతో 25 మంది మద్దతులో దిల్ షాదున్నీసా చైర్ పర్సన్ గా ఎన్నికయ్యారు. గాండ్లపేట ఎంపీపీగా గజ్జెల సోముశేఖర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొత్తం ఏడుగురు ఎంపీటీసీల్లో నలుగురు టీడీపీ సభ్యులు హాజరుకాగా?ముగ్గురు వైసీపీ సభ్యులు రాలేదు.ఇదిలా ఉంటే మరోవైపు విజయనగరం జిల్లా బొబ్బిలి మున్సిపల్ ఛైర్మన్‌గా టీడీపీకి చెందిన శరత్‌బాబు ఎన్నికయ్యారు. గత నెల 29న ఛైర్మన్ మురళీకృష్ణారావుపై అవిశ్వాసం ప్రవేశపెట్టగా..అవిశ్వాస ఓటింగ్‌లో టీడీపీ గెలిచింది. దీంతో మురళీకృష్ణారావు ఛైర్మన్ పదవి కోల్పోయారు. మొత్తం 20 మంది సభ్యుల మద్దతుతో బొబ్బిలి మున్సిపాలిటీ కూటమి ఖాతాలోకి చేరింది.ఇక తిరువూరు నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నిక వాయిదాపడింది..కోరం లేకపోవడంతో వచ్చే మంగళవారానికి ఎన్నికను వాయిదా వేశారు. మొత్తం 20 మందికి గాను ఏడుగురు మాత్రమే హాజరుకావడంతో వాయిదా వేస్తూ ఎన్నికల అధికారి నిర్ణయం తీసుకున్నారు. అలాగే శ్రీసత్యసాయిజిల్లా రామగిరి ఎంపీపీ ఎన్నిక మూడోసారి వాయిదా పడింది. వైసీపీ ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి గైర్హాజరుకావడంతో ఎన్నిక వాయిదా పడింది. గతంలో కోరంలేక ఎంపీపీ ఎన్నిక రెండుసార్లు వాయిదా పడింది.ఏపీలో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆపార్టీ మున్సిపల్ పీఠాలను దాదాపుగా దక్కించుకుంది. అయితే వీటిని ఫ్యాన్ పార్టీ నుంచి లాగేసుకునేందుకు కూటమి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. తొలుత ఈ ప్రయత్నాలన్నీ విఫలమైనా?ప్రస్తుతం వైసీపీ మున్సిపాలిటీలన్నీ కూటమి ఖాతాలో వచ్చి పడుతున్నాయి. ఆయా కార్పొరేషన్లలో సైతం విపక్ష పార్టీ పని అయిపోయిందన్న టాక్ ఏపీ రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది.ఫ్యాన్ పార్టీ పాగా వేసిన కీలక స్థానాలన్నింటిని కూటమి కూకటివేళ్లతో సహా పెకిలిస్తోంది. వైసీపీ కంచుకోటలను ఆ మూడు పార్టీలు బద్దలు కొడుతుండడంతో ఏపీలో ఇప్పటికే మెజార్టీ మేయర్ పీఠాలన్నీ కూటమి ఖాతాలోకి వెళ్లాయి. రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తమకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని ఆ పార్టీ కార్పొరేటర్లు అంటున్నారట. ఆయా మున్సిపాలిటీల్లో ఛైర్మన్లు, కార్పొరేషన్లలో మేయర్లు వైసీపీకి అనుకూలంగా పనిచేశారే తప్ప ప్రజాప్రతినిధులుగా పనిచేయలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.వైసీపీ అధికారం కోల్పోవడంతో వైసీపీ మేయర్లంతా ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయారట. అప్పటికే అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లను కూటమి పార్టీలు ఆహ్వానించాయి. దీంతో ఎవరి అవసరం కోసం వారు ఆయా పార్టీల్లో చేరిపోయారు. మెజార్టీ పెరిగిన కూటమి పార్టీలు ఆయా కార్పొరేషన్లలో మేయర్లపై అవిశ్వాసం పెట్టించారు.వైసీపీ ఓడిపోవడంతో ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్లన్నీ కూటమి పార్టీల చేతుల్లోకి వెళ్లిపోయాయి. మొత్తానికి సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోవడంతో ఏ జిల్లాలోనూ కనీస మెజార్టీ లేకపోవడంతో కూటమికి అన్ని విధాలుగా పైచేయి లభించినట్లు అయిందన్న టాక్ విన్పిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే రహదారులు, మంచినీటి సమస్య, డ్రైనేజి ఇతర మౌలిక సదుపాయాలు వంటి సమస్యలన్నింటినీ పరిష్కరించే ప్రయత్నం చేయడంతో ప్రజల్లో సానుకూలత పెరిగిందని టాక్.

=====================

# గంటా శ్రీనివాస్ కొడుకు తెలిసి తెలియనతనమా...

విశాఖపట్టణం, మే 23

జోహార్ ఎన్టీఆర్, అంటూ అదే ఫ్లో లో బతికి ఉన్న వాళ్లకు జోహార్ చెప్పేశారు? ఓ యువనేత. రాజకీయాల్లో ఓటమి తెలియని మాజీ మంత్రి గంటా శ్రీనివాస్ కొడుకు నోటి నుండి వచ్చిన పలుకులివి. తండ్రి ఏమో రాజకీయాల్ని శాసించే స్థాయికి ఎదిగి ఓటమి తెలియని నాయకుడిగా ముద్ర వేయించుకుంటే రాజకీయ ఆరంగేట్రానికి సిద్ధంగా ఉన్న కొడుకు రవితేజ తన తెలిసీ తెలియనితనంతో అందరిలో నవ్వులపాలవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ముఖ్యంగా ఉమ్మడి విశాఖ జిల్లా రాజకీయాల్లో ఓటమి తెలియని నాయకుడు ఎవరు అంటే ఠక్కున గుర్తొచ్చే పేరు మాజీ మంత్రి ప్రస్తుత భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు... ఓటమి ఎరగని రాజకీయ నాయకుడిగా పేరున్న గంటా శ్రీనివాసరావు 4 సార్లు ఎమ్మెల్యేగా ఒకసారి ఎంపీగా గెలిచి తన రాజకీయ ప్రయాణంలో ఓటమిని దరిదాపులకు రాకుండా జాగ్రత్త పడుతూ వస్తున్నారు. టీడీపీ నుంచి పీఆర్పీకి, అక్కడ నుంచి కాంగ్రెస్‌కి తర్వాత తిరిగి టీడీపీకి వచ్చిన గంటా శ్రీనివాస్ తన ఇమేజ్‌కి ఎక్కడా డ్యామేజ్ అవ్వకుండా పాతికేళ్ల రాజకీయ జీవితంలో ఓ మెట్టు పైకి ఎదుగుతూనే వచ్చారు. అలాంటి మాజీ మంత్రికి ఇప్పుడు కొడుకు రూపంలో కొత్త తలనొప్పి మొదలైందంట. రాజకీయ నాయకుల్లో అత్యధికులు కచ్చితంగా రాజకీయ వారసత్వాన్ని తెరమీదకి తీసుకొచ్చి తమ బిడ్డల్ని గ్రాండ్ లాంచ్ చేస్తారు. అలాగే గంటా శ్రీనివాస్ తన కొడుకు రవితేజని రాజకీయాల్లో గ్రాండ్‌గా లాంచింగ్ చేయడానికి ప్లాన్ చేశారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక భీమిలి నుండి గెలిచిన ఆయన భీమిలి నియోజకవర్గం పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో తనతో పాటు తన కొడుకును కూడా ముందు పెట్టి నడిపిస్తున్నారు. గత సంవత్సర కాలంగా భీమిలి నియోజకవర్గంలో జరిగే అధికారిక కార్యక్రమాల్లో గంటా కొడుకు రవితేజ అన్ని తానై ముందుండి నడిపిస్తున్నారు. ఇప్పటివరకు అన్ని ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల నిర్వహణలో ముందు ఉండి పనులు చేస్తున్న రవితేజ పెద్దగా ప్రసంగాలు చేయలేదు. స్టేజీ మీద మాట్లాడితే ఒక్క నిమిషానికి మించి ఏ రోజు మాట్లాడింది లేదు. అలాంటి గంటా రవితేజ తాజాగా భీమిలి నియోజకవర్గంలో జరిగిన మినీ మహానాడులో తన తండ్రితో పాటు నియోజకవర్గంలోని కీలకమైన రాజకీయ నాయకుల సమక్షంలో క్యాడర్‌ని ఉత్సాహపరచడానికి మాట్లాడుతూ నోరు జారి జోహార్ సీఎం సార్, జోహార్ లోకేష్ అన్నయ్య అంటూ నినాదాలు చేశారు.రవితేజ తెలిసీ తెలియక కనబర్చిన అత్యుత్సాహాన్ని కేడర్ మొత్తం ఫాలో అయింది. చేసిన తప్పును గుర్తించి సరిదిద్దుకునే లోపే జరగాల్సిన డ్యామేజ్ మొత్తం జరిగిపోయింది. రవితేజ మినీ మహానాడు స్టేజి మీద మాట్లాడిన ఈ మాటలు సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతున్నాయి. బ్రతికున్న వాళ్లకు జోహార్లు ఏంటయ్యా అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తూ ట్రోల్ చేస్తున్నారు.ఆ వ్యాఖ్యలతో గంటా వారసుడు నవ్వులపాలు అవుతున్నా... ఇంతకాలం ఆయన ఎవరో తెలియని వారికి కూడా పరిచయమవుతున్నారంట. గంటా రవితేజ తెలియని వారు ఉండరు అనే అంతగా సోషల్ మీడియాలో పాపులర్ అవుతున్నారు. గంటా శ్రీనివాస్ తన కొడుకుని సినిమా ఇండస్ట్రీలో హీరోగా నిలబెట్టి కొత్త ఇమేజ్ క్రియేట్ చేయాలనుకున్నారు. స్టార్ డైరెక్టర్ జయంత్ సి పరాన్జీతో పవర్ ఫుల్ పోలీస్ క్యారెక్టర్‌తో జైదేవ్ అనే మూవీతో గంట రవితేజను లాంచ్ కూడా చేశారు. జయదేవ్ సినిమా డిజాస్టర్ కావడంతో గంటా రవితేజ తనకి సినిమాలు సరిపడవు అనుకున్నారో ఏమో?మొదటి సినిమాతోనే సినిమా ఇండస్ట్రీకి గుడ్‌బై చెప్పేసి తండ్రి రాజకీయ వారసుడిగా ఓనమాలు నేర్చుకోవడం మొదలుపెట్టారు. టీడీపీ అధికారంలో ఉన్న ప్రస్తుత తరుణంలో జరుగుతున్న మినీ మహానాడు తన ఆ రాజకీయ ఆరంగేట్రానికి సరైన సమయం అని భావించిన రవితేజకు తొలి పొలిటికల్ ప్రసంగంలోనే చుక్కెదురవ్వడంతో.. ఆయన



భవిష్యత్తు రాజకీయం ఎలా ఉండబోతుందన్న సందేహాలు మొదలయ్యాయి. 2024 ఎన్నికల బరిలో తన వారసుడ్ని ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించాలని గంట శ్రీనివాస్ ప్రయత్నం చేసినట్లు జోరుగా ప్రచారం సాగింది. చంద్రబాబు దగ్గర కూడా తన కొడుకుకి సీటు ఇవ్వాలని గంటా కోరినట్లు అప్పట్లో టాక్ నడిచింది. 2024 ఎన్నికల్లో ప్రతి సీటు టీడీపీకి కీలకం కావడంతో చంద్రబాబు నిరాకరించడంతో గంట తానే స్వయంగా భీమిలి బరిలోకి దిగి విజయం సాధించారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత కచ్చితంగా గంట శ్రీనివాస్ కు మంత్రి పదవి వస్తుందని అందరూ భావించారు. అయితే ఎవరు ఊహించని విధంగా చంద్రబాబు మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసుకోవడంతో ఆయనకు నిరాశే మిగిలింది.మంత్రి పదవి రాకపోవడంతో నియోజకవర్గ మీద కొంత ఫోకస్ తగ్గించిన గంటా తన వారసుడ్ని ప్రమోట్ చేసుకునే పనిలో పడ్డారంట. రవితేజను భీమిలి నియోజకవర్గంలో బలమైన నేతగా తయారు చేయడానికి ఇదే సరైన సమయం అని భావిస్తున్న మాజీ మంత్రి పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో కుమారుడ్ని ముందు పెట్టి నడిపిస్తున్నారంట. తీరా చూస్తే రవితేజ మినీ మహానాడు స్పీచ్‌తో అందరికీ కామెడీగా మారిపోయారు. మరి సినిమాల్లో ఫ్లాప్ అయిన ఆయన పొలిటికల్ స్క్రీన్‌పై ఏ మాత్రం రాణిస్తారో చూడాలి.

# పాపం..భైరవం...

హైదరాబాద్, మే 23,

సినీ ఇండస్ట్రీ లోకి వచ్చే వాళ్ళు జాగ్రత్తగా ఉండాలి, ఆచి తూచి మాట్లాడాలి, పొరపాటున ఏ చిన్న తప్పు చేసినా సోషల్ మీడియా లో ఆయా హీరోల అభిమానుల దాటికి తట్టుకోలేరు, ఇండస్ట్రీ ని వదిలి పారిపోవాల్సి వస్తుంది. అలాంటి పరిస్థితి ఇప్పుడు 'భైరవం' మూవీ డైరెక్టర్ విజయ్ కనకమేడలకు పట్టనుందా? అంటే అవుననే అంటున్నారు విశ్లేషకులు. పాపం ముగ్గురు హీరోలు. చాలా కాలం తర్వాత వెండితెర మీద కనిపించబోతున్నారు. ఎలాంటి ఈగోలకు పోకుండా మనోజ్, బెల్లంకొండ శ్రీనివాస్, నారా రోహిత్ ఈ చిత్రం లో కలిసి నటించారు. సినిమా చాలా బాగా వచ్చింది అనే టాక్ కూడా ఉంది. కానీ డైరెక్టర్ విజయ్ నోటి దూల కారణం గా ఇప్పటికే వైసీపీ ఫ్యాన్స్ కి దొరికిపోయాడు. వాళ్ళు ఇతను బయట కనిపిస్తే కొట్టేసేలా ఉన్నారు మొన్న జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో ఆయన వైసీపీ ని ఉద్దేశించి కామెంట్స్ చేసాడు.భైరవం ట్రైలర్ లోని డైలాగ్ ని గుర్తు చేస్తూ 'ధర్మం కోసం దేవుడు ఏదో ఒక రూపం లో వస్తుంటాడు..గత ఏడాది ఎన్నికల సమయం లో అదే జరిగింది' అంటూ కామెంట్ చేసాడు. దీనికి వైసీపీ అభిమానులు ట్రిగ్గర్ అయ్యారు. గత మూడు రోజుల నుండి 'బాయ్ కాట్ భైరవం' ట్రెండ్ ని సోషల్ మీడియా లో చేస్తున్నారు. ఇప్పుడు మెగా ఫ్యాన్స్ కూడా విజయ్ పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. ఎందుకంటే 2011 వ సంవత్సరం లో ఫేస్ బుక్ లో విజయ్ చిరంజీవి, రామ్ చరణ్ కలిసి ఉన్న మార్ఫింగ్ ఫోటో ని అప్లోడ్ చేసి మెగా ఫ్యామిలీ ని ఎగతాళి చేసాడు. చాలా సంవత్సరాల తర్వాత ఆ పోస్ట్ బయటపడింది. దీంతో నువ్వు ఇలాంటోడివా అని మెగా ఫ్యాన్స్ విజయ్ పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.వెంటనే క్షమాపణలు చెప్పాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేసాడు. అభిమానుల దెబ్బకు డైరెక్టర్ దిగొచ్చాడు. వెంటనే ట్విట్టర్ లో స్పందిస్తూ 'మెగా అభిమానులకు గుడ్ ఈవెనింగ్..మెగా ఫ్యాన్స్ భైరవం చిత్రం ని బాయ్ కాట్ చేస్తామంటూ ట్విట్టర్ లో ట్రెండింగ్ చేస్తున్న విషయం నా దృష్టికి వచ్చింది. కారణం ఫేస్ బుక్ లో నా అకౌంట్ నుండి ఎప్పుడో 2011 వ సంవత్సరం లో చిరంజీవి, రామ్ చరణ్ గారికి సంబంధించి ఒక మార్ఫింగ్ ఫోటో పడింది. అది నిజానికి నేను వెయ్యలేదు. అప్పట్లో నా అకౌంట్ హ్యాక్ అయ్యింది. అయినప్పటికీ నా అకౌంట్ నుండి పడింది కాబట్టి బాధ్యత తీసుకొని క్షమాపణలు చెప్తున్నాను. నేను కూడా చిరంజీవి, పవన్ కళ్యాణ్ గార్ల సినిమాలను చూసే ఇండస్ట్రీ కి వచ్చాను. పవన్ కళ్యాణ్ గారి గబ్బర్ సింగ్ కి నేను పని చేసాను. ఆయనే నన్ను సాయి ధరమ్ తేజ్ కి పరిచయం చేసి ఇతనితో సినిమాలు చేసుకో అన్నాడు. నన్ను అంత ప్రోత్సహించిన మనుషులపై నేనెలా విషం కక్కుతాను?' అంటూ ఆయన కామెంట్స్ చేసాడు.

## హుస్నాబాద్ లో రాత్రి కురిసిన వర్షానికి ఇళ్లలోకి నీళ్ళు వచ్చిన ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ మే 23

ద్విచక్ర వాహనంపై తిరుగుతూ పట్టణంలో పలు ప్రాంతాలను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్.జాతీయ రహదారి విస్తరణ లో భాగంగా పెండింగ్ డ్రైనేజీ పనులు ఆలస్యం వల్లే రాత్రి కురిసిన వర్షానికి ఇళ్లు, షాపులోకి నీళ్లు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి సమస్యాత్మక ప్రాంతాలు మల్లెచెట్టు చౌరస్తా, అనభేరీ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, సిద్దిపేట రోడ్డు, పోతారం రోడ్డు వద్ద నాళాలను, కల్వర్టు లను పరిశీలించారు.పాత డ్రైనేజీ నాళాలు మూసుకపోవడం జాతీయ రహదారి పనుల్లో డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో ఇబ్బందులు డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జాతీయ రహదారి అధికారులను, మున్సిపల్ అధికారులను ఆదేశించారు.పట్టణంలో వర్షం కురిసినప్పుడు ఇబ్బందులు రాకుండా ఉండడానికి తక్షణం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

వర్షాకాలం సమీపిస్తుండటంతో పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## సాగునీటితో రాయలసీమ రైతుల దశ మారుతుంది కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి

బద్వేలు మే 23

సాగునీటితో రాయలసీమ రైతుల దశ మార్చాలన్నది మా సిద్ధాంతం. అందులో భాగంగానే ఆనాడు ఎన్టీఆర్ హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టును తలపెట్టారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి కరువు నేలకు నీరు ఇవ్వడం జరిగిందని కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి శుక్రవారం తెలిపారు గత ప్రభుత్వ హయాంలో 5 ఏళ్లు తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాజెక్టు పనులు కూటమి ప్రభుత్వం రాగానే మళ్లీ పట్టాలెక్కాయి. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా, ఉరవకొండ నియోజకవర్గం, ఛాయాపురంలో హంద్రీనీవా సుజల స్రవంతి పనులను ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలించారు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నాను. నిర్దేశిత కాలానికి ఎట్టిపరిస్థితుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల్లో ఈ ప్రాజెక్టు ద్వారా 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 81 మండలాల్లో 33 లక్షల మందికి తాగునీటి సరఫరాకు అవకాశం లభిస్తుంది. సీమలో కీలకమైన ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేస్తారు. సాగునీరు, డ్రిప్ సబ్సిడీలు ఇచ్చి రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా ముఖ్యమంత్రి మారుస్తారని సూర్యనారాయణ రెడ్డి తెలిపారు

## కాకు వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న దారపనేని

కనిగిరికాకు సత్యనారాయణ, బాల వెంగమ్మ దంపతుల కుమారుడు చిరంజీవి హరికృష్ణ, కనపర్తి కొండలరావు రమాదేవి దంపతుల ఏకైక కుమార్తె లక్ష్మి సౌభాగ్యవతి సుదర్శిని ల వివాహ వేడుకలు విజయవాడలోని సాయి జ్యూయల్ నందు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకల్లో మానం మల్లికార్జున రావు దంపతులు, మానం కిరణ్ దంపతులు, మానం రాజకుమార్ దంపతులు, నూతలపాటి వెంకటేశ్వర్లు దంపతులు, రాములు దంపతులు, లక్ష్మణ దంపతులు, మర్రి నారాయణ దంపతులు, మానం వారి కుటుంబ సభ్యులు, నూతల పాటి వారి కుటుంబ సభ్యులు, మర్రి వారి కుటుంబ సభ్యులు, కాకు వారి కుటుంబ సభ్యులు, కనపర్తి వారి కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

## వర్షపు నీటిలో వరి ధాన్యం?రైతులు ఆగమాగం

జయశంకర్ భూపాలపల్లి మే 23,

గణపురం,భూపాలపల్లి మండలాలకు చెందిన మొరంచపల్లి,లక్ష్మారెడ్డి పల్లె గ్రామాల్లో రాత్రి కురిసిన అకాల వర్షానికి ఐకేపీ కేంద్రంలో ధాన్యం తడిసిన ముద్దైంది. కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలులో జాప్యం జరగడంతో రైతులు కొన్ని రోజులుగా ధాన్యం కొనుగోలులేక పడిగాపులు పడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేసారు.తడిసిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం తరుగు లేకుండా వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

## సంగారెడ్డి జిల్లాలో బీభత్సం సృష్టించిన వర్షం

సంగారెడ్డి మే 23,

సంగారెడ్డి జిల్లాలో భారీ వర్షం బీభత్సం సృష్టించింది. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నిజాంపేట- బీదర్ హైవేపై వరద నీరు భారీగా నిలిచి పోయింది. వరద నీటిని గమనించకుండా వెళ్ళిన ఒక కారు నీటిలో చిక్కుకుంది. వరద నీరు తక్కువగా ఉండటంతో ప్రమాదం తప్పింది. స్థానికులు కారును నీటిలో నుంచి బయటకు తీసారు.

## పార్టీ కార్యకర్తలకు అండగా వుంటాం

కాకినాడ

కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని.. మున్సిపల్ శాఖ, కాకినాడ జిల్లా ఇన్చార్జి మంత్రి పి. నారాయణ భరోసా ఇచ్చారు. కాకినాడలోని గోదావరి కళా క్షేత్రంలో తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా మహానాడు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభకు మంత్రి నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా పాలనలో కార్యకర్తలు కేసులు, అరెస్టులను ఎదుర్కొని పార్టీకి అండగా నిలబడ్డారన్నారు. మాజీ సీఎం జగన్ 10 లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారన్నారు దేశంలో అందరికంటే ఎక్కువగా పింఛన్లు ఇస్తున్నామని, వచ్చేనెల నుంచి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు ప్రారంభిస్తున్నామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్, ఎమ్మెల్యేలు చినరాజప్ప, కొండబాబు,జ్యోతుల నెహ్రూ, సత్య ప్రభ, జిల్లాలోని ముఖ్యమైన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు...

## ఇంజనీరింగ్ కనీస ఫీజు రూ.50 వేలు

హైదరాబాద్, మే 23,

రాష్ట్రంలో రాబోయే మూడేండ్లకు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫీజుల ఖరారు చివరి దశకు చేరింది. ఇప్పటికే మెజార్టీ ప్రైవేట్ కాలేజీల్లో ఫీజులు ఫైనల్ కాగా, కొన్నింటిపై ఇంకా చర్చలు జరుగుతున్నాయి. అయితే, ఈసారి మినిమమ్ ఫీజును రూ.50 వేలు చేయాలనే యోచనలో అధికారులు ఉన్నారు. మరోపక్క ఫీజు అత్యధికంగా 2 లక్షలు దాటనున్నది. ఈనెలాఖరులో ఇంజినీరింగ్ ఫీజులపై స్పష్టత రానున్నది. స్టేట్ లోని ఇంజినీరింగ్ కాలేజీల్లో 2025?26, 2026?27, 2027?28 విద్యా సంవత్సరాలకు గానూ ఫీజులను నిర్ణయించేందుకు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) ఇప్పటికే పలు మార్లు సమావేశమైంది. ఫీజుల ఖరారుకు టీఏఎఫ్ఆర్సీకి 157 కాలేజీలు దరఖాస్తు చేసుకోగా, ఆయా కాలేజీల పత్రాలను పరిశీలించారు. దీంట్లో ఫీజుల ఖరారు ఓ కొలిక్కి వచ్చింది. సర్కారు కాలేజీలలో ప్రస్తుతం మినిమమ్ ఫీజు రూ.35వేలు ఉండగా, దాన్ని అలాగే కొనసాగించాలని నిర్ణయించారు. ప్రైవేటు కాలేజీల్లో మినిమమ్ ఫీజు రూ.45వేలు ఉండగా, దాన్ని రూ.50 వేలకు పెంచాలని టీఏఎఫ్ఆర్సీ ప్రతిపాదనలు రెడీ చేసింది.దాదాపూ ఇది ఖరారయ్యే చాన్స్ ఉంది. అత్యధికంగా 4 ప్రైవేట్ఇంజినీరింగ్ కాలేజీల్లో రూ. 2 లక్షలకు పైగా ఫీజులు ఉండే అవకాశం ఉంది. ఈ విషయాన్ని మేనేజ్మెంట్లతో జరిగిన సమావేశంలోనూ ఆయా యాజమాన్యాలకు తెలిపి, వారితో ఒప్పుకున్నట్టు టీఏఎఫ్ఆర్సీ అధికారులు సంతకాలూ చేయించుకున్నారు. ఇక అధికారికంగా ప్రకటించడమే ఉంది. గత బ్లాక్ పీరియడ్?లో 38 కాలేజీల్లో లక్షకుపైగా ఫీజు డిసైడ్ చేశారు.ఈ సారి ఆ సంఖ్య డబుల్ అయ్యే అవకాశాలున్నాయి. గతంలో రూ.80వేలకు పైగా ఫీజులున్న చాలా కాలేజీల్లో రూ.లక్షకు పైగా ఫీజులు ఉండే చాన్స్ ఉంది. ఇప్పటికే పలు కాలేజీలు సర్కారు పెద్దలను కలిసి.. ఫీజులు పెంచాలని విజ్ఞప్తులు చేస్తున్నాయి. 25 కాలేజీలు మినహా.. మిగిలిన కాలేజీలు భారీగా ఫీజులు పెంచాలని టీఏఎఫ్ఆర్సీకి ప్రతిపాదనలు ఇచ్చాయి. వీటిపై టీఏఎఫ్ఆర్సీ 3 సార్లు సమావేశమై.. చర్చలు చేసింది.సుమారు 40 కాలేజీల్లో ఫీజులపై కమిటీలో భిన్నాభిప్రాయాలు వచ్చినట్టు తెలుస్తున్నది. దీంతో ఆయా కాలేజీలపై మరోసారి సమావేశంలో చర్చించాలని డిసైడ్ అయ్యారు. అప్పటి వరకూ కాలేజీలు ఇచ్చిన వివరాలపై మరోసారి వెరిఫై చేస్తున్నట్టు సమాచారం. అయితే, ఈ నెలాఖరులోపు ఇంజినీరింగ్ ఫీజులను ఖరారు చేయాలని సర్కారు భావిస్తున్నది. టీఏఎఫ్ఆర్సీ ఇచ్చిన ఫీజుల వివరాలతో ప్రభుత్వం అధికారికంగా జీవో రిలీజ్ చేయనున్నది.

## సొల్లు కబుర్లు చెబుతున్న జగన్

నెల్లూరు

ఇడ్లీ, వడ అంటూ వైఎస్ జగన్ కారుకూతలు కూస్తున్నాడని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మండిపడ్డారు. . విశాఖ ఐటీ పార్క్ లో 3.5 ఎకరాలు ఎకరా రూ. 1 కోటి చొప్పున అలాగే మరోచోట 56.30 ఎకరాలు రూ. 50 లక్షల చొప్పున ఉర్సాకు కేటాయించారు. ఇది తెలుసుకోకుండా.. బెంగళూరు యలహంకలో విశ్రాంతి తీసుకుంటూ.. అప్పుడప్పుడు ఏపీకి వచ్చి సొల్లు కబుర్లు చెప్పి జగన్ రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నాడని అన్నారు.

# జ్యోతి మల్హోత్రా... సిరాజ్... డబ్బులు ఎక్కడ నుంచి వస్తున్నాయి..

హైదరాబాద్, మే 23,

ఉగ్రవాదులకు సహకరించారు.. ఉగ్రవాద అనుబంధ సంస్థలతో కార్యకలాపాలు నెరిపారు.. మనదేశంలో సున్నితమైన ప్రాంతాల సమాచారాన్ని చేరవేర్చారు అనే అభియోగాలతో కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రముఖ యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా, ఏపీలోని విజయనగరానికి చెందిన సిరాజ్ పై దృష్టి సారించాయి. దీంతో వారిద్దరి అసలు పన్నాగం బయటపడింది. వీరిద్దరూ కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారుల విచారణలో ఉన్నారు. అధికారుల విచారణలో వీరికి సంబంధించిన కీలక విషయాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ముఖ్యంగా వీరి బ్యాంకు ఖాతాలలో భారీగా నగదు ఉండడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. సాధారణంగా ఇలాంటి వ్యవహారాలకు పాల్పడేవారు బినామీ ఖాతాలతో ఆర్థిక వ్యవహారాలు కొనసాగిస్తారు. కానీ జ్యోతి మల్హోత్రా, సిరాజ్ తమ పేరుతోనే బ్యాంకు ఖాతాలను నిర్వహిస్తుండడం విశేషం. పైగా బ్యాంకు ఖాతాలలో భారీగా నగదు ఉండడం అధికారులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తోంది.జ్యోతి మల్హోత్రా పాకిస్తాన్ ఐఎస్ఐ లో పనిచేసే వ్యక్తితో కొనసాగించిన వాట్సాప్ చాట్ బయటికి వచ్చింది. తనని పెళ్లి చేసుకోవాలని జ్యోతి అతని కోరినట్టు ఆ చాట్ లో ఉంది. అంతేకాదు తనకు ఇస్లామాబాద్ అంటే చాలా ఇష్టమని.. ఇస్లామాబాద్ నగరాన్ని విడిచిపెట్టి రావడం తనకు ఇష్టం లేదని ఆ చాట్ లో జ్యోతి కోరడం విశేషం. మరోవైపు ఐసీస్ అనే ఉగ్రవాద సంస్థ కోసం పని చేస్తున్న సిరాజ్ వ్యవహారం కూడా కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులకు తెలియడంతో విజయనగరంలో కలకలం నెలకొంది. ఇక సిరాజ్ ను అదుపులోకి తీసుకున్న అధికారులు అతడిని విచారిస్తున్నారు. అతడి బ్యాంక్ ఖాతాలో భారీగా నగదు ఉండడంతో అధికారులు సైతం ఆశ్చర్యానికి గురవుతున్నారు. స్థానికంగా ఉన్న డిసిసిబి లో అతడికి ఖాతా ఉంది. అందులో దాదాపు 50 లక్షల వరకు నగదు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నగదును విత్ డ్రా చేయడానికి సిరాజ్ తల్లిదండ్రులు ప్రయత్నించగా.. బ్యాంకు అధికారులు కుదరదని చెప్పారు.సిరాజ్, జ్యోతి కి దుబాయ్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఖాతాలలో నగదువేశారు అని తెలుస్తోంది. అయితే దుబాయిలో వీరికి నగదు వేసిన వ్యక్తులు ఎవరు? విడతలవారీగా లక్షలకు లక్షలు నగదు ఎందుకు వేశారు? ఆ నగదుతో వీరు మనదేశంలో ఎలాంటి కుట్రలకు శ్రీకారం చుట్టారు? అనే కోణంలో కేంద్ర దర్యాప్తు సంస్థల విచారణ చేపడుతున్నారు. ఇప్పటికే జ్యోతి గురించి.. సిరాజ్ గురించి అధికారులు కీలక విషయాలు రాబట్టారు. లోతుగా దర్యాప్తు చేస్తే ఇంకా కీలక సమాచారం బయటకు వస్తుందని తెలుస్తోంది. అయితే ఇప్పటికే దర్యాప్తు సంస్థల అధికారులు వీరికి సంబంధించిన బ్యాంకు ఖాతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నట్టు తెలుస్తోంది.

# కాంగ్రెస్ లో సీనియర్లు వర్సెస్ జూనియర్లు..

హైదరాబాద్, మే 23,

తెలంగాణ కాంగ్రెస్ లో సీనియర్లు వర్సెస్ జూనియర్లు మధ్య వార్ పార్టీకి కొత్తకాదు. అలకలు , బహిరంగ విమర్శలు, బాహాబాహీ బలప్రదర్శనలు సర్వసాధారణం. ఇన్ని జరిగినా, జరుగుతున్నా.. తెలంగాణలో రేవంత్ సారథ్యంలో అధికారం చేపట్టి అలా ముందుకు సాగుతోంది కాంగ్రెస్ ప్రభుత్వం. తాజాగా కరీంనగర్ జిల్లా జగిత్యాల నియోజకవర్గంలో జరుగుతున్నరాజకీయ రచ్చ సీఎం రేవంత్ రెడ్డికి కొత్త తలనొప్పిగా మారింది. కొందరు రాష్ట్ర క్యాబినెట్ మంత్రులు జీవన్ రెడ్డి నియోజకవర్గం అంటేనే హడలిపోతున్నారు. అక్కడ సొంతపార్టీలో? వర్గపోరులో తామెందుకు ఇరుక్కోవడం అనుకుని జగిత్యాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా మంత్రి పొంగులేటి ముందే జీవన్ రెడ్డి ఆగ్రహం చూసిన కాంగ్రెస్ నేతలకు పార్టీలో ఏం జరుగుతుందో అర్ధంకాని అయోమయం నెలకొంది. ఇక మీ రాజ్యం.. మీరే ఏలుకోండి.. అంటూ పొంగులేటి ముఖంమీదే అనేశారు జీవన్ రెడ్డి. రాకరాక కాంగ్రెస్ కు అధికారం చేతికొస్తే ,అదేపార్టీలో ఉన్న సీనియర్ నేత జీవన్ రెడ్డి అలా అనేశారేంటి, ఆయన అంతలా రగిలిపోవడం వెనుక ఏం జరుగుతోంది అనే ఆసక్తి తెలంగాణ రాజకీయాల హీటెక్కిస్తోంది.తెంగాణ కాంగ్రెస్లో జీవన్ రెడ్డి వీహెచ్ తరువాత అంతటి సీనియర్ నేత, ఆరు సార్లు ఎమ్మెల్యేగా , ఓసారి ఎమ్మెల్సీగా గెలుపొందిన జీవన్ రెడ్డిని తెలంగాణ కాంగ్రెస్లో ఇప్పుడు పట్టించుకునే నాథుడే లేడు. నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తల మద్దతు దండిగా ఉన్నా, హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న రాజకీయాలు జీవన్ రెడ్డికి మంటెక్కిస్తున్నాయి. గత ఎన్నికల్లో తనకు ప్రత్యర్థిగా పోటీ చేసి గెలిచిన బిఆర్ ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బి?ఆర్ఎస్ వీడి హైదరా?బాద్లో రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ తీర్ధం పుచ్చుకున్నారు. ఆ రోజు మొదలు జీవన్ రెడ్డికి కంటిమీద కునుకులేదంటే అతిశయోక్తికాదు. నా ప్రత్యర్థినే , నా అనుమతి లేకుండా కాంగ్రెస్లోకి ఎలా చేర్చుకుంటారు. పార్టీ కోసం సర్వం త్యాగం చేసిన తనను కాదని, సంజయ్ను అందలం ఎక్కిస్తారా అంటూ జీవన్ రెడ్డి రగిలిపోతున్నారు. అనేక సందర్భాల్లో తన అసంతృప్తిని బహిరంగంగానే బయటపెట్టారు. రేవంత్ నాయకత్వంలో ఏర్పడ్డ ప్రభుత్వంలో సీనియర్లను పట్టించుకోవడంలేదంటూ రగిలిపోతున్నారు. ఇలా జగిత్యాల సిట్టింగ్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మధ్య పచ్చగడ్డి వేయకుండానే భగ్గుమంటోంది. ఆ సెగలు జగిత్యాలను రాజకీయలను మాత్రమేకాదు, ఏకంగా తెలంగాణ అంతటా వ్యాపిస్తున్నాయి. సిఎం రేవంత్ రెడ్డి సైతం జోక్యం చేసుకోవడానికి సాహసం చేయలేనంతలా వివాదం ముదిరిపోయింది.జీవన్ రెడ్డి ఆవేదన రెవంత్ రెడ్డి కోటరీకి పట్టడంలేదని విమర్శలు బలంగా వినిపిస్తున్న నేపథ్యంలో రేవంత్ తీరుపై అసంతృప్తిగా ఉన్న కొందరు మంత్రులు, సీనియర్లు జీవన్ రెడ్డికి మద్దతుగా ఏకమవుతున్నారట. ఇటీవల జీవన్ రెడ్డిని కలసి మంత్రి దామోదర రాజనర్సింహ చేసి వ్యాఖ్యలు ఆసక్తిగా మారాయి. జీవన్ రెడ్డి కాంగ్రెస్లో సీనియర్ నాయకుడు, పార్టీ కోసం ఎంతో చేశారు. కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డిని వదులుకోదంటూ మద్దతుగా నిలబడ్డారు. ఇలా రేవంత్ వర్గం మంత్రులు జీవన్ రెడ్డికి అంటి ముట్టనట్లు ఉంటే, సీనియర్లు మాత్రం మేమున్నామంటూ భరోసా ఇస్తున్నారట. ఇలాంటి టైంలో తాను స్పందిస్తే రెండు వర్గాలుగా మారి పరిస్దితి మరింత చేయిదాటుందని భావించిన రేవంత్ రెడ్డి వ్యూహాత్మక మౌనం వహిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. మొత్తానికి బిఆర్ఎస్ నుంచి వస్తున్నారుగా రారమ్మంటూ సంజయ్ ను కాంగ్రెస్ లోకి ఆహ్వానించి, ప్రతిపక్షానికి షాకిచ్చామనే ఆనందం ఓవైపు, తీరా పార్టీలోకి వచ్చాక జరుగుతున్న అంతర్గత కుమ్ములాటలు , జీవన్ రెడ్డితోపాటు సీనియర్ల నుంచి వస్తున్న విమర్శలు రేవంత్ కి తలనొప్పిగా మారాయట.

# అడగడుగునా ఉల్లంఘనలే..

హైదరాబాద్, మే 23,

హైదరాబాద్ లోని పాతబస్తీ గుల్బర్ హౌ స్ ఏసీ కంప్రెసర్ పేలిన ఘటనలో సుమారు 17 మంది అమాయకులు అగ్ని ప్రమాదం లో మృతి చెందిన విషయం తెలిసిందే. దాం తోపాటు మైనార్దేవపల్లి చర్లపల్లి వంటిప్రదేశాల్లోనూ వరుసగా అగ్ని ప్రమాదాలు సంభవించిన విషయం తెలిసిందే. నేపథ్యం లో నాగర్ కర్నూల్ జిల్లాలోని పట్టణ కేంద్రా ల్లో ప్రైవేటు పాఠశాలలు, ఆసుపత్రులు ఇత ర కమర్షియల్ కాంప్లెక్స్ లో ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించకపోవడంతో ఎప్పుడు ఎ లాంటి ప్రమాదం సంభవిస్తుందో అన్న భ యాందోళన వ్యక్తం అవుతుంది.ఆయా ము న్సిపాలిటీలలో నూతనంగా నిర్మితమవుతున్న భారీ అంతస్తులు సెట్ బ్యాక్, ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఏవి పాటించక పో యినా వాటికి అనుమతులు ఎలా వ స్తున్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆయా అంతస్తుల నిర్మాణం లోనూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్, ఫర్నిచ ర్, డోర్ కర్టెన్స్, మైక్రోవేవ్స్,ప్రమాదకరమైన కెమికల్స్, ప్లాస్టిక్ వంటి వినియోగం భారీగా పెరిగిందని అనుకోని ప్రమాదం జరిగితే వెదజల్లే దుర్వాసనతో అత్యంత ప్రమా దం సంభవిస్తుందని నిపుణులు చెప్తున్నారు.

నాగర్ కర్నూల్ జిల్లాలోని ప్రధాన పట్టణ కేంద్రాల్లో కమర్షియల్ కాంప్లెక్స్ ల ని ర్మాణం రోజురోజుకు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. చూపరులను ఆకట్టుకునేలా ఫర్ని చర్ కర్టన్స్, ఏసీ రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిష న్స్ ఇతర ప్రమాదకర స్థాయిలో మంటలు అంటుకునే విధమైన డెకరేషన్లు సామాగ్రి ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎండల తీవ్రత, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి ఏదై నా అనుకోని పరిస్థితుల్లో అగ్ని ప్రమాదం సంభవిస్తే అక్కడికి వచ్చే ప్రజలను కాపాడుకునేలా అగ్నిమాపక శాఖ విధించే నిబంధన లు మాత్రం పాటించడం లేదు. అనుమతులు పొందే క్రమంలోనే అగ్నిమాపక శాఖ నుండి ఎన్ఓసి ఉంటేనే అనుమతులిస్తామ ని చెప్పాల్సింది పోయి అందుకు తగిన ము డుపులిస్తే చాలు అనుమతులు ఇట్టే అందుతున్నాయనిఆరోపణలు వెల్లువెత్తుతున్నా యి.నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంగా మారడంతో క్రమంగా ప్రైవేట్ పాఠశాలలు, కళా శాలలు, ఆస్పత్రులు, ఇతర షాపింగ్ కాంప్లె క్స్, రైస్ మిలల్స్, కాటన్ మిల్స్, రెసిడెన్షియల్ నిర్మాణాలు వేల సంఖ్యలో పుట్టుకొచ్చాయి. కానీ కేవలం 20 వాటికి మాత్రమే ఫైర్ సేఫ్టీ అనుమతులు పొందడం విశేషం. మరో పదకొండు వాటికి రెన్యువల్ కూడా చేయాల్సి ఉంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్ల సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.ఆకాశాన్ని తాకే బిల్డింగులు ఇరుకు ఇరుకుగా ఎన్నో హంగులతో నిర్మాణం చేస్తున్నప్పటికీ సంబంధిత ఫైర్ సేఫ్టీ నిబంధనలు మాత్రం పాటించకపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవి స్తుందో అన్న భయం అందరినీ వెంటాడుతుంది. జిప్లస్ ఫోర్ 15 మీటర్ల వరకు కమ ర్షియల్ కాంప్లెక్స్, జి ప్లస్ 5 రెసిడెన్షియల్ కాంప్లెక్స్ 18 మీటర్ల నిర్మాణం కోసం ఫైర్ సే ఫ్టీ అధికారులు అనుమతులు తప్పనిసరి.కానీ నాగర్ కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు ఆకాశాన్ని తాకే అంతస్తులు అక్రమంగా నిర్మితం అవుతున్నాయి. వాటితోపాటు జనావాసాల్లో కొన్ని దుకాణదారులు కూడా ఫైర్ సేఫ్టీ నిబంధనలను తుంగలో తొక్కి విషపూరితమైన పొగ కమ్ముకునే రసాయనాలు ఇతర వ్యర్థాలు బట్టలు చెప్పులు ఇతర దుకాణాలు ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించడం లేదని ఆరోపణలు ఉన్నాయి.జిల్లాలో నాగర్ క ర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తిలో ప్రభు త్వ అమ్రాబాద్ ఫైర్ స్టేషన్ ఆఫీస్ ఔట్సోర్సింగ్ పద్ధతిన ఉన్నాయి. ఒక్కో స్టేషన్లో ఫైర్ స్టేషన్ ఆఫీసర్ తో పాటు ముగ్గురు డ్రైవర్లు ఇద్దరు జంధార్ లు, మరో 10 మంది జవాన్లు చొప్పున 15 మంది ఫైర్ సిబ్బంది పనిచేస్తున్నారు. వీటిల్లో వాటర్ టెండర్ వాహనాలతో పాటు నాగర్ కర్నూల్ ఫైర్ స్టేషన్ కార్యాలయంలో అంబులెన్స్ ఫోర్స్ వాహనం, వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు బోటు కూడా అందుబాటులో ఉంది. ఏదైనా అంతస్తు నిర్మాణం జరిగే క్రమంలోనే మున్సిపల్ అధికారు లు ఫైర్ సేఫ్టీ ఎన్ఓసి తప్పనిసరి కోరాలి అప్పుడే యాజమాన్యాలు ఫైర్ సేఫ్టీ నిబంధనలను అనుమతు లను పొందే అవకాశం ఉంది. జనం రద్దీగా ఉండే ప్రదే శాలు, షాపింగ్ కాంప్లెక్సులు, ప్రైవేటు ఆసుపత్రులు, పాఠశాలల్లో ఫైర్ సేఫ్టీ నిబంధన లు తప్పకుండా పాటించాలని సూచిస్తున్నాం. ప్రమాదం జరిగితే సురక్షితంగా బయటపడే మార్గాలను ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

## సంబరాల్లో పోలీసులు

చింతూరు మే 23,

మావోయిస్టులను ఎన్ కౌంటర్ లో మట్టుపెట్టిన పోలీసులు సంబరాలు చేసుకున్నారు. ఛత్తీస్గఢ్లో జరిగిన భారీ ఎన్ కౌంటర్లో మావోయిస్టు సుప్రీం లీడర్ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు సహా 27 మంది మావోయిస్టులు హతమైన సంగతి తెలిసిందే. వారిని చంపిన అనంతరం మృతదేహాల ముందు డీఆర్జీ (డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్) బలగాలు సంబరాలు చేసుకున్నాయి. బస్తర్ ఏరియాలో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా డీఆర్జీ పని చేస్తోంది.

ఉమ్మడి ఏపీలో గ్రేహౌండ్స్ తరహాలో ఛత్తీస్గఢ్ సర్కారు 2008లో దీన్ని ఏర్పాటు చేసింది. ఈ జరిగిన విషయంపై పౌరహక్కుల సంఘం నాయకులు మానవత్వం మరిచి పోలీసులు సంబరాలు చేసుకోవడంపై పలు విమర్శలు గుప్పించారు.

## తిరుమలలో నమాజ్ చేయించింది వైకాపా నేతలే

తిరుమల మే 23,

తిరుమలలో నమాజ్ కలకలంపై టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ స్పందించారు. తిరుమలలో నమాజ్ చేయించింది వైసీపీ నాయకులు. ఉద్దేశపూర్వకంగా ఇలాంటి ఘటనలకు పాల్పడటం హేయమైన చర్య అని విమర్శించారు. ఈ ఘటనపై క్రిమినల్ కేసులు నమోదు చేయబోతున్నాం. స్వామి వారికి రక్షణ లేదు అనే విధంగా భక్తులలో అభద్రతా భావాన్ని వ్యక్తపరిచేల వైసీపీ కుటిల రాజకీయం చేస్తోంది. రాజకీయంగా ఎదుర్కోవాలి? స్వామి వారిని అడ్డుపెట్టుకొని ఇలాంటి రాజకీయం చేయడం హేయమైన చర్య . భక్తులను అయోమయంలోకి తీసుకెళ్లే విధంగా వైసీపీ కుట్రలు చేస్తోందని అన్నారు.

## ఏసీబీ వలలో తూనికలు కొలతల శాఖా అధికారి

శ్రీకాకుళం మే 23,

శ్రీకాకుళం జిల్లా పలాసలో తూనిక లు కొలతలు శాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వ హించారు.ఈ దాడుల్లో ఇన్స్పెక్టర్ శ్రీధర్ పలువురు వ్యాపారుల నుంచి 1.78 లక్షలు లంచం తీసుకుంటుం డగా రెడ్ హ్యాండెడ్ గా శ్రీకాకుళం ఏసీబీ డిఎస్పి రమణమూర్తికి పట్టుబడ్డారు. ఘటనపై కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టులో శ్రీధర్ ను ప్రవేశ పెడుతున్నట్లు డి.ఎస్.పి మీడియాతో తెలిపారు.

## హైదరాబాద్ కు 2,000 ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్, మే 23,

హైదరాబాద్ నగర వాసులకు కేంద్ర ప్రభుత్వం గుడ్న్యూస్ చెప్పింది. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద 2,000 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించినట్లు కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్డీ కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో హైదరాబాద్కు ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపుపై నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా తెలంగాణ, కర్ణాటక, ఢిల్లీ, గుజరాత్ రాష్ట్రాలకు బస్సుల కేటాయింపుపై దృష్టి సారించారు. ఈ పథకం కింద హైదరాబాద్తో పాటు బెంగళూరుకు 4,500, ఢిల్లీకి 2,800, అహ్మదాబాద్కు 1,000, సూరత్కు 600 ఎలక్ట్రిక్ బస్సులను అందజేయనున్నట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కుమారస్వామి మాట్లాడుతూ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రస్తుతం సుస్థిర పట్టణ రవాణా దిశగా దృఢమైన అడుగులు వేస్తూ ముందుకు సాగుతోంది అన్నారు. బెంగళూరు నుంచి ఢిల్లీ వరకు, నగరాలు ప్రజా రవాణాను మరింత పరిశుభ్రంగా, సైకర్యవంతంగా మార్చేందుకు ఈవీ బస్సులను చురుకుగా స్వీకరిస్తున్నాయని అన్నారు. తాము ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించడమే కాకుండా, కొత్త ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణతో భారత రవాణా వ్యవస్థ భవిష్యత్తును అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని ఆయన చెప్పుకొచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పీఎం ఈ-డ్రైవ్ హామీని నెరవేర్చేందుకు తాము కట్టుబడి ఉన్నామని కేంద్రమంత్రి తెలిపారు.పీఎం ఈ-డ్రైవ్ పథకం ద్వారా 2024 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు రూ.10,900 కోట్ల వ్యయంతో 14,028 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తేవాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నామని ఆయన తెలిపారు. పీఎం ఈ-డ్రైవ్ పథకం ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ ప్రయత్నాలలో ఒకటిగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ఈ పథకం కింద కొనుగోలుదారులు డిమాండ్ ఇన్సెంటివ్ను పొందేందుకు ఈ-వోచర్లను కూడా మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిందన్నారు. ఇవే కాకుండా పీఎం ఈ-డ్రైవ్ కింద ఈ-అంబులెన్స్లు, ఈ-ట్రక్కులను కూడా కేంద్ర అందుబాటులోకి తీసుకురానుందన్నారు. ఇందు కోసం రూ.500 కోట్లు కేటాయించినట్టు మంత్రి తెలిపారు.

## హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం పర్యటన

సిద్దిపేటసిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. కాసేపు ద్విచక్ర వాహనంపై తిరుగుతూ డ్రైనేజీ సమస్యను సందర్శించారు. పట్టణంలోని మల్లె చెట్టు చౌరస్తాలో నిన్న రాత్రి కురిసిన వర్షానికి ముంపుకు గురైన దుకాణాలను, నాళాలను పరిశీలించారు. సమస్యను గురించి దుకాణదారులు, స్థానికులతో మాట్లాడారు. సత్వరమే వర్షపు నీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలంటూ హైవే కాంట్రాక్టర్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బస్వాపూర్, పందిళ్ల బ్రిడ్జ్, హుస్నాబాద్ పట్టణంలో పెండింగ్ లో ఉన్న పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని హైవే అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ఒకవేళ ఇదేవిధంగా జాప్యం చేస్తే కాంట్రాక్టర్ పై అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. వర్షపు నీరు ఇండ్లలోకి, దుకాణాలలోకి చేరకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించామని, కొంత ఇబ్బంది జరిగిన ప్రజలు సహకరించాలని కోరారు

## జూలూరులో కలెక్టర్ పర్యటన

యాదాద్రి

యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జూలూరు పిఏసి ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీ చేసారు. జాలి మిషన్ పనిచేయటం లేదని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం వరకు జాలి మిషన్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## తిప్పన్నపేటలో రైతులు అందోళన

జగిత్యాల

జగిత్యాల రూరల్ మండలం తిప్పన్న పేట గ్రామంలో రైతులు రోడ్డెక్కారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షానికి తడుస్తుందని ఆందోళన కు దిగారు. వడ్లబస్తాలు రోడ్డుకు అడ్డంగా పెట్టి, మొలకెత్తిన ధాన్యంతో నిరసన తెలిపారు. ధాన్యం కొనుగోలు చేయాలని రోడ్డుపై బైఠాయించి ధర్నా రాస్తారోకో చేసారు. ధర్మపురి-జగిత్యాల జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. నెల రోజులు గడిచినా ధాన్యం కొనుగోలు చేయట్లేదని ఆందోళనకు దిగారు. అధికారులు హామీ ఇచ్చేవరకు కదిలమని భీష్మించుకుని కూర్చున్నారు. పోలీసులు ట్రాఫిక్ ను డైవర్ట్ చేసి రైతులను సమదాయించారు.

## రైతులకు తెలియకుండా పోలాల్లో మట్టి తవ్వకాలు

సూర్యాపేట మే 23,

ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ నియోజకవర్గం లో కాంట్రాక్టర్ల దౌర్జన్యం కొనసాగుతుంటూ రైతులు ఆరోపించారు. -నేరేడుచెర్ల సమిపంలో రైతులపై కాంట్రాక్టర్ ప్రతాపం చూపించాడు. రైతుల అనుమతి లేకుండా అక్రమంగా ఆరు అడుగుల మేర భారీ యంత్రాలతో పొలాల నుండి మట్టిని తరలించారు. ప్రశ్నించిన రైతులను మీ ఇష్టమున్న చోట చెప్పుకోండని కాంట్రాక్ట్ సిబ్బంది అంటున్నారు. అన్నదాతలు లబోదిబోమంటున్నారు. కనీసం రైతులకు సమాచారం ఇవ్వకుండా మట్టిని తరలిస్తున్నారు. విషయం తెలుసుకొని మరుసటి రోజు వెళ్ళిన రైతులకు సొంత పొలాల్లో భారీ కందకాలు దర్శనం ఇచ్చాయి. పూడ్చేందుకు ఒక్కో రైతుకు రెండు లక్షల పైనే వ్యయం అవుతుందని అంచనా. పాత నేరేడుచెర్ల నుండి దుపాడ్ వరకు రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. నిబంధనల ప్రకారం మట్టిని కొనుగోలు చేసి తరలించాల్సిన కాంట్రాక్టర్, రైతుల పోలాలనుంచి మట్టిని తరలించాడు.

## జగన్ గడచిన ఐదేళ్లలో ఏ అభివృద్ధి చేశాడో చెప్పాలి

విజయవాడ మే 23,

వైఎస్ జగన్ గత ఐదేళ్లలో ఏం అభివృద్ఇ చేసాడో చెప్పాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సిఎం చంద్రబాబు ను చూసి, ఆయన మీద నమ్మకంతో ఈ ఏడాదిలో ఎనిమిది లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. ప్రతి ఏడాది పదిహేను శాతం అభివృద్ధి సాధించేందుకు ప్రణాళికను సిఎం చంద్రబాబు రూపొందించారు. కేంద్ర నిధులను జగన్ వినియోగించలేకపోయారు. కనీసం గ్రామాలకు త్రాగునీరు అందించలేకపోయారు. జలజీవన్ మిషన్ ద్వారా కూటమి ప్రభుత్వం గ్రామాలకు నీరు అందిస్తోందని అన్నారు.

## గన్నవరం నుంచి కొత్త విమాన సర్వీసులు

విజయవాడ మే 23,

గన్నవరం విమానాశ్రయం లో ఎయిర్ పోర్ట్ అడ్వైజరి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశం లో ఎయిర్ పోర్ట్ అడ్వైజరి కమిటీ చైర్మన్ ఎంపీ బాలశౌరి, వైస్ చైర్మన్ ఎంపీ కేశినేని శివనాథ్, ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, కృష్ణ జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర రావు, కలెక్టర్ లక్ష్మీశా తదితరులు పాల్గోన్నారు.

విజయవాడ ఎంపి కేశినేని శివనాద్ మాట్లాడుతూ గన్నవరం ఎయిర్పోర్ట్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఎయిర్పోర్ట్ అభివృద్ధి పనులపై సమీక్షించాం. భద్రతా ప్రమాణాలు, ట్రాఫిక్ మేనేజ్మెంట్పై చర్చించి ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదలపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని అన్నారు.

గన్నవరం విమానాశ్రయం నుంచి కొత్త సర్వీసులు ఏర్పాటు చేస్తున్నాం. గన్నవరం నుంచి దేశ,విదేశాలకు కొత్త సర్వీసులు రాబోతున్నాయి. కొత్త సర్వీసులు పెంచాలి అని ఎయిర్లైన్స్ ను కోరడం జరిగింది. త్వరలో కొత్త టెర్మినల్ ప్రారంభం అవుతుంది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల టెర్మినాల్ పనులు లేట్ అయింది. ఎయిర్పోర్ట్ లో 12 డిజైన్స్ మార్చాం. కూచిపూడి నృత్య భంగిమలు, మన సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా గన్నవరం ఎయిర్పోర్ట్ డిజైన్ ఉండబోతుందని అన్నారు.

## మే 21నుంచి జూన్ 21 వరకు యోగ దినోత్సవాలు..

బ్రహ్మంగారిమఠం మే 23,

ఈనెల 21 నుంచి జూన్ 21వరకు యోగా దినోత్సవాలు నిర్వస్తున్నట్లు పరిపాలనాధికారి మల్లికార్జునరావు తెలియజేశారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యోగ ఆంధ్ర ప్రోగ్రాంను మే 21నుండి జూన్ 21 వరకు నిర్వహిస్తామన్నారు.

# కవిత వేరు కుంపటేనా

హైదరాబాద్, మే 23,

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత? పార్టీ అధినేత కేసీఆర్ కు లేఖ రాశారు. పార్టీలోని పరిస్థితులను ఇందులో ప్రస్తావించారు. కొన్ని పాజిటివ్ అంశాలను పేర్కొంటూనే?. మరికొన్ని లోపాలను సూటిగా ఎత్తి చూపారు. కవిత రాసిన లేఖ బయటికి రావటంతో?. బీఆర్ఎస్ లో అసలేం జరుగుతోందన్న చర్చ హాట్ టాపిక్ గా మారింది.తెలంగాణ రాజకీయాల్లో సంచలన పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన ఓ లేఖ? ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఏకంగా పార్టీ అధినేత, తండ్రి అయిన కేసీఆర్ కే ఈ లేఖను సంధించారు. పార్టీలోని పరిస్థితులను వివరించే ప్రయత్నం చేశారు. కవిత తీరుపై రాజకీయవర్గాల్లోనే కాదు సొంత పార్టీలోనూ చర్చ జరుగుతోంది. పార్టీ పగ్గాల విషయంలోనే ఇదంతా జరుగుతుందా..? అన్న డిస్కషన్ కూడా తెరపైకి వస్తోంది. ఇప్పటివరకు పార్టీలో కేసీఆర్ తర్వాత?. కేటీఆర్, హరీశ్ రావ్ అంతా తామై నడిపిస్తున్నారు. భవిష్యత్తులో వీరిలోనే ఒకరికి పార్టీ పగ్గాలు అప్పగించే అవకాశం లేకపోలేదు. ఈ విషయంలో కవితకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..? అన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే కవిత కొత్త పార్టీ పెట్టే ఆలోచనలో కూడా ఉన్నారనే ఊహాగానాలు తెరపైకి వస్తున్నాయి. ఈ కోణంలోనే ఆమె? ఇదంతా చేస్తున్నారనే వాదన కూడా వినిపిస్తోంది.ఓవైపు పాజిటివ్ అంశాలను ప్రస్తావిస్తూనే?. మరోవైపు లోపాలను సూటిగా చూపారు. ఇందుకు సంబంధించిన ఓ లేఖ బయటికి రావటంతో?. అసలు బీఆర్ఎస్ లో ఏం జరుగుతోంది?? కుటుంబ విభేధాలు తారాస్థాయికి చేరాయా..? మరేమైనా పరిణామాలు చోటు చేసుకోబోతున్నాయా..? వంటి అంశాలు తెరపైకి వస్తున్నాయి'మై డియర్ డాడీ' అంటూ ఎమ్మెల్సీ కవిత ఆరు పేజీల లేఖ రాసినట్లు తెలుస్తోంది. పాజిటివ్, నెగెటివ్ ఫీడ్ బ్యాక్ అంటూ వివరంగా లేఖ రాశారు. ఎల్కతుర్తి సభ గురించి ఇందులో పలు అంశాలను ప్రస్తావించారు. ఓ రకంగా సభ నిర్వహణ తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. సభా వేదికపై పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు.

పార్టీ ఆవిర్భావం నుంచి అండగా నిలిచిన నాయకులు, ధూంధాం కార్యకర్తలు ప్రసంగించి ఉంటే.. అది శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపి ఉండేదన్నారు.పార్టీ లీడర్స్కు యాక్సెస్ ఇవ్వడం లేదంటూ కవిత తన లేఖ ద్వారా కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. బీజేపీపై 2 నిమిషాలే మాట్లాడడంతో అనుమానాలు బలపడుతున్నాయని? బీజేపీ వల్ల తాను కూడా చాలా ఇబ్బందిపడ్డాను అని గుర్తు చేశారు. సభా వేదిక నుంచి బీజేపీని టార్గెట్ చేసి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయకుండా బీజేపీకి మద్దతు ఇచ్చిందనే సందేశాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిందన ఇది పార్టీకి ప్రతికూలంగా మారిందని కవిత గుర్తు చేశారు.వక్ఫ్ బిల్లుపై మాట్లాడి ఉంటే బాగుండేదని? బీసీలకు 42 శాతం కోటా అంశం విస్మరించినట్లు కవిత తన లేఖలో గుర్తు చేశారు.ఎస్సీ వర్గీకరణపై కూడా మాట్లాడలేదని చెప్పారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పార్టీకి నిర్దిష్టమైన



కార్యక్రమాలు, మార్గదర్శకాలు అవసరమని అంతా భావించారని కానీవరంగల్ సభలో అలాంటి స్పష్టత కొరవడిందని ప్రస్తావించారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్చడం, తెలంగాణ గీతం విషయం వంటి అంశాలను కూడా ఇందులో పేర్కొన్నారు.ప్రస్తుతం అమెరికా పర్యటనలో కవిత ఉన్నారు.ఆమె విదేశాల్లో ఉంటున్న సమయంలో లేఖ బయటికి రావటంతో? బీఆర్ఎస్ పార్టీ నేతలు, శ్రేణులు ఉలికిపాటుకు గురవుతున్నారు. అసలు పార్టీలో ఏం జరుగుతోందని చర్చించుకున్నారు.అధికారం కోల్పోయిన తర్వాత కొద్దిరోజుల్లోనే బీఆర్ఎస్ పార్టీ మళ్లీ లైన్ లోకి వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల్లో ఖాతా కూడా తెరవలేకపోయిన ఆ పార్టీ ఆ తర్వాత ఒక్కో కార్యక్రమాన్ని తీసుకుంటే ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నాలను బలంగా చేసింది. ఈ విషయంలో సక్సెస్ అవుతూనే వచ్చింది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఏ చిన్న అవకాశాన్ని కూడా చేజారనివ్వకుండా సద్వినియోగం చేసుకున్నట్లు కనిపించింది.కట్ చేస్తే పార్టీ రజతోత్సవ సభను బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నాలుగైదు నెలలుగా కసరత్తు చేయగా? ఏప్రిల్ లో సభను నిర్వహించింది. భారీ స్థాయిలో జనసమీకరణ చేయటంతో సభ గ్రాండ్ సక్సెస్ అయింది. అయితే సభ తర్వాత అనేక అంశాలు తెరపైకి వస్తున్నాయి. నిజానికి సభ ఏర్పాట్ల బాధ్యతలను ముందుగా హరీశ్ రావుకు అప్పగించారు. దీంతో ఆయన పలుమార్లు క్షేత్రస్థాయిలో కూడా పర్యటించారు.

సభ కోసం స్థలాలను కూడా పరిశీలించారు. అయితే ఉన్నట్టుండి? హరీశ్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత కేటీఆర్ సీన్ లోకి వచ్చారు. అయితే హరీశ్ రావును తప్పించారా..? లేక తప్పుకున్నారా..? అన్న చర్చ గట్టిగా జరిగింది.ఇక రజతోత్సవ సభ వేదికపై కేవలం కేసీఆర్, కేటీఆర్ ఫొటోలను మాత్రం ప్రదర్శించారు. కేటీఆర్ కు పార్టీ నాయకత్వ బాధ్యతలను అప్పగించే కోణంలోనే ఇదంతా జరుగుతుందా..? అన్న చర్చ జోరుగా తెరపైకి వచ్చింది.నిజానికి కూడా వేదికపై ఏ ఇతర నాయకుల ఫొటోలకు కూడా అవకాశం కల్పించలేదు. అంతేకాదు పార్టీ వేదికపై కేవలం కేసీఆర్ మాత్రమే మాట్లాడారు. ఏ ఒక్క నాయకుడికి కూడా అవకాశం ఇవ్వలేదు.కొంతకాలంగా బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్సీ కవిత తీరు కూడా చర్చనీయాంశంగా మారింది. బీసీ అజెండాతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తూ ముందుకెళ్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ జెండా కాకుండా?. కవిత కేంద్రంగానే ఇదంతా నడుస్తోంది. జిల్లా పర్యటనలు చేస్తూ తమ మార్క్ ను చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవలే మే డే కార్యక్రమంలో పాల్గొన్న ఆమె? కొన్ని సీరియస్ కామెంట్స్ చేసిందిభౌగోళిక తెలంగాణ మాత్రమే సాధించుకున్నాం.

సామాజిక తెలంగాణ సాధించుకోలేకపోయాం. భూమి ఉన్న వాళ్లకే పంట పెట్టుబడి సాయం ఇచ్చాం. కానీ ఏమీ లేనివాళ్లకు ఏం చేయలేకపోయాం" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. సరిగ్గా ఈ వ్యాఖ్యలను ప్రత్యర్థి రాజకీయ పార్టీలు అస్త్రంగా మలుచుకున్నాయి. గత పదేళ్ల పాటు అధికారంలోకి ఉన్నది బీఆర్ఎస్ పార్టీనే కదా? సామాజిక తెలంగాణ దిశగా ఎందుకు అడుగులు వేయలేకపోయారంటూ ప్రశ్నలు ఎక్కుబెట్టారు.అంతేకాదు? రైతుబంధు విషయంలో పలు ప్రశ్నలను సంధించారు. కవిత వ్యాఖ్యలను సొంత పార్టీ నేతలు కూడా సమర్థించుకోలేని పరిస్థితి ఏర్పడినట్లు అయింది. దీంతో ఆమె చేసిన వ్యాఖ్యలు పార్టీలోనూ చర్చనీయాంశంగా మారిపోయాయి.ఇటీవలే మీడియాతో మాట్లాడిన కవిత? తనపై కుట్రలు చేస్తున్నారంటూ కూడా మాట్లాడారు. వాళ్లెవరో తనకు తెలుసని? టైమ్ వచ్చినప్పుడు బయటపెడతానంటూ వార్నింగ్ కూడా ఇచ్చారు. తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండించాల్సిన బాధ్యత పార్టీపై కూడా ఉందంటూ ఆవేదనను వ్యక్తపరిచేలా మాట్లాడారు. అయితే కవిత?. పార్టీలోని ఓ కీలక నేతను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని పార్టీ అధినేత కేసీఆర్ దృష్టికి కూడా తీసుకెళ్లారంట..!ఎమ్మెల్సీ కవిత తీరు చూస్తుంటే పార్టీలోని పరిస్థితులపై ఆమె తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.ఇటీవలే ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలే ఇందుకు బలం చేకూరుస్తున్నాయని చెప్పొచ్చు. పార్టీ నుంచి తనని సైడ్ చేస్తున్నారనే భావన ఆమెలో బలంగా ఉన్నట్లు కనిపిస్తోంది. పార్టీలో తన ప్రియారిటీని తగ్గించే పరిణామాలు కనిపిస్తున్నాయనే భావనలో కూడా కవిత ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే?.ఆమ సొంతగా పలు కార్యక్రమాలను చేపడుతున్నట్లు అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.పూలే విగ్రహా ఏర్పాటు, బీసీలకు రిజర్వేషన్లు,మహిళా రిజర్వేషన్ల వంటి పలు అంశాలపై కవిత ప్రధానంగా పోరాడుతున్నారు. దీక్షలతో పాటు పలు కార్యక్రమాలను కూడా చేపట్టారు. అంతేకాదు జిల్లాల పర్యటనలు కూడా చేస్తున్నారు. మరోవైపు జాగృతితో పాటు అనుబంధ సంఘాలను కూడా బలోపేతం చేస్తున్నారు. ఇటీవలనే జాగృతి అనుబంధ సంఘాలకు కొత్త కమిటీలను కూడా ప్రకటించారు. మొత్తంగా తన కార్యక్రమాలకు మరింత పదును పెట్టే దిశగా కవిత అడుగులు వేస్తున్నారు.నిజానికి ప్రస్తుతం బయటికి వచ్చిన లేఖ? ఎల్కతుర్తి సభ తర్వాత కవిత?. కేసీఆర్ కు రాసినట్లు తెలుస్తోంది. మొత్తంగా కవిత రాసిన లేఖ వ్యవహారం బీఆర్ఎస్ లోనే కాదు రాజకీయవర్గాల్లోనూ సంచలనంగా మారింది. ఈ లేఖ వ్యవహారం పార్టీ అంతర్గత సమస్య వరకే ఉంటుందా..? లేక సరికొత్త రాజకీయ పరిణామాలకు దారి తీస్తుందా?? అనేది చూడాలి?!

## 29 నుంచి దోస్త్ సీట్ల కేటాయింపు

హైదరాబాద్, మే 23 (న

తెలంగాణలో డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం దోస్త్ - 2025 షెడ్యూల్ విడుదలైన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఫస్ట్ ఫేజ్ రిజిస్ట్రేషన్ల గడువు ముగిసింది. మరోవైపు వెబ్ ఆప్షన్ల గడువు కూడా పూర్తి కానుంది.మరికొన్ని గంటలు మాత్రమే ఉండటంతో? రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.దోస్త్ ఫస్ట్ ఫేజ్ కు సంబంధించి 87వేలకుపైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్లుచేసుకున్నారు. వీరిలో 50 వేలకుపైగా మంది విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఎంచుకున్నారు. మిగిలిపోయిన విద్యార్థులు కూడా ష్ట్రబిబిజూబ:// టనీబబి.ఇణణ.ణనీల.తిని వెబ్ సైట్ లోకి వెళ్లి ప్రాసెస్ పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. మే 29వ తేదీన ఫస్ట్ ఫేజ్ సీట్లను కేటాయించనున్నారు.దోస్త్ 2025 ఫస్ట్ ఫేజ్ లో సీట్లు పొందే విద్యార్థులు మే 30వ తేదీ నుంచి ఆయా కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాలి. ఈ గడువు జూన్ 6వ తేదీతో ముగుస్తుంది. సీటు పొందిన కాలేజీలో రిపోర్టింగ్ చేయకపోతే? వారి సీటు రద్దు అవుతుంది. మొదటి సెమిస్టర్ తరగతులు జూన్ 30వ తేదీ నుంచి ప్రారంభవుతాయి.దోస్త్ ఫస్ట్ ఫేజ్ లో సీటు పొందే విద్యార్థులు ష్ట్రబిబిజూబ://టనీబబి.ఇణణ.ణనీల.తిని/లివశ్రీఇనీఎవ.టనీ వెబ్ సైట్ నుంచి అలాట్ మెంట్ కాపీని పొందవచ్చు. ఈ కాపీతో పాటు విద్యా అర్హత పత్రాలను సంబంధిత కాలేజీలో సమర్పించి అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది.తెలంగాణ దోస్త్ 2025 రెండో విడత కింద మే 30 నుంచి జూన్ 8 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. జూన్ 13న సీట్ల కేటాయింపు ఉంటుంది. ఇక మూడో విడత ప్రక్రియ జూన్ 13 నుంచి షురూ అవుతుంది. ఇందుకు జూన్ 19వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. జూన్ 13 నుంచి 19 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవాలి. జూన్ 23న సీట్ల కేటాయింపు ఉంటుంది.ఇంటర్ పూర్తి అయిన విద్యార్థులు డిగ్రీలో ప్రవేశం కోసం దోస్త్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. కాలేజీలను ఎంచుకోవాలి. వారి స్కోర్, రిజర్వేషన్ ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. దోస్త్ రిజిస్ట్రేషన్ల ద్వారా తెలంగాణలోని ఉస్మానియా యూనివర్శిటీ, కాకతీయ యూనివర్శిటీ, పాలమూరు, మహాత్మగాంధీ, తెలంగాణ వర్శిటీ,చాకలి ఐలమ్మ, శాతవాహన వర్శిటీల పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలను కల్పిస్తారు.

## యోగాంధ్ర ను విజయవంతం చేయండి

బ్రహ్మంగారిమఠం

సుమారు నెలరోజులు పాటు సాగే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయుర్వేద వైద్యులు డాక్టర్ మహేష్ పల్లా పిలుపునిచ్చారు యోగాంధ్ర-2025 పేరున జరిగే ఈ మిషన్ పై ప్రజల్లో చైతన్యాన్ని కలిగించడానికి స్థానిక వీరబ్రహ్మేంద్ర పార్క్ నందు ఉన్నటువంటి ధ్యాన మందిరంలో నేడు ప్రారంభమై కౌంట్ డౌన్ మొదలై జూన్ 21 తో ముగుస్తుంది అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం విశాఖపట్నంలో ప్రధాని మోడీ ముఖ్యఅతిథిగా హాజరై జరుపుకునేందుకు ఏర్పాటు చేస్తున్నారు .రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మందితో వివిధ చోట్ల ఈ కార్యక్రమం నిర్వహించేలా ఏర్పాటు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు ఆహ్వానం మేరకు ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమానికి ప్రధాని మోడీ ముఖ్యఅతిథిగా హాజరుకానునట్లు తెలిపారు సమకాలీన జీవన ఆరోగ్య సమస్యలకు ,సమగ్ర పరిష్కార మార్గానికి, మానసిక ఆరోగ్య సమస్యలకు యోగ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని మండల స్థాయిలో ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయుష్ వైద్యులు డాక్టర్ మహేష్ .పల్లా ఒక ప్రకటనలో పేర్కొన్నారు

=================================

## గ్రూప్, 2, 3 ఇంటర్వ్యూలకు కమిషన్ కసరత్తు

హైదరాబాద్, మే 23, (న్యూస్ పల్స్)

తెలంగాణలో ఏప్రిల్ నాటికి ఉద్యోగ నియామకాల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం భావించినా కోర్టు కేసులతో జాప్యం జరుగుతోంది.ప్రాధాన్యత క్రమంలో గ్రూప్ 1, 2, గ్రూప్ 3 ఉద్యోగాలను భర్తీ చేయాలని భావించినా ఆలస్యమైంది.గ్రూప్ 1 వ్యవహారం కొలిక్కి రావడంతో గ్రూప్2, 3 సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపడతారు.తెలంగాణ గ్రూప్ 1 నియామక ప్రక్రియ కొలిక్కి వస్తుడంటంతో మిగిలిన ఉద్యోగ నియామకాలను కొలిక్కి తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. గ్రూప్-1 సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిలిపివేయాలంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడం, పిటిషనర్లకు న్యాయస్థానం జరిమానా విధించడంతో గ్రూవ్1 సర్టిఫికెట్ వెరిఫికేషన్ తుది తీర్పుకు లోబడి నిర్వహించారు.గ్రూప్1 వ్యవహారంపై కమిషన్ వాదనలతో కోర్టులో న్యాయ వివాదం కొలిక్కి వచ్చిన వెంటనే టీజీపీఎస్సీ మిగిలిన ఉద్యోగ నియామక పరీక్షలకు సంబంధించిన కసరత్తు పూర్తి చేయాలని కమిషన్ భావిస్తోంది.తెలంగాణలో 2,171 గ్రూప్-2, 3 పోస్టుల భర్తీకి కమిషన్ కసరత్తు ప్రారంభించింది,. రాత పరీక్షల్లో జనరల్ ర్యాంకింగ్ ఆధారంగా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టేందుకు పరిపాలన ప్రక్రియను టీజీపీఎస్సీ ఇప్పటికే పూర్తి చేసింది.ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ పాయింట్లు, మొత్తం పోస్టుల సంఖ్య ఆధారంగా 1:11 నిష్పత్తిలో అభ్యర్థుల జాబితా ప్రకటించనుంది. గ్రూప్2, గ్రూప్ 3 ఉద్యోగ నియామకాల ప్రక్రియ ఇప్పటికే ఆలస్యం కావడంతో వెంటనే చేపట్టడమో, గ్రూప్ 3 పోస్టింగుల ప్రక్రియ పూర్తయ్యాక చేపట్టాలనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.783 గ్రూప్2 పోస్టుల భర్తీకి గతేడాది డిసెంబరు 15,16 తేదీల్లో రాత పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు ,49,964 మంది హాజరయ్యారు. ఓఎంఆర్ పత్రాల్లో పొరపాట్లు చేయడం, బబ్లింగ్ సరిగా చేయకపోవడం వంటి కారణాలతో 13,315 మంది అభ్యర్థులను కమిషన్ అనర్హులుగా ప్రకటించింది.మరోవైపు గ్రూప్-2 పరీక్షలు పూర్తైన మూడు నెలల్లోపే జనరల్ ర్యాంకు జాబితా టీజీపీఎస్సీ ప్రకటించింది. పరీక్ష రాసిన వారిలో 2,36,649 మందికి వచ్చిన మార్కులతో జనరల్ ర్యాంకింగ్ జాబితాను ఈ ఏడాది మార్చి 11న విడుదల చేశారు?.గ్రూప్-3 రాత పరీక్షల జనరల్ ర్యాంకింగ్ కూడా ఇప్పటికే విడుదలైంది. గ్రూప్ 3లో 1,388 పోస్టుల భర్తీకి 2024 నవంబరు 17, 18 తేదీల్లో నిర్వహించిన రాత పరీక్షలకు 2,67,921 మంది హాజర య్యారు. పరీక్షల్లో నిబంధనలు పాటించని 18,364 మందిని పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనర్హులుగా ప్రకటించింది.మిగిలిన 2,49,557 మంది అభ్యర్థులతో మార్చి 14న జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ విడుదలైంది. ఏప్రిల్ నెలాఖరుకు అన్ని నియామకాలు పూర్తి చేయాలని కమిషన్ భావించినా గ్రూప్-1పై న్యాయవివాదాలు రావడంతో గ్రూప్ 2, గ్రూప్ 3 ఉద్యోగాలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆలస్యమైంది.గ్రూప్-1 నియామక ప్రక్రియ పూర్తి కాకుండా గ్రూప్-2, 3 ఎంపికలు ప్రారంభిస్తే పోస్టుల్లో ఖాళీలు మిగిలిపోతాయని కమిషన్ భావిస్తోంది. మెరిట్ అభ్యర్థులకు అన్యాయం జరగకుండా ప్రాధాన్య క్రమంలో పోస్టుల్ని భర్తీ చేయాలని యోచిస్తోంది.స్త్రీ శిశు సంక్షేమ శాఖలో సీడీపీవో, మేనేజర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. 2022లో విడుదలైన 23పోస్టులకు 19,812 మంది దర ఖాస్తు చేశారు. 2023 జనవరిలో ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత టీజీపీఎస్సీ పరీక్షల పేపర్ లీక్ కావడంతో ఈ ఏడాది జనవరి 3,4 తేదీల్లో మరోసారి ఆన్లైన్ పరీక్ష నిర్వహించారు. దీని ఆధారంగా మల్టీ జోన్ 1,2 ఫలితాలను విడుదల చేశారు. కమిషన్ వెబ్సైట్లో ఫలితాలు అందుబాటులో ఉంటాయి.

# జహీరాబాద్ అభివృద్ధికి, ప్రగతి పూర్తి సహకారం:సీఎం రేవంత్ రెడ్డి





సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, మే 23:జహీరాబాద్ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి అన్నారు.జహీరాబాద్ బహిరంగసభలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి మెదక్ ప్రాంతానికి ఇందిరమ్మకు ఉన్న అనుబంధం విడదీయలేనిదని ఆయన అన్నారు. మెదక్ పేరు గుర్తొస్తేనే ఇందిరమ్మను తలచుకుంటామని తెలిపారు. మెదక్ పేరు గుర్తొస్తేనే ఇందిరమ్మను తలచుకుంటామని తెలిపారు. అలాగే ఇందిరమ్మ గుర్తొచ్చిన ప్రతీసారి మెదక్‌ని తలుచుకుంటామని ఆయన వివరించారు. ఇందిరమ్మ తన చివరి రోజుల్లో మెదక్ ఎంపీగా కొనసాగారని గుర్తుచేశారు.రైతులను అప్పుల బాధ నుంచి విముక్తి కలిగించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతు భరోసాని 12 వేలకు పెంచి సహాయం అందిస్తున్నామని చెప్పారు. భూమి లేని రైతులకు కూడా సహాయం అందిస్తున్నామని తెలిపారు.. వరి వేసుకుంటే ఉరే అని ఆనాటి పాలకులు అన్నారని.. కానీ నేడు వరి పంటకు బోనస్ ఇస్తున్నామన్నారు.18 నెలల్లో మహాలక్ష్మి పథకం కోసం 5500 కోట్లు కేటాయించామని.. కోటి మంది మహిళలను కొటేశ్వరులు చేయాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మిస్ వరల్డ్ కాంపిటీషన్ కి వచ్చిన వారు మన ఆడబిడ్డలు చేసిన వస్తువులను చూశారన్నారు.. మహిళలే బస్సులు కొని ఆర్టీసీకి కిరాయి ఇచ్చేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇందిరమ్మని ఆదర్శంగా తీసుకుని సోనియమ్మ స్ఫూర్తితో ఆడబిడ్డలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తామని భరోసా ఇచ్చారు.తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్న యువతకు గత పదేళ్లుగా ఉద్యోగాలు లేవని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కోసం చర్యలు తీసుకుంటున్నామని.. మీ అందరూ అండగా ఉంటే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని చెప్పారు.రాష్ట్రానికి రావాల్సిన నిధులు కోసం ప్రధాని మోడీని ఎన్ని సార్లు అయిన కలుస్తామని స్పష్టం చేశారు. చెరువు మీద అలిగితే మనకే వాసన వస్తుందని అన్నారు. నేను మీ కోసం పని చేస్తా%ఔ% కష్టపడుతానన్నారు.గత ప్రభుత్వ హయాంలో నిమ్జ్ అభివృద్ధి కుంటుపడిందని ముఖ్యమంత్రి ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిమ్జ్ భూ నిర్వాసితులకు నష్టపరిహారం పెంచాం, భూసేకరణను వేగవంతం చేశామని చెప్పుకొచ్చారు. త్వరలో హ్యుందాయ్ కార్ల తయారీ కంపెనీ ఇక్కడ పనులు ప్రారంభిస్తోందని చెప్పారు. నిమ్జ్ భూ నిర్వాసితులైన 5612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు.ఆ కుటుంబాలకు భోజనాలు పెట్టి ఇండ్ల పట్టాలు ఇచ్చే బాధ్యత జగ్గారెడ్డికి అప్పగించారు.జహీరాబాద్ అభివృద్ధి కోసం ప్రత్యేక సమీక్ష చేసి నిధులు మంజూరు చేస్తాం. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు%ఔ%ఆ తర్వాత అభివృద్ధి మన అజెండా. సంజీవ రెడ్డి, సురేష్ షెట్కార్ నారాయణఖేడ్ కి రెండు కళ్ళలాంటి వారు. పటాన్ చెరు ఇండియా ప్రాంతం.బి హెచ్ ఎల్,బి డి ఎల్, నిమ్జ్ ఇక్రిశాట్ ఇవన్నీ కాంగ్రెస్ హయాంలో వచ్చినవే.. సింగూరు నుంచి మంజీరా జలాలు హైదరాబాద్ దాహార్తిని తీరుస్తున్నాయి. సింగూరు ప్రాజెక్టును టూరిజం హబ్ గా మారుస్తాం.” అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.15 నెలల్లో తెలంగాణ కు 3 లక్షల కోట్ల పెట్టు బడుల్ని తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు.జహీరాబాద్ చెరుకు రైతులు సహకారం సంఘం గా ఏర్పడి ముందుకు వస్తే నిమ్జ్ లో స్థలం కేటాయించి చెరుకు కర్మాగారం ఏర్పాటుకు సహకారం అందిస్తామని చెప్పారు.ప్రతిపక్ష రాజకీయ నాయకులు అసెంబ్లీకి రావాలని మరోసారి సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏ రోజు తాను సీఎంగా అహంకారానికి పోలేదని చెప్పారు. ప్రతిపక్షాలు అండగా ఉంటే అద్భుతాలు చేస్తామని.. ప్రపంచంలో తెలంగాణని గొప్ప రాష్ట్రంగా తీర్చుదిద్దుతామని తెలిపారు.

# పథకాల అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం

**- ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పర్యటనలో మంత్రి పొంగులేటి**





ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మే 23:అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి తో పనిచేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మంత్రి, ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంతాల్లో పర్యటించి పలు రోడ్డు విస్తరణ, పాఠశాల అదనపు తరగతి గది నిర్మాణ పనులకు శంఖుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి, ముత్తగూడెం వద్ద రూ. 800 లక్షలతో తిరుమలాయపాలెం నుండి తాలేసు తాండ వరకు రోడ్డును రెండు వరసల రోడ్డు గా అభివృద్ధి, ఎన్ఎస్పీ కెనాల్ పై హై లెవెల్ వంతెన నిర్మాణ పనులకు, ఎం.వి. పాలెం ప్రాథమిక పాఠశాలలో రూ. 13.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గది నిర్మాణ పనులకు, రూ. 1400 లక్షలతో పొన్నెకల్ నుండి పిట్టలవారిగూడెం రోడ్డు, రెండు వరసల రోడ్డుగా అభివృద్ధి పనులకు, కాచిరాజుగూడెం వద్ద రూ. 1900 లక్షలతో చింతపల్లి నుండి కాచిరాజుగుడెం వరకు రోడ్డును రెండు వరసల రహదారిగా అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేశారు. ఎం.వి. పాలెం ప్రాథమిక పాఠశాల వద్ద ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంత్రి, మంజూరు పత్రాలు అందజేశారు. పనులు నాణ్యతతో, సకాలంలో పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఆదేశానుసారమే ఇసుక,మట్టి దందా అంటూ ‘మామూలు’గా తీసుకుంటున్న మైనింగ్, పోలీస్, రెవెన్యూ శాఖలు


**-అడ్డూ అదుపూ లేకుండా యథేచ్ఛగా ఇసుక తరలింపు**

**-అక్రమంగా ఇసుక తరలించి సామాన్య ప్రజలను కొల్లగొడుతున్న అధికార పార్టీ నాయకులు**

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) మే 23:సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం సర్వారం వాగు నుండి అధికార పార్టీ నాయకులు అడ్డగోలుగా ఇసుక తోడేస్తున్నా కనీసం అటువైపు కన్నెత్తి



చూడలేని మైనింగ్, రెవెన్యూ, పోలీస్, పర్యావరణ శాఖా అధికారుల పనితీరు సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. ?ఇసుక అక్రమ రవాణాపై అధికారులు చర్యలు తీసుకుంటామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇసుక దళారులు వేములూరు వాగును ఇష్టానుసారం తవ్వేస్తూ ‘జలసిరి’ని తరలించి జేబులు నింపుకొంటున్నారు. గరిడేపల్లి మండలం సర్వారం గ్రామ శివారులోని వాగు నుంచి కొన్ని నెలలుగా ఇసుక రవాణా కొనసాగుతోంది. ఇందుకోసం సుమారు 20 ట్రాక్టర్లను వాడుతున్నారు. వాగులో కూలీలతో ఇసుక సేకరించి ఒడ్డుకు తీసుకువచ్చి ట్రాక్టర్లలో నింపుకొని హుజూర్ నగర్ తరలించి అదును చూసుకుని అర్ధరాత్రి మరియు తెల్లవారు జాము సమయంలో ఒక్క ట్రక్కు ఇసుక సుమారు రూ.4000 నుండి 5000 వరకు విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారం బహిరంగంగానే సాగుతున్నా సంబందిత మైనింగ్, పోలీస్ శాఖాధికారులు పట్టించుకోకపోగా మంత్రి ఆదేశానుసారమే ఇసుక,మట్టి దందా జరుగుతుందని బహటంగానే జిల్లా అధికారులే చెపుతున్నారు.అదే అదును చేసుకొని అధికార పార్టీ నాయకులు అక్రమంగా ఇసుక తరలించి సామాన్య ప్రజలను కొల్లగొడుతున్నారు. దాదాపు కొన్ని నెలలుగా అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అట్టి రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు ఒక్కో ట్రాక్టర్ కు



నెల నెలా మంత్లీ మామూళ్ల చొప్పున వసూలు చేస్తున్నారని, అధికారుల పర్మిషన్ తోనే అమ్మకాలు చేయడం జరుగుతుందని బహిరంగంగా యాజమాన్యాలు చెప్తున్నారు ఇసుక తవ్వేందుకు ఎలాంటి పర్మిషన్ లేకున్నా అక్కడ తవ్వడం చట్టరీత్యా నేరమైన అధికారులకు తప్పుతున్నారని తెలిసినా గానీ తమకేమీ పట్టనట్లుగా జిల్లా మైనింగ్ భూగర్భ గనుల శాఖ అధికారులు మరియు రెవెన్యూ పోలీస్ వ్యవస్థలు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ అక్రమాలను కొనసాగిస్తుండడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ అక్రమ తవ్వకాలు తోలకాలు జరుగుతున్న 100కు కాల్ చేసి చెప్పిన తమ ఉన్నతాధికారులు చెబితేనే ఏదైనా చేస్తామని, అసలు తమకు సంబంధం లేదని సంబంధించిన శాఖాధికారులకు ఫిర్యాదు చేయాలని పోలీస్ అధికారులు మొహమాటం లేకుండా చెప్పటం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జేపసీ పోరుబాటలో భాగస్వాములు కావాలి: పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు



ఖమ్మం బ్యూరో, భారత శక్తి, మే 23: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు కోరారు. బోనకల్ మండలంలోని రావినూతల పాఠశాలలో శుక్రవారం జరిగిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల నమోదు పెంచడానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయిలో ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తుందన్నారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు పాఠశాలతో పాటు సమాజంతో మమేకమైనప్పుడే అనుకున్న ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. తొందరలోనే ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు ఉంటాయన్నారు. మెరుగైన పిఆర్సి పెండింగ్ డిఎల సాధన కోసం తమవంతుగా కృషి చేస్తామన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధ్యాయులు పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీ ఆర్టియు జిల్లా మండల నాయకులు రత్నకుమార్, రెబ్బ శ్రీనివాసరావు, మోతుకూరి మధు, కొమ్ము శ్రీనివాసరావు, సిహెచ్ రవికుమార్, కోనకంచి రామ్మోహన్, మద్దినేని వెంకటేశ్వరరావు, తిరునగిరి స్వామి, గుడిమల్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టంతో ప్రజల భూ సమస్యలు పరిష్కారం: మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి.

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మే 23:ప్రభుత్వం భూ భారతి, ఇందిరమ్మ ఇండ్లు అంశాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని, ప్రజల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ధరణి చట్టాన్ని ప్రక్షాళన చేసి, ప్రజలు మెచ్చే విధంగా భూ భారతి చట్టాన్ని తెచ్చామన్నారు. చట్టం విధి విధానాలపై ప్రజల్లో అవగాహన కు మండల కేంద్రాల్లో అవగాహన సదస్సులు చేపట్టినట్లు, రాష్ట్రంలోని 33 జిల్లాలకు గాను 29 జిల్లాల్లో ప్రత్యక్షంగా తాను పర్యటించినట్లు తెలిపారు. ఏ గ్రామం, ఏ ప్రాంతానికి వెళ్లిన ప్రజలు ధరణితో ఎన్ని ఇబ్బందులు పడ్డారో చూశానని అన్నారు. అన్ని ప్రాంతాల ప్రజలు, ఆసాములు భూ భారతి చట్టంపై సంతోషం వెలిబుచ్చారన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్ల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకున్నామన్నారు. జిల్లాలోని నేలకొండపల్లి మండలాన్ని పైలట్ మండలంగా ఎంపిక చేసి, అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, దాదాపు 3200 దరఖాస్తులు స్వీకరించామన్నారు. దరఖాస్తుల్లో 50 శాతానికి పైగా సాదా బైనామ కి సంబంధించి ఉన్నాయని, కోర్ట్ లో సాదా బైనామ కి సంబంధించి కేస్ వెకేట్ కాగానే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. జూన్ 2 నాటికి మొదటి విడత పైలట్ మండలాల అన్ని సమస్యలు, రెండో విడత 28 మండలాల్లో సత్వర పరిష్కార సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. సాగుయోగ్యమైన అసైన్డ్ భూముల్లో ఉన్న కడు పేదవారికి పట్టాలు ఇస్తామన్నారు. జూన్ 3 నుండి 20 వరకు భూ భారతిచట్టం ద్వారా రెవెన్యూ సమస్యలు పరిష్కారించేందుకు అధికార యంత్రాంగం గ్రామాలకు వస్తుందన్నారు. ప్రతి భూ సమస్య పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధి తో పనిచేస్తారన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం పేదవారికి ఇస్తుందని మంత్రి తెలిపారు. అందులో 1.95 లక్షల లబ్ధిదారులను ఇప్పటికే ఫైనల్ చేశామన్నారు. మిగతా 2.55 లక్షల లబ్ధిదారులను ఈ నెలాఖరుకు ఫైనల్ చేస్తామన్నారు. రాష్ట్రంలోని 9800 చెంచు, చెంచు ఉపకులాల కుటుంబాలన్నింటికి పూర్తిగా ఇందిరమ్మ ఇండ్లను అందజేస్తామన్నారు. ఐటీడీఏ




ప్రాంతాల్లోని గిరిజనులకు అదనంగా మరో 10 వేల ఇండ్లు ఇస్తామన్నారు. పైలట్ గా ప్రతి మండలం నుండి ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి, 8 వేల ఇండ్లు నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఇండ్లు ప్రారంభించిన వారికి మొదటి విడత పేమెంట్ అందజేశామన్నారు. ప్రతి సోమవారం పేమెంట్ చేపడుతున్నట్లు తెలిపారు. జూన్ 2 న కనీసం వేయి ఇండ్లు నిర్మాణం పూర్తి చేసి, ప్రారంభోత్సవం చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే 3-4 సంవత్సరాల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామన్నారు. లైసెన్స్ సర్వేయర్లకు నోటిఫికేషన్ ఇస్తే, రాష్ట్ర వ్యాప్తంగా 10 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. 50 పనిదినాల్లో వీరికి శిక్షణ ఇచ్చి, అనంతరం పరీక్ష పెట్టి, ఉత్తీర్ణత పొందిన వారిని లైసెన్స్ సర్వేయర్ గా గుర్తిస్తామన్నారు. ఖమ్మం జిల్లాలో 458 లైసెన్స్ సర్వేయర్ కి దరఖాస్తు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, నిరుద్యోగ యువతకు ప్రతి నెల ఆదాయం వచ్చే విధంగా కార్యాచరణ చేస్తామన్నారు.ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారైని నియమిస్తామని మంత్రి తెలిపారు. గతంలో విఆర్వో, విఆర్ఏ లుగా పనిచేసిన వారి నుండి అప్షన్లు తీసికొని, వారికి ఈ నెల 27న పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణత పొందిన వారిని గ్రామ రెవెన్యూ అధికారిగా నియమిస్తామన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా, వచ్చిన ఆదాయంతో అప్పులు కడుతూ, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కాస్త ఆలస్యమైన ఇచ్చిన మాట ప్రకారం ప్రతి హామీని అమలు చేస్తామని మంత్రి తెలిపారు.

# పహల్గాం బాధితులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలి: శీతల రోషపతి



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) మే 23:కాశ్మీర్లో పహల్ఘామ్ ఉగ్ర దాడిలో మరణించిన ప్రతి ఒక్కరికి కోటి రూపాయలు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని టి యన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. శుక్రవారం హుజూర్ నగర్ వర్తక సంఘం భవన్ లో టిఎన్టియుసి విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రోషపతి మాట్లాడుతూ భారతదేశంలో జరుగుతున్న పరిణామాలు చర్చించడం జరిగింది కాశ్మీర్లో ఉగ్రదాడిలో 26 మంది మరణించినారు 20 మంది గాయపడ్డారు మరణించిన ప్రతి ఒక్కరికి కోటి రూపాయలు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని గాయపడిన 20 మందికి ప్రతి ఒక్కరికి పాతిక లక్షల చొప్పున ఇవ్వాలని అన్నారు. ఘటన జరిగిన తక్షణమే కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్లోని ఉగ్ర వాదుల స్థావరాలపై మన భారత్ సైన్యం దాడి గర్వించదగ్గ విషయమని కొనియాడారు. భారత్ పాకిస్తాన్ యుద్ధ సమయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంపు ప్రకటన భారతదేశ ప్రజల మనస్థాపానికి గురిచేసిందని భారతదేశంపై ట్రంపు పెత్తనం వెంటనే నిలదీశారు. రానున్న రోజుల్లో ఇలాంటి పరిణామాలు ఎటు దారి తీస్తాయో ప్రధానమంత్రి మోడీ గుర్తించాలని ట్రంపు ముగ్గులో పడవద్దని అన్నారు. దేశం కోసం ప్రాణాలు తృణపాయంగా పెట్టిన సైనికుల నుండి ఆదాయపన్ను వసూలు చేయడం సరికాదని, తక్షణమే సైనికులు పై వెస్తున్న ఆదాయం పన్ను కేంద్రం ప్రభుత్వం ఉపసంహరించాలని కోరినారు.

అలాగే చత్తీస్ గడ్ లో మావోయిస్టు అగ్రనేత కామ్రేడ్ కేశవరావు ధళపతి తోపాటు మొత్తం 27 మందిని ఎన్కౌంటర్ చేయటం రైనదికాదని చర్చలే పరిష్కారమని ఇలా మారణ హోమం చేయటం సరైనది కాదని ఉగ్రవాదులకు మనకు తేడా ఏముందని అన్నారు. కేంద్ర కార్మిక సంఘాలతో రాష్ట్ర పార్టీలు సైతం మద్దతు ఇవ్వాలని లేబర్ కోడ్ లను తక్షణమే రద్దు చేయాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని తదితర డిమాండ్స్ తో జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి ఎన్ టి యు సి నాయకులు గుండెబోయిన ఎంకన్న యాదవ్, టిడిపి మండల అధ్యక్షులు కనకరత్నం, పట్టణ అధ్యక్షులు కొమ్మ గాని వెంకటేశ్వర్లు, రామయ్య, దుర్గారావు, సైదులు, స్వరూప, సుకన్య, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కిన కానిస్టేబుల్ సంజీవ్




(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మే23: కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఓ కేసు విషయంలో బాధితుడి నుంచి డబ్బులు తీసుకుంటూ, కానిస్టేబుల్ సంజీవ్ ఏసీబీ అధికారులకు రెడ్? హ్యాండెడ్?గా పట్టుబడ్డాడు. కానిస్టేబుల్ సంజీవ్? కామారెడ్డి పట్టణ పోలీస్? స్టేషన్? నుండి కోర్టులో సీడీవోగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఓ కేసులో ఉన్న వ్యక్తి నుంచి డబ్బులు డిమాండ్? చేసినట్లు సమాచారం. లంచం ఇవ్వలేని బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. అయితే లంచం డబ్బులు డిమాండ్? చేసిన వ్యవహారంలో కానిస్టేబుల్? తో పాటు ఇంకా ఎవరెవరి పాత్ర ఉందనే విషయమై ఏసీబీ విచారణ జరుపుతోంది. ఈ క్రమంలో పలువురు పోలీసు అధికారులతో వివరాలు ఆరాతీస్తున్నట్లు సమాచారం.

# కానరాని మానవత్వం..! తలకెక్కిన మతోన్మాదం..!!



ప్రపంచ దేశాల్లో రాను రాను మానవత్వం మచ్చుకైనా కానరాకుండా పోతుంది. సాటి మనిషి ప్రాణం కంటే కంటికి కనిపించని మనుషులు సృష్టించుకున్న మతాలే మనుషుల్లో మెజార్టీ స్థానాన్ని కబ్జా చేసి తమ వశం చేసుకున్నాయి. దేశమును ప్రేమించుమన్నా...మంచి అన్నది పెంచుమన్నా...అన్న మహనీయుల మాటలు పాఠ్యపుస్తకాల్లో మాత్రమే చదువుకోవడానికి పనికొస్తున్నాయి ఆచరణలోకి వచ్చేసరికి కనిపించట్లేదు. కులం లేదు!మతం లేదు!! మనుషులంతా ఒక్కటే! జాతి సమైక్యత భావం కోసం స్వాతంత్ర సమరయోధులు చెప్పిన మాటలు ఒక్కటి కూడా ప్రస్తుతం మన దేశ ప్రజలు అదేవిధంగా మత కొట్లాటలు చేసుకుంటున్న దేశాల వారికి ఈ మాటలు ఏ మాత్రం పట్టవు అని ప్రస్తుతం ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలు అద్దం పడుతున్నాయి.ఈ మత పిచ్చి చివరికి మనిషి మరో మనిషిని చంపే లా క్రూరులుగా తయారుచేసింది. ఇంకొంతమంది సాటి మనిషిని చంపుకొని కాల్చుకొని తినే లా పిచ్చి ముదిరి మనుషులను మృగాల్లాగా మార్చింది. నాస్తీకులు హేతువాదులుగా ముద్ర వేసుకున్న వారు సైతం రాజకీయాలు వంట బట్టించుకొని మత పిచ్చోళ్ళుగా మారుతున్నారు.దీనంతటినీ గమనిస్తుంటే మత పిచ్చి ప్రపంచ దేశాల్లో ఎంతలా పెట్రేగిపోతుందో అర్థం చేసుకోవచ్చు.ఈ మత పిచ్చి ఎక్కడినుండి పుట్టుకొచ్చింది..? మనుషుల్లో నేను,నాది,నాకు,నాకోసం, ఇలాంటి స్వార్థ ఆలోచనలో నుండి పుట్టుకొచ్చింది. ఒకరిద్దరి నుండి మొదలై గుంపుగా తయారై వ్యవస్థగా మారుతుంది.కొన్ని దేశాల్లో దీనికి కాస్త రాజకీయ రంగులు పూశారు. ఉదాహరణకి గల్ఫ్ దేశాలు, ఇంకా భారత దేశం,మరికొన్ని దేశాల్లో ఆర్థిక స్థితిని పూశారు.మత పిచ్చికి కాస్త బలం చేకూరింది. అసలే కోతి కళ్ళు తాగింది నిప్పు తొక్కింది ఇంకేముంది చేతిలో ఏది ఉంటే అది ఎవరి మీద విసురుతుందో ఎవరికీ తెలియదు అన్నట్లుగా ప్రస్తుతం మత పిచ్చి పట్టిన వాళ్ళు వ్యవహరిస్తున్నారు. ఇందులో ఎక్కువగా నిరుద్యోగ యువతను సాధనంగా వాడుకుంటున్నారు.వీరికి మతం పైన రకరకాలుగా శిక్షణలు ఇచ్చి ఇతర మతాల వారిపైకి ఉసిగొల్పటం ప్రధాన లక్ష్యం గా ఓ హిప్నటిజం బాధితులు ఏ రకంగా వ్యవహరిస్తారో అంతకంటే ఎక్కువగా ఈ యువత శిక్షకుల మాటల మత్తులో పడి ఏం మాట్లాడుతున్నారో ఎలా వ్యవహరిస్తున్నారో అర్థం కాని విధంగా పిశాచుల్లా రౌడీల్లాగా గుండాల్లాగా రాక్షసుల్లాగా రాబంధువుల్ల వ్యవహరిస్తారు.ఎక్కడ మానవ బాంబులకు పెట్రోల్ బాంబులకు ఇంకా రకరకాల బాంబుల పేలుళ్లకు పాల్పడతారో తెలియని దుస్థితి.ఈ మత పిచ్చిని దేశాభిమానంగా పేరు పెట్టి చాటుగా కోట్లాది రూపాయలు దండుకునే ప్రత్యేక దారి దొరికించుకుంటారు.పైకి మతాభిమానిగా కనిపించే వీళ్లు చాటుగా చేసే పనులన్నీ దేశద్రోహపు వికారపు చేష్టలే. భగవంతుడి మీద భక్తి ఉంటుందో లేదో తెలియదు కానీ,వారి వారి రాజకీయ పార్టీల భవిష్యత్తు లబ్ధి కోసం అక్కడక్కడ వీరంగం సృష్టిస్తారు.వీరి ప్రారంభ ఒప్పందం ఏమై ఉంటుందో దానిమీద కట్టుబడి ఉండి బరితెగించే పనులు చేస్తారు. ఆయా దేశాలలో ఉన్న తక్కువ జాతి ఆర్థికంగా చితికిపోయిన మహిళల మానప్రాణాలను దోచుకుంటూ రాజకీయ అంగ బలం వాడుకుంటూ అడ్డు అదుపు లేకుండా చలామణి అవుతుంటారు.రాజకీయ పార్టీలను అడ్డం పెట్టుకొని అక్రమంగా సంపాదించిన సొమ్ములకు పన్నులు కట్టకుండా ఎగనామం పెడతారు.వీలైతే విదేశాలకు పరార్ అవుతారు. ప్రపంచంలో చాలా దేశాలు పేదరికంలో మగ్గుతున్నాయి.అదే దేశంలో కోట్లాది రూపాయలు మతం పేరు మీద రకరకాల నిర్మాణాలు వెలుస్తుంటాయి. సాటి మనిషి ఆకలి తీర్చలేని అడ్డం పెట్టుకొని అక్రమ సంపాదన పొందుతున్న శ్రీమంతులు మతాల ఆనవాలమైన నిర్మాణాల గోడల పైన అమర్చుతున్న శిలాఫలకాల లో తమ పేరును చూసి పైశాచిక ఆనందం పొందుతుంటారు. మతపిచ్చిలో ఇదో భాగం అనుకోవచ్చు.సాధారణంగా మత గొడవలు జరిగినప్పుడు అవి దేనికి జరుగుతున్నాయి..? కారణాలు మనం చూస్తే వివిధ మతాల భిన్నమైన ఆచారాలు, నమ్మకాలపైన తక్కువ చూపు చూడటం లాంటివి పలు రకాల ఘర్షణలకు తావిస్తూ రాజకీయాల చుట్టూ తిరుగుతుంటాయి.ఇవే చిలికి చిలికి గాలి వానగా మారి హింసకు దారి తీస్తాయి. ఇజ్రాయేల్ పాలస్తీనా వివాదం భూముల గురించి మతపరమైన స్థలాల గురించి క్రైస్తవులు యూధులు ముస్లిం మతాల నమ్మకాల ఆచరణల స్థితిగతుల కొట్లాటలు జరిగాయి.ఇంకా కొన్ని దేశాలలో వివిధ ప్రాంతాలలో ఆయా మతాల లో మతాల పెత్తందారీ వ్యవస్థ పైన జరుగుతున్న సంఘటనలు అనుకోవచ్చు.ఏది ఏమైనా ప్రపంచ దేశాల్లో మానవత్వం కొరవడింది.మతతత్వం పెట్రేగింది.మతతత్వ సంస్థలను పెంచి పోషిస్తున్నది రాజకీయాలే ప్రజల సంస్కృతి సాంప్రదాయాలను ఇష్టా ఇష్టాలను పక్కనపెట్టి తమ ఇష్టాలను నెరవేర్చుకునే రాజకీయ శాడిస్టులు సమాజాన్ని సంఘాన్ని పరిపాలిస్తున్నంతకాలం ఈ ఉదంతం కొనసాగుతూనే ఉ ంటుంది.అమాయకుల ప్రాణాలు రక్త మాంసాలతో రాజకీయాలు చేస్తున్న మృగ సమానులు కళ్ళు తెరిచే అంతవరకు వారిలో మానవత్వం మొలకెత్తి చిగురించి వృక్షంగా మారే దాకా ప్రపంచ దేశాల్లో ఈ నర మేదం దావానంలా ద హించుకొని పోతూనే ఉ ంటుంది. ఈ చర్యలు ఇకనైనా ఆగిపోవాలని ప్రపంచ దేశాల్లో శాంతి అలుముకొని అల్లర్లు లేని ఆనంద ప్రపంచాన్ని అన్ని దేశాలు చూడాలని కోరుకుందాం.

కందుకూరి యాదగిరి
సీనియర్ పాత్రికేయులు
సూర్యాపేట. 9640282050

# యూటీ పనులను పరిశీలించిన మంత్రి పొంగులేటి



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మే 23: పాలేరు సాగర్ కాలువ వద్ద జరుగుతున్న యూటీ పనులను తెలంగాణ రెవెన్యూ,గృహనిర్మాణ,సమాచార శాఖల పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరిశీలించారు. మంత్రి గత సెప్టెంబర్ 1న వచ్చిన అకాల వరదలకు పాలేరు లో సాగర్ కాలువకు గండ్లు పడటంతో యూటీ పూర్తిగా కూలిపోయింది.

కాగా మంత్రి పొంగులేటి ఆదేశాల మేరకు అధికారులు పనులు వేగవంతం చేశారు. ఈ సందర్భంగా ఆకస్మాత్తుగా పనుల పరిశీలనకు వచ్చారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి పనులు జరుగుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. పూర్తి వర్షాకాలం వచ్చేసరికి మొత్తం పనులు పూర్తి చేయాలని వచ్చే 15 నుండి 20 రోజుల్లో 24 గంటలు రెండు షిఫ్టు పని జరిగేలా చూడాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.అనంతరం పాలేరులో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు.

# గ్రామ పాలన అధికారుల ఎంపిక పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్




(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మే23: ఈ నెల 25 న జరుగనున్న గ్రామ పాలన ఎంపిక పరీక్ష ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామ పాలన అధికారుల ఎంపిక పరీక్ష నిర్వహణకు ఇన్విజిలేటర్స్ లకు, పలువురు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 25 న ఆదివారం రోజున కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో (అటానమస్) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష ఉదయం గం.10.30 నుండి మధ్యాహ్నం గం.1.30 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాలో 402 మంది పరీక్ష రాస్తున్నట్లు, గతంలో వి.ఆర్.ఒ , వి.ఆర్. ఏ. లుగా పనిచేసిన వారు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో పాటు ఫోటోతో కలిగిన గుర్తింపు కార్డ్ వెంట తీసుకురావాలని తెలిపారు. ఈ పరీక్ష నిర్వహణకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలో శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. పరీక్ష జరుగు సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలో ఏఎన్ఎం లను అవసరమైన మందులతో సహ డిప్యూట్ చేయాలని తెలిపారు. పరీక్ష హాలులోకి వెళ్ళే సమయంలో అభ్యర్థులను నిశిత పరిశీలన చేయడం జరుగుతుందని, అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు, గాడ్జెస్ అనుమతించబోమని తెలిపారు. ఉదయం గం. 9.30 లకు అభ్యర్థులను పరీక్ష హాలులోకి అనుమతించడం జరుగుతుందని, 10 గంటలకు మెయిన్ గేటు మూసి వేయడం జరుగుతుందని తెలిపారు. 10.25 లకు ప్రశ్న పత్రాలు అభ్యర్థులకు పంపిణీ చేయడం, గం. 10.30 లకు పరీక్ష ప్రారంభం అవుతుందని తెలిపారు. మధ్యాహ్నం గం.1.25 లకు హెచ్చరిక గంట మోగించబడుతుందని, చివరగా గం.1.30 లకు పరీక్ష నిర్వహణ పూర్తయి జవాబు పత్రాలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు సమయ పాలన పాటించాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ వి. విక్టర్ మాట్లాడుతూ, అభ్యర్థులు సమయానుకూలంగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, మాస్ కాపీయింగ్ కు పాల్పడకూడదని తెలిపారు. ఇన్విజిలేటర్లు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఆర్డీఓ వీణ, చీఫ్ సూపరింటెండెంట్ విశ్వ ప్రసాద్, పరిశీలకులు శంకర్, జిల్లా విద్య శాఖాధికారి రాజు, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే పి.డి యాక్ట్ తప్పదు:సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ

## -విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి.

## -గుర్తింపు పొందిన కంపెనీ ప్యాకింగ్, లేబుల్ తనిఖీ చేసుకోవాలి.

## -విడి విత్తనాలతో అధిక ప్రమాదం.



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) మే 23:నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోవద్దని వ్యవసాయ పనులు ప్రారంభించడానికి రైతులు సిద్ధమౌతున్నారని, అధికారులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని నకిలీ విత్తనాలు గుర్తించి సీజ్ చేయాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ అధికారులను ఆదేశించారు. విత్తనాల వల్ల సూర్యాపేట జిల్లాలో ఒక్క రైతు కూడా నష్టపోవద్దు అని సంబంధిత శాఖ అధికారులు అందరూ సమన్వయంగా పని చేసి రైతులకు నకిలీ వితనాలు సరఫరా జరగకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నకిలీ విత్తనాల నిర్మూలనకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగినదని ఆరుగాలం కష్టపడే రైతు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత కూడా విత్తన సంస్థలు, డీలర్లు, వ్యాపారాల పై ఉన్నదని విత్తన వ్యాపార డీలర్లు బాధ్యతగా మంచి నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని ఎస్పీ కోరారు. రైతులకు, వ్యవసాయానికి నష్టం కలిగేలా నకిలీ విత్తనాలు అమ్మితే అలాంటి వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని పి డి యాక్ట్ తప్పదు, షీట్స్ నమోదు చేస్తామని హెచ్చరించారు. సూర్యాపేట జిల్లా ఆంధ్రా ప్రాంతానికి ముఖ్య సరిహద్దుగా ఉన్నది ఇక్కడ నకిలీ విత్తనాలు ఎక్కువగా సరఫరా అయ్యే అవకాశం ఉన్నది, ముందస్తు తనిఖీలు, రైతులకు అవగాహన కల్పించడం, డీలర్స్ కు అవగాహన కల్పించడం, సరిహద్దు లలో పటిష్టమైన నిఘా తో నకిలీ విత్తనాలు నివారించాలి అని ఎస్పీ గారు అన్నారు. రైతులతో సమావేశాలు నిర్వహించి చైతన్య పరచాలి, గతంలో నకిలీ విత్తనాల కేసుల్లో సంబంధం ఉన్నవారి పై నిఘా ఉంచాలని ఆదేశించారు. రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. నాణ్యమైన కంపెనీ విత్తనాలు ఎంచుకోవాలి, లేబుళ్లు, ప్యాకింగ్ లేని విత్తనాలు కొనుగోలు చేయవద్దు అని కోరారు. తక్కువ ధరకు వస్తున్నాయని గ్రామాల్లోకి వచ్చే మధ్యవర్తుల వద్ద విడి విత్తనాలు కొనుగోలు చేయవద్దు. ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్స్ నుండి విత్తనాలు కొనుగోలు చేస్తే మంచిది అన్నారు. ఇతర రాష్ట్రాల నుండి, జిల్లాల లనుండి ఎక్కువ మొత్తంలో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని కోరారు. నకిలీ విత్తనాల గురించి, అనుమానిత బ్రోకర్లు, డీలర్ల గురించి పోలీసు వారికి, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ కోరారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించాలి : అదనపు కలెక్టర్ (రెవిన్యూ)



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మే23: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) అన్నారు. శుక్రవారం సదాశివనగర్ మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి, కుప్రియల్, కామారెడ్డి మండలంలోని సారంపల్లి గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభం కానున్న దృశ్య, అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోతున్నదని, వరి పంట తడిసిపోకుండా ముందస్తుగా తూకం వేసి సంబంధిత మిల్లులకు తరలించాలని కేంద్రం ఇంచార్జీలను ఆదేశించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్ లను వరి పంటపై కప్పివేయాలని తెలిపారు. ఆయన వెంట సంబంధిత తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు, కేంద్రాల ఇంచార్జ్ లు ఉన్నారు.

# చెక్ పోస్ట్ లను తనిఖీ చేసిన అడిషనల్ డీసీపీ లా%డ%ఆర్డర్

## -పశువుల రవాణా విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మే 23:పశువుల అక్రమ రవాణా నియంత్రణకు జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను అడిషనల్ డీసీపీ లా%డ%ఆర్డర్ ప్రసాదరావు ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు.పశువుల అక్రమ రవాణా నియంత్రణలో భాగంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు వైరా మండలం పాలడుగులో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను శుక్రవారం సందర్శించిన అడిషనల్ డీసీపీ పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ... అక్రమ రవాణా నియంత్రించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో 24%x%7 నిరంతర పర్యవేక్షణ వుండాలని అన్నారు. పశువులను రవాణాచేసే ప్రతి వాహనానికి తగు నిర్ధారిత ప్రమాణిక పత్రాలు (వాలిడ్ డాక్యుమెంట్స్) నియమ, నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. సరైన పత్రాలు వారి వెంట ఉన్నాయనే విషయాన్ని పరిశీలించి అనుమతించాలని, అక్రమ రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పశువుల అక్రమ రవాణాను పోలీసులు మినహా ఏ సంస్థలు/ కార్యకర్తలు వాహనాలను స్వయంగా ఆపకూడదని, నిబంధనలు విరుద్ధంగా అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. చట్టాన్ని ఏవరు కూడా తమ చేతుల్లోకి తీసుకొని శాంతిభద్రతలకు విఘాతం కల్పించే పరిస్థితులు తీసుకొనిరావద్దని అన్నారు. ఏదైనా సమస్య వుంటే పరిష్కారానికి పోలీస్ అధికారులు నిరంతరం అందుబాటులో వుంటారని అన్నారు. ఎవరైనా చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు.సరిహద్దు చెక్ పోస్టుల తనిఖీలే కాకుండా జిల్లా కేంద్రంలో సైతం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని అన్నారు. ఎవరైనా అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే వారి వాహనాలు సీజ్ చేస్తారని అన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కారించుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా,మత సామరస్యంతో జరుపుకునేలా అవసరమైన చోట్ల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# మేళ్లచెరువు తహశీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన రాజేందర్ రెడ్డి



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) మే 23:హుజూర్ నగర్ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గా పనిచేస్తున్న నూకల రాజేందర్ రెడ్డి ని తహశీల్దార్ మేళ్లచెరువు బదిలీ చేయడంతో శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

గతంలో మేళ్లచెరువు తహశీల్దార్ గా పనిచేసిన జ్యోతి యాదాద్రి భువనగిరి జిల్లా కు కేటాయించగా మోత్కూర్ మండల తహశీల్దార్ గా కొనసాగుతున్నారు.

# వివాదంలో పంజాబ్ జట్టు..
# కోర్టుకెక్కిన ప్రీతి జింటా



పంజాబ్ కింగ్స్ ( జట్టులో వివాదం చెలరేగింది. ఆ జట్టు సహ యజమాని, బాలీవుడ్ నటి ప్రీతి జింటా కోర్టుకెక్కింది. జట్టు సహ డైరెక్టర్లు అయిన మోహిత్ బుర్మాన్, నెస్ వాడియాపై చండీగఢ్ కోర్టులో కేసు వేసింది. నిబంధనలకు విరుద్ధంగా వీరు సమావేశం నిర్వహించారంటూ పిటిషన్ వేసింది.

వీరు ముగ్గురు కేపీహెచ్ డ్రీమ్ క్రికెట్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లుగా ఉన్నారు. ఐపీఎల్ లోని పంజాబ్ కింగ్స్ జట్టు ఈ కంపెనీదే. గత నెల 21న నిర్వహించిన సర్వసభ్య సమావేశం(చట్టబద్ధతను ప్రీతి జింటా కోర్టులో సవాలు చేసింది. కంపెనీ చట్టం 2013 ప్రకారం ఎలాంటి నిబంధనలు పాటించకుండానే ఈ సమావేశాన్ని నిర్వహించారని తన పిటిషన్‌లో పేర్కొంది. ఈ భేటీకి సంబంధించి అభ్యంతరాలను తాను ఏప్రిల్ 10నే ఈమెయిల్ రూపంలో తెలియజేసినప్పటికీ పట్టించుకోలేదని ఆమె పేర్కొంది. నెస్ వాడియా మద్దతుతో మోహిత్ బర్మాన్ ఈ సమావేశాన్ని నిర్వహించారని ఆరోపించింది.

తాను, మరో డైరెక్టర్ కరణ్ పాల్ ఈ సమావేశానికి హాజరైనప్పటికీ.. ఈ సమావేశం చట్టబద్ధత చెల్లదని ప్రకటించాలని ప్రీతి జింటా కోర్టును కోరింది. ఈ సమావేశంలో మునీశ్ ఖన్నాను డైరెక్టర్‌గా నియమించడాన్ని ప్రీతి జింటా, పాల్ వ్యతిరేకించారు. డైరెక్టర్‌గా ఖన్నా నియామకాన్ని నిలిపివేయాలని ఆమె తన పిటిషన్‌లో కోర్టును కోరింది. ఈ భేటీలో తీసుకున్న నిర్ణయాలను కంపెనీ అమలుచేయకుండా చూడాలని అభ్యర్థించింది. ఈ కేసు పరిష్కారం అయ్యేవరకూ.. తాను, కరణ్‌పాల్ లేకుండా బోర్డు సమావేశాలు నిర్వహించకుండా చూడాలని ప్రీతి జింటా కోర్టును కోరారు.

బోర్డులో వివాదాలు ఉన్నప్పటికీ.. ప్రీతి జింటా పంజాబ్ కింగ్స్ మ్యాచ్‌లకు హాజరై స్టేడియంలో జట్టుకు మద్దతుగా నిలిచింది. ఆటగాళ్లను ప్రోత్సహించింది. ఇక శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలో పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో అద్భుతంగా రాణిస్తున్న విషయం తెలిసిందే. 11 ఏళ్ల అనంతరం ఆ జట్టు ప్లేఆఫ్స్‌కు చేరింది. టాప్ 2లో స్థానం లక్ష్యంగా ముందుకుసాగుతోంది.

# కరచాలనం సమయంలో పంత్‌ను
# గిల్ పట్టించుకోలేదా..?

: ఈ ఐపీఎల్ సీజన్‌లో ప్లేఆఫ్స్ నుంచి నిష్క్రమించిన లఖ్‌నవూ ( జట్టు.. పాయింట్ల పట్టికలో టాప్‌లో ఉన్న గుజరాత్ ) కు షాకిచ్చింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టును 33 పరుగుల తేడాతో ఓడించింది. అయితే.. మ్యాచ్ ముగిసిన తర్వాత జరిగిన ఓ పరిణామంపై ఇప్పుడు క్రికెట్ అభిమానులు చర్చించుకుంటున్నారు. ఆటగాళ్ల కరచాలనం సమయంలో గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రవర్తనపై పలువురు కామెంట్లు చేస్తున్నారు.




గుజరాత్ ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే పాయింట్ల పట్టికలో టాప్2 లో కొనసాగే అవకాశాలు మరింత మెరుగయ్యేవి. అయితే.. ఈ ఓటమి అనంతరం.. ఇరు జట్ల ఆటగాళ్ల కరచాలనం సమయంలో గిల్ నిరాశగా కనిపించినట్లు వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. గిల్‌కు లఖ్‌నవూ కెప్టెన్ రిషభ్ పంత షేక్‌హ్యాండ్ ఇచ్చి.. ఏదో మాట్లాడేందుకు ప్రయత్నించినా పట్టించుకోకుండా ముందుకుసాగాడు. దీంతో గిల్‌పై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

పంత్‌ను గిల్ పట్టించుకోకుండా ముందుకుసాగాడని.. ఓటమితో నిరాశలోనే ఇలా చేశాడని పలువురు కామెంట్లు చేస్తున్నారు. ఇక ఈ ఇద్దరూ టీమ్‌ఇండియా జట్టులో కీలక ఆటగాళ్లు అన్న విషయం తెలిసిందే. రోహిత్ శర్మ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడంతో.. ఇంగ్లండ్‌తో జరిగే ఐదు టెస్టుల సిరీస్‌కు గిల్‌కు సారథ్య బాధ్యతలు అప్పగిస్తారని.. వైస్ కెప్టెన్‌గా పంత్ ఉంటాడని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య ఇలాంటి పరిణామం చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

మరోవైపు ఈ ఓటమిపై గిల్ స్పందిస్తూ.. తమ బౌలర్లు లఖ్‌నవూకు 20–30 పరుగులు అదనంగా ఇచ్చారని.. అదే ఓటమికి దారితీసిందని వ్యాఖ్యానించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ప్రత్యర్థిని 210 పరుగులకే ఆపి ఉండాల్సిందని పేర్కొన్నాడు. ఇక ఈ విజయంపై పంత్ సంతోషం వ్యక్తంచేశాడు. జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నాడు. వరుసగా నాలుగు ఓటముల అనంతరం లఖ్‌నవూకు దక్కిన విజయమిది.

# నీరజ్‌పైనే దృష్టి

హోజో (పోలెండ్): చాన్నాళ్లుగా ఊరిస్తున్న 90 మీటర్ల మైలురాయిని ఎట్టకేలకు దోహా డైమండ్ లీగ్‌లో చేరుకున్న భారత జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా మరో పోరుకు సిద్ధమయ్యాడు. శుక్రవారం జరిగే ఓర్లెన్ అథ్లెటిక్స్ మీట్‌లో అతడు పోటీపడనున్నాడు. దోహాలో జావెలిన్‌ను 90.23 మీటర్లు వేసినా.. నీరజ్‌కు అగ్రస్థానం దక్కలేదు. జర్మనీ ఆటగాడు జులియన్ వెబర్ (91.06 మీ).. అతడిపై పైచేయి సాధించాడు. ఓర్లెన్ మీట్‌లో మరోసారి వెబర్‌తోనే నీరజ్‌కు సవాల్ ఎదురు కానుంది. రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), పోలెండ్ జాతీయ ఛాంపియన్ మారిన్ కుకోస్కీ (పోలెండ్) కూడా గట్టిపోటీదారులే.



దోహాకు మించిన ప్రదర్శన చేయగలనని ఇటీవలే చోప్రా చెప్పిన నేపథ్యంలో ఓర్లెన్‌లో అతడెలా రాణిస్తాడో చూడాలి.



# టాప్ 2 రేసు రసవత్తరం.. ఆ
# టీమ్స్‌కు ఎలిమినేటైన జట్లు షాకిస్తే?

: ఐపీఎల్ (%శ్రూ%)లో ప్లేఆఫ్స్ రేసు ముగిసింది. ఇక మిగిలింది టాప్ 2 కోసం పోరు మాత్రమే. ప్లేఆఫ్స్ చేరిన గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, ముంబయి ఇండియన్స్ జట్లు.. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచేందుకు తీవ్రంగా పోటీపడుతున్నాయి. ఎందుకంటే ఇక్కడికి చేరిన జట్లకు క్వాలిఫయర్‌లో ఓడినా.. మరో అవకాశం ఉంటుంది. మరోవైపు టేబుల్‌లో అట్టడుగున ఉన్న జట్లు.. టాప్ 2 రేసుపై ప్రభావం చూపించే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. దీంతో ఈ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి.

గుజరాత్ కు ఇలా..

పాయింట్ల పట్టికలో టాప్‌లో కొనసాగుతున్న గుజరాత్‌కు.. ప్లేఆఫ్స్ నుంచి ఎలిమినేట్ అయిన లఖ్‌నవూ గత మ్యాచ్‌లో షాకిచ్చింది. దీంతో ఆ జట్టు టాప్ 2 అవకాశాలు క్లిష్టంగా మారాయి.

గుజరాత్ మరో మ్యాచ్ మాత్రమే ఆడాల్సి ఉంది. అందులో గెలిచినా ఆ జట్టు ఖాతాలో చేరేవి 20 పాయింట్లు.

అప్పుడు గుజరాత్ టాప్ 2 భవితవ్యాన్ని ఆర్సీబీ, పంజాబ్ తేల్చనున్నాయి.

ఒకవేళ అట్టడుగున ఉన్న చెన్నై.. చివరి మ్యాచ్‌లో గుజరాత్‌కు షాకిస్తే శుభ్‌మన్ గిల్ సేన మూడో స్థానానికి పడిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదు.

ఆర్సీబీ భవితవ్యం ఇలా..

17 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్న బెంగళూరు.. తదుపరి మ్యాచ్‌లు సన్‌రైజర్స్, లఖ్‌నవూతో ఆడనుంది.

ఈ రెండు మ్యాచ్‌లు గెలిస్తే.. టాప్ 1లోకి వచ్చే అవకాశం ఉంది.

ఒకవేళ సన్‌రైజర్స్, లఖ్‌నవూ షాకిస్తే మాత్రం.. ఆర్సీబీ టాప్ 2 అవకాశాలు గల్లంతే.

సన్‌రైజర్స్ ఇప్పటికే లఖ్‌నవూను ప్లేఆప్సనకు దూరం చేసింది. ఇక గురువారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్‌కు లఖ్‌నవూ షాకిచ్చింది. ఈ నేపథ్యంలో ఏం జరుగుతుందో చూడాలి.

పంజాబ్ (%ూబఅయిఖఎ ఖఱఅస్త్రం%) కింగ్స్ దూసుకెళ్తుందా..?

11 ఏళ్ల తర్వాత శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో ప్లేఆఫ్స్‌కు చేరిన జట్టు పంజాబ్.. 17 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది.

దిల్లీ, ముంబయితో తదుపరి మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ రెండింటిలో గెలిస్తే.. 21 పాయింట్లతో టాప్ 2లోకి వెళ్లే అవకాశం ఉంది.

ఒక్కటి ఓడినా.. పైనున్న జట్ల ఫలితాలపై దీని టాప్ 2 భవితవ్యం ఆధారపడి ఉంది.

ముంబయికి కష్టమే..

ముంబయి ఆడాల్సింది ఒక మ్యాచ్ మాత్రమే.. అదీనూ టాప్ 3లో ఉన్న పంజాబ్‌తో.

పంజాబ్‌పై ఓడితే పాండ్య సేన నాలుగో స్థానంలోనే ఉంటుంది.

పంజాబ్‌పై గెలిచినా.. ముంబయి ఖాతాలో చేరేవి 18 పాయింట్లు. అప్పుడు టాప్ 2లోకి చేరాలంటే.. మిగతా మూడు జట్లు రాబోయే అన్ని మ్యాచ్‌లు ఓడిపోవాలి.

ఇక ఇప్పటికే ఎలిమినేటై పరువు కోసం చెన్నై, హైదరాబాద్, లఖ్‌నవూ, దిల్లీ ఆడుతున్నాయి. ఆఖరి మ్యాచ్‌ల్లో ఆ జట్లు విజృంభిస్తే.. ప్లేఆఫ్స్‌కు చేరిన జట్లకు కష్టాలు తప్పవు. దీంతో ప్రతి మ్యాచ్ ఫలితం. నెట్ రన్‌రేట్ టాప్ 4 జట్లకు కీలకంగా మారనుంది.

# గుజరాత్‌కు పంచ్

అహ్మదాబాద్ ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన సన్‌రైజర్స్ హైదరాబాద్, గత మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్‌ను ఇంటిముఖం పట్టిస్తే.. ఇప్పుడు గుజరాత్ టైటాన్స్‌కు లఖ్‌నవూ చెక్ పెట్టింది. మరో విజయంతో పట్టికలో అగ్రస్థానాన్ని పదిలం చేసుకోవాలని చూసిన టైటాన్స్‌కు ఎల్‌ఎస్‌జీ షాకిచ్చింది. మిచెల్ మార్ష్ విధ్వంసక శతకానికి మిగతా బ్యాటర్ల మెరుపులూ తోడవడంతో లఖ్‌నవూ ఏకంగా 235 పరుగులు చేసింది. ఛేదనలో టైటాన్స్ కొంత పోరాడినా ఓటమి తప్పలేదు.




ఐపీఎల్–18 ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించాక లఖ్‌నవూ జూలు విదిల్చింది. టేబుల్ టాపర్ గుజరాత్ టైటాన్స్‌ను గురువారం ఆ జట్టు 33 పరుగుల తేడాతో మట్టికరిపించింది. మొదట మిచెల్ మార్ష్ (117బీ 64 బంతుల్లో 10ఐ4, 8ఐ6) మెరుపు శతకం సాధించడంతో ఎల్‌ఎస్‌జీ 2 వికెట్లకు 235 పరుగుల భారీ స్కోరు సాధించింది. నికోలస్ పూరన్ (56 నాటౌట్‌బీ 27 బంతుల్లో 4ఐ4, 5ఐ6), మార్‌క్రమ్ (36బీ 24 బంతుల్లో 3ఐ4, 2ఐ6) కూడా రాణించారు. అనంతరం ఛేదనలో గుజరాత్ 9 వికెట్లకు 202 పరుగులే చేయగలిగింది. షారుఖ్ ఖాన్ (57బీ 29 బంతుల్లో 5ఐ4, 3ఐ6) టాప్‌స్కోరర్. ఎల్‌ఎస్‌జీ బౌలర్లలో ఒరూర్క్ (3/27), ఆయుష్ బదోని (2/4) రాణించారు. 13 మ్యాచ్‌ల్లో గుజరాత్‌కిది 4వ ఓటమి కాగా.. అన్నే మ్యాచ్‌లు ఆడిన లఖ్‌నవూ ఆరో విజయం నమోదు చేసింది.

బాదుడు.. సరిపోలేదు: ఛేదనలో గుజరాత్ కూడా ధాటిగానే ఆడింది. టాప్–5 బ్యాటర్లలో అందరూ చెప్పుకోదగ్గ స్కోర్లే సాధించారు. కానీ షారుఖ్ ఖాన్ మినహా ఎవ్వరూ అర్ధశతకం సాధించలేకపోయారు. లక్ష్యం మరీ పెద్దది కావడంతో టైటాన్స్‌కు ఓటమి తప్పలేదు. ఈ సీజన్లో నిలకడకు మారుపేరుగా నిలిచిన సాయి సుదర్శన్ (21) ఇన్నింగ్స్‌ను మెరుగ్గానే ఆరంభించినా ఎక్కువసేపు నిలవలేకపోయాడు. అయితే శుభ్‌మన్ (35బీ 20 బంతుల్లో 7ఐ4), బట్లర్ (33బీ 18 బంతుల్లో 3ఐ4, 2ఐ6) ధాటిగా ఆడి జట్టును రేసులో నిలిపారు. 7 ఓవర్లకు ఆ జట్టు 76/1తో మెరుగ్గా కనిపించింది. శుభ్‌మన్, బట్లర్ తక్కువ వ్యవధిలో వెనుదిరగడంతో టైటాన్స్ కష్టాల్లో పడింది. ఆ జట్టుకు పెద్ద ఓటమి తప్పదనుకుంటే.. రూథర్‌ఫర్డ్, షారుఖ్ ఖాన్ జోడీ చూస్తుండగానే పరిస్థితి మార్చేసింది. ఇద్దరూ పోటీపడి భారీ షాట్లు ఆడడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. 14–16 మధ్య 3 ఓవర్లలోనే 53 పరుగులు రావడంతో సమీకరణం 4 ఓవర్లలో 54గా మారింది. రూథర్‌ఫర్డ్, షారుఖ్ ఉన్న ఊపులో టైటాన్స్‌ను గెలిపించేలానే కనిపించారు. కానీ తర్వాతి ఓవర్లో ఒరూర్క్.. రూథర్‌ఫర్డ్ (33బీ 22 బంతుల్లో 1ఐ4, 3ఐ6), తెవాతియా (2)లను ఔట్ చేసి టైటాన్స్ ఆశలపై నీళ్లు చల్లాడు. షారుఖ్ కూడా తర్వాత ఎంతోసేపు నిలవలేదు. చివరి 4 ఓవర్లలో మొత్తం 6 వికెట్లు కోల్పోయిన గుజరాత్ 20 పరుగులే చేయగలిగింది. పార్ట్‌టైమ్ స్పిన్నర్ బదోని చివరి ఓవర్లో 4 పరుగులే ఇచ్చి రబాడ (2), సాయికిశోర్ (1)లను బౌల్డ్ చేశాడు.

మార్ష్ ధ్వంసరచన: గత మ్యాచ్‌తో ప్లేఆఫ్స్ రేసుకు దూరమైన లఖ్‌నవూ.. ఈ మ్యాచ్‌లో గుజరాత్‌పై చెలరేగిపోయింది. లీగ్‌లో అత్యుత్తమ బౌలింగ్ దళాల్లో ఒకటైన టైటాన్స్ బృందాన్ని ఎల్‌ఎస్‌జీ బ్యాటర్లు మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్, మార్‌క్రమ్ ఉతికారేశారు. కేవలం ఈ ముగ్గురే జట్టు స్కోరును 200 దాటించేశారు. సూపర్ ఫామ్‌లో ఉన్న మార్ష్, మార్‌క్రమ్.. ఆరంభం నుంచే ధాటిగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. గుజరాత్ బౌలర్లలో సిరాజ్ ఒక్కడే కొంచెం మెరుగ్గా (ఎకానమీ 9.25) బౌలింగ్ చేశాడు. మిగతా బౌలర్లంతా ఓవర్‌కు 11 పరుగులకు తక్కువ కాకుండా సమర్పించుకున్నారు. ఆలస్యంగా, 12వ ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన స్పిన్నర్ రషీద్ ఖాన్ బౌలింగ్‌లో మార్ష్ వరుసగా 6, 4, 6, 4, 4 బాదడం విశేషం. ఈ సీజనంతా ఎంతో నిలకడగా వికెట్లు తీస్తూ, పొదుపుగా బౌలింగ్ చేస్తున్న ప్రసిద్ధ్ కృష్ణ సైతం ఎల్‌ఎస్‌జీ బ్యాటర్ల ధాటికి వికెట్ లేకుండా 44 ఇచ్చుకున్నాడు. మార్ష్, మార్‌క్రమ్ పోటాపోటీగా షాట్లు ఆడడంతో లఖ్‌నవూ వికెట్ కోల్పోకుండా 9 ఓవర్లకే 83 పరుగులు చేసింది. తర్వాతి ఓవర్లో మార్‌క్రమ్‌ను సాయికిశోర్ ఔట్ చేసినా.. టైటాన్స్‌కు ఉపశమనం లేకపోయింది. ఎదుర్కొన్న తొలి బంతికే సిక్సర్ బాదిన పూరన్.. మార్‌క్రమ్‌ను మించి రెచ్చిపోయాడు.

# జొమాటోలో మరో బాదుడు..
# దూరాన్ని బట్టి ఇక డెలివరీ ఛార్జీ




ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో యూజర్లకు మరో షాకిచ్చింది. నష్టాల్ని తగ్గించుకొనే ప్రయత్నంలో భాగంగా కొత్త ఛార్జీల బాదుడు మొదలు పెట్టింది. దూరానికి అనుగుణంగా 'లాంగ్ డిస్టెన్స్ సర్వీస్ ఫీజు'ను ప్రారంభించింది. అంటే ఇకపై దూరంగా ఉన్న హోటల్/రెస్టరంట్ నుంచి ఫుడ్ ఆర్డర్ చేస్తే ఆ మేరకు ఛార్జీలు ఉంటాయన్నమాట.

4 కిలోమీటర్ల వెలుపల ఉన్న రెస్టరంట్ల నుంచి పెట్టే ఆర్డర్లకు జొమాటో 'లాంగ్ డిస్టెన్స్ సర్వీస్ ఫీజు' వర్తిస్తుంది. రెస్టరంట్, డెలివరీ అడ్రస్ మధ్య దూరం 4 నుంచి 6 కిలోమీటర్ల మధ్య ఉంటూ ఆర్డర్ విలువ రూ.150 దాటితే కస్టమర్లకు రూ.15 వసూలు చేయనున్నారు. అదే 6 కిలోమీటర్ల పరిధి దాటితే ఆర్డర్ విలువతో సంబంధం లేకుండా నగరాన్ని బట్టి సర్వీస్ ఛార్జి రూ.25 నుంచి రూ.35 వరకు ఉంటుంది.

కొవిడ్ విజృంభనకు ముందు జొమాటో 4 నుంచి 5 కిలోమీటర్ల పరిధి వరకు ఉన్న దూరానికి ఎలాంటి ఛార్జీలు విధించేది కాదు. మహమ్మారి తర్వాత అనేక రెస్టరంట్లు తాత్కాలికంగా మూతపడిన సమయంలో ఆ డెలివరీ పరిధిని 15 కిలోమీటర్ల వరకు పెంచింది. తర్వాత క్రమంగా తగ్గించుకుంటూ వచ్చింది. డెలివరీ ఫీజును మొదలుపెట్టింది. ఇప్పుడు దూరాన్ని బట్టి ఫీజు వసూలుచేయాలని నిర్ణయించింది. అయితే, డిస్టెన్స్ ఛార్జీ, సర్వీసు ఛార్జీ ఆర్డర్ విలువకు 30 శాతం మించకుండా చూసుకోవాలని రెస్టరంట్ పార్టనర్లకు జొమాటో సూచించింది.

మరోవైపు జొమాటో తన క్విక్ కామర్స్ విభాగమైన బ్లింకిట్‌పై పెద్దఎత్తున ఖర్చు చేస్తోంది. దీంతో నష్టాలను మూటగట్టుకుంటోంది. ఈ క్రమంలోనే నష్టాలను తగ్గించుకొనే ప్రయత్నంలో భాగంగా పలు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్లాట్‌ఫామ్ ఫీజును వసూలుచేస్తున్న ఈ కంపెనీ తాజాగా.. జొమాటో గోల్డ్ చందాదారులకు రెయిన్ సర్‌ఛార్జీ మినహాయింపును తొలగించింది. ఈ వార్తల నేపథ్యంలో నేడు ట్రేడింగ్ సెషన్‌లో జొమాటో షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. 12:40 గంటల సమయంలో ఎటర్నల్ (జొమాటో) షేర్లు ఎన్ఎస్ఈలో 4.20 శాతం లాభంతో రూ.237.55 వద్ద కొనసాగుతున్నాయి.

# ఏఐ వ్యవస్థలు రూపొందించి.. వాటివల్లే
# ఉద్యోగాలు కోల్పోయిన మైక్రోసాఫ్ట్ సిబ్బంది




ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ ( తన సిబ్బందిలో మూడు శాతం మందికి ఇటీవల ఉద్వాసన పలికింది. దాంతో ప్రపంచవ్యాప్తంగా సుమారు 6వేల మంది ఉద్యోగులపై ప్రభావం పడింది. సంస్థ కార్యకలాపాల్లో కృత్రిమమేధ వినియోగాన్ని పెంచే దిశగా తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఈ లేఆఫ్‌లు చోటుచేసుకున్నాయి. అయితే, ఇందులో ఏఐ వ్యవస్థలు రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఎక్కువగా ఎఫెక్ట్ అయ్యారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి (

వాషింగ్టన్ ఆఫీసులో తొలగించిన 40శాతం ఉద్యోగుల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే ఎక్కువగా ఉన్నారు. ఏఐ సాధనాల వినియోగాన్ని, వాటిపై ఆధారపడటాన్ని పెంచాలని వారికి సంస్థ యాజమాన్యం కొన్ని నెలల క్రితం సూచించినట్లు తెలుస్తోంది. దాంతో వారు పలు ఏఐ వ్యవస్థలను రూపొందించారు. ఆ వ్యవస్థలతోనే ఇప్పుడు వారి ఉద్యోగాలను సంస్థ భర్తీ చేయడం గమనార్హం. 50శాతం మేర కోడ్ రాసేందుకు ఓపెన్ ఏఐ చాట్‌బాట్‌లను ఉపయోగించుకోవాలని తన ఆధ్వర్యంలో ఉన్న 400 మంది ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ ఉన్నతాధికారి జెఫ్ హల్స్ కొన్ని వారాల క్రితం సూచించారు. తాజా తొలగింపుల్లో ఆ బృందం కూడా ఉంది. అంటే వారికి తెలియకుండానే వారి ఉద్యోగాలకు వారే ఎసరు తెచ్చుకున్నట్లయింది.

జూనియర్ కోడర్స్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, టెక్నికల్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఉన్నవారు, ఏఐ ప్రాజెక్టుల్లో పనిచేస్తోన్న సిబ్బంది ఈ కొత్త లేఆఫ్‌ను ఎదుర్కొన్నారు. చివరకు మైక్రోసాఫ్ట్ స్టార్టప్‌లకు చెందిన ఏఐ డైరెక్టర్ గాబ్రియెలా డికీరోజ్ కూడా తన పదవిని కోల్పోవడం గమనార్హం. దీనిపై ఆమె స్పందిస్తూ.. చేదు రుచి కలిగిన తీపి ఇది అని పేర్కొన్నారు. సంస్థ కోసం ఎంతో కృషి చేసినవారు తమ ఉద్యోగాలను కోల్పోవడం విచారకమని వ్యాఖ్యానించారు.

2023లో 10 వేల మందికి మైక్రోసాఫ్ట్ ఉద్వాసన పలికింది. అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు కానుంది. "మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలుచేస్తూనే ఉంటాం" అని ఈ లేఆఫ్‌లపై మైక్రోసాఫ్ట్ ప్రతినిధి ఒకరు స్పందించారు. మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడమే ముఖ్య లక్ష్యమని చెప్పారు.

గత నెల మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యానాదెళ్ల కృత్రిమ మేధ వినియోగంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తమ కంపెనీకి సంబంధించి 30 శాతం కోడింగ్‌ను కృత్రిమ మేధ సాయంతోనే రాస్తున్నట్లు వెల్లడించారు. నాణ్యత కోసం ఏఐ ఆధారిత టూల్స్‌పై ఆధారపడటం పెరుగుతోందన్నారు. ఆ వ్యాఖ్యల అనంతరమే 3 శాతం మంది ఉద్యోగుల తొలగింపు ప్రకటన వచ్చింది.

# 'సిందూర్' విజయం నాయకత్వ పటిమకు
# నిదర్శనం.. మోదీపై అంబానీ ప్రశంసలు



ప్రధాని నరేంద్రమోదీ )పై రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ ( ప్రశంసలు కురిపించారు. ఆయన నాయకత్వ పటిమను కొనియాడుతూ.. సెల్యూట్ చేస్తున్నా అని అన్నారు. అలాగే భద్రతాబలగాల ధైర్యసాహసాలను అభినందించారు. 'ఆపరేషన్ సిందూర్' విజయం ఈ రెండు లక్షణాలకు గొప్ప నిదర్శనమని వ్యాఖ్యానించారు. దిల్లీలో జరుగుతోన్న రైజింగ్ నార్త్‌ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మోదీ కూడా పాల్గొన్నారు

%దేశ రాజధానిలోని భారత మండపంలో రెండురోజుల పాటు జరిగే రైజింగ్ నార్త్‌ఈస్ట్ ఇన్వెస్టర్స్ సదస్సును మోదీ ప్రారంభించారు. ఈశాన్యప్రాంతంలో పెట్టుబడులను ప్రోత్సహించడమే లక్ష్యంగా దీనిని నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో మోదీ మాట్లాడుతూ.. భిన్నత్వంతో కూడిన మన దేశంలో ఈశాన్యప్రాంతం మరింత వైవిధ్యభరితమైందని అన్నారు. ఈశాన్య భారతం ఒక పవర్‌హౌస్ అని, మనకు అష్టలక్ష్మి వంటిదని అభివర్ణించారు.

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా మే 7న 'ఆపరేషన్ సిందూర్ ' పేరిట పాకిస్థాన్, పీవోకేలోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడింది. దాయాది దాడుల యత్నాలనూ సమర్థంగా తిప్పికొట్టింది. దీనిపై ఇటీవల అంబానీ స్పందించారు. ఉగ్రవాదంపై భారత్ ఐకమత్యం, స్థిరత్వం, దృఢ సంకల్పంతో పోరాడుతోందన్నారు. సాయుధ దళాల శౌర్యపరాక్రమాలపై గర్వపడుతున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

"ప్రధాని మోదీ నాయకత్వంలో భారత బలగాలు సరిహద్దు అవతలి ఉగ్ర కార్యకలాపాలపై కచ్చితత్వంతో ప్రతిస్పందించాయి. ఉగ్రవాదం విషయంలో భారత్ ఎప్పుడూ మౌనంగా ఉండదని.. దేశం, పౌరులు, సైన్యంపై దాడిని సహించబోదని మోదీ నాయకత్వం నిరూపించింది. శాంతికి విఘాతం కలిగించే ప్రతి ముప్పును దీటుగా ఎదుర్కొంటామని స్పష్టం చేసింది" అని అంబానీ ఆ ప్రకటనలో పేర్కొన్న సంగతి తెలిసిందే.

# కియా కరెన్స్ క్లావిస్ విడుదల..
# ధర రూ.11.50 లక్షల నుంచి ప్రారంభం




: దక్షిణ కొరియాకు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం కియా మోటార్స్.. కరెన్స్ క్లావిస్‌ను శుక్రవారం విడుదల చేసింది. దీని ప్రారంభ ధరను రూ.11.50 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) నిర్ణయించింది. అధునాతన ఫీచర్లు, కొత్త హంగులు, మెరుగైన భద్రతా ఫీచర్లను జోడించింది. కంపెనీ అధికారిక వెబ్‌సైట్, డీలర్‌షిప్‌ల వద్ద మే 9 నుంచి బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. కియా కరెన్స్ క్లావిస్ మూడు రకాల ఇంజిన్ ఆప్షన్లతో వస్తోంది. 1.5 లీటర్ పెట్రోల్ ఇంజిన్ 113 హెచ్‌పీ పవర్‌ను, 143.8 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ 157 హెచ్‌పీ పవర్‌ను, 253 ఎన్ఎం టార్క్‌ను విడుదల చేస్తుంది. 1.5 లీటర్ డీజిల్ ఇంజిన్ 113 హెచ్‌పీ పవర్‌ను 250 ఎన్ఎం టార్క్‌ను ఇస్తుంది.

ఎక్స్‌టీరియర్ పరంగా చూస్తే కియా కరెన్స్ క్లావిస్ పూర్తి కొత్త డిజైన్‌తో వస్తోంది. ముందువైపు పాడ్ ఎల్ఈడీ హెడ్‌లైట్స్, వీ షేప్ ఎల్ఈడీ డీఆర్ఎల్స్, బ్లాక్డ్ అఫ్ గ్రిల్‌తో డిజైన్ చేశారు. పనోరమిక్ సన్‌రూఫ్, స్పోర్టీ 17 అంగుళాల అల్లాయ్ వీల్స్‌తో మరింత ఆకట్టుకునే లుక్‌తో దీన్ని తీసుకొచ్చారు. క్రోమ్ డోర్ హ్యాండిల్స్, సిల్వర్ రూఫ్ రెయిల్స్‌తో వస్తోంది. వెనుక భాగంలో కరెన్స్‌ను ఫాలో అయినప్పటికీ.. ఎల్ఈడీ లైట్ స్ట్రిప్‌కు ఫ్రెష్ లుక్ ఇచ్చారు.

ఇక ఇంటీరియర్ విషయానికొస్తే.. క్లావిస్‌లో సెల్టోస్ తరహాలో 22.62 అంగుళాల డ్యూయల్ స్క్రీన్ సెటప్ ఉంది. 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ ప్యానెల్, 10.25 అంగుళాల టచ్ ఇన్ఫోటైన్‌మెంట్ డిస్‌ప్లే ఉన్నాయి. వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్స్, రీడైజన్డ్ ఏసీ వెంట్స్, ఆటో కంట్రోల్స్, ఫోర్-వే పవర్ అడ్జస్టబుల్ సీట్లు, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్ ప్లే, 8 స్పీకర్ బోస్ సౌండ్ సిస్టమ్ ఇందులో ఉన్నాయి.

కరెన్స్ క్లావిస్‌లో 20కి పైగా భద్రతాపరమైన లెవెల్-2 అడాస్ ఫీచర్లు ఉన్నాయి. 6 ఎయిర్‌బ్యాగ్‌లు, 360-డిగ్రీ కెమెరా, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ విత్ ఆటో హోల్డ్, ఫ్రంట్, రేర్ పార్కింగ్ సెన్సర్లు, లేన్ కీప్ అసిస్ట్, స్మార్ట్ క్రూయిజ్ కంట్రోల్, బ్లైండ్ స్పాట్ కొలిజన్ వార్నింగ్ వంటి అధునాతన ఫీచర్లను క్లావిస్‌కు జోడించారు. మొత్తం 7 ట్రిమ్స్‌లో లభిస్తుంది. ప్రారంభ ధర రూ.11.50 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.18 లక్షల వరకు ఉంది.

# లాభాల్లో ట్రేడవుతున్న స్టాక్ మార్కెట్లు..
# 24,700 ఎగువన నిఫ్టీ



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం ఫ్లాట్‌గా ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల నడుమ మదుపర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దీంతో ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు ప్రధాన షేర్లలో కొనుగోళ్ల అండతో ప్రస్తుతం లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఉదయం 9:27 గంటల సమయంలో సెన్సెక్స్ 235 పాయింట్ల లాభంతో 81,251 వద్ద ట్రేడవుతుండగా.. నిఫ్టీ ( ) 114 పాయింట్ల లాభంతో 24,728 వద్ద ఉన్నాయి.

సెన్సెక్స్ 30 సూచీలో.. ఎటర్నల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఐటీసీ, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్‌ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, నెస్లే ఇండియా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. సన్‌ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, ఎంఅండ్ఎం, టైటాన్ నష్టాల్లో కదలాడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 60.85 డాలర్ల వద్ద.. బంగారం ఔన్సు 3,298 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.10 వద్ద ప్రారంభమైంది.

అమెరికా మార్కెట్లు గురువారం మిశ్రమంగా ముగిశాయి. నాస్‌డాక్ 0.28 శాతం లాభంతో ముగియగా.. ఎస్ అండ్ పీ 500, డోజోన్స్ మాత్రం స్వల్పంగా నష్టపోయాయి. ఆసియా-పసిఫిక్ మార్కెట్లు నేడు లాభాల్లో పయనిస్తున్నాయి. ఆస్ట్రేలియన్ ఏఎస్ఎక్స్ 0.26 శాతం, జపాన్ నిక్కీ మాత్రం 0.80 శాతం, హాంగ్‌సెంగ్ 0.76 శాతం, షాంఘై 0.21 శాతం లాభంతో ట్రేడవుతున్నాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు తిరిగి విక్రయదారులుగా నిలిచారు.

# 1,11,000 డాలర్లకు బిట్‌కాయిన్



న్యూయార్క్: క్రిప్టో కరెన్సీలలో పేరొందిన బిట్‌కాయిన్ జోరు కొనసాగుతోంది. తొలిసారి దీని విలువ 1,11,000 డాలర్లను తాకింది. బిట్‌కాయిన్ దూకుడుకు సంస్థాగత మదుపర్ల నుంచి గిరాకీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధాన నిర్ణయాలు కారణమని చెబుతున్నారు. క్రిప్టో కరెన్సీని భారత్ వంటి దేశాలు గుర్తించడం లేదు. అయితే ట్రంప్ మాత్రం వీటికి మద్దతు ఇచ్చేలా వ్యవహరిస్తున్నారు. ఫలితంగానే గురువారం బిట్‌కాయిన్ విలువ 3.3% దూసుకెళ్లి 1,11,878 డాలర్ల వద్ద రికార్డు గరిష్ఠాన్ని చేరింది. రెండో అతిపెద్ద క్రిప్టో అయిన ఈథర్ విలువ కూడా 7.3% పెరిగింది.

# ఆ విషయంలో దురదృష్టవంతుడిని: కమల్ హాసన్



'థగ్ లైఫ్' అంటూ ప్రేక్షకులను పలరించేందుకు సిద్ధమయ్యారు అగ్ర కథానాయకుడు కమల్ హాసన్ మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా (జూన్ 5న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈసందర్భంగా ప్రచారంలో పాల్గొన్న కమల్ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. మలయాళ ఇండస్ట్రీపై తనకున్న అభిమానాన్ని వివరించారు. పరిశ్రమలోని దిగ్గజ దర్శక నిర్మాతలతో వర్క్ చేయలేకపోయినందుకు బాధపడ్డారు.

మలయాళ పరిశ్రమలో అవకాశాల గురించి మాట్లాడుతూ.. "నా కంపెనీని నడపడానికి నేను ఇప్పటికీ సంపాదన వెంట పరుగెడుతున్నాను. నిజానికి నా దగ్గర ఉన్న డబ్బు కంటే ఎక్కువ అవసరం లేదు. కానీ, నా సినిమాలు తీయడానికి మరింత డబ్బు అవసరం. అందుకే ఆర్థికంగా బలపడడం కోసం మాలీవుడ్ ఇండస్ట్రీని ఎంచుకున్నాను. నేను ఒక విషయంలో దురదృష్టవంతుడిని. ఈ రంగంలోకి ప్రవేశించినప్పటికీ ఎం.టీ వాసుదేవన్ నాయర్, మృణాల్ సేన్ వంటి దిగ్గజాలతో నేను సినిమాలు చేయలేకపోయాను" అని చెప్పారు.

సినిమా ఫలితాల గురించి మాట్లాడుతూ.. "నేను మూడేళ్ల వయసు ఉన్నప్పటి నుంచి నటించడం మొదలుపెట్టాను. ప్రతిరోజూ మంచి రోజుగానే భావిస్తాను. అందుకే సినిమా విడుదల రోజు ఆందోళన చెందను. ఈ పరిణితి అనుభవాన్ని బట్టి వస్తుంది. ప్రతి సినిమా విజయం సాధించాలని కోరుకుంటాం. భారీ బడ్జెట్‌తో దాన్ని నిర్మిస్తాం. ఒక్కోసారి అనుకున్న ఫలితం రాదు. అప్పుడు కొన్నిసార్లు ఆడియన్స్‌ను నిందిస్తాం. మరికొన్నిసార్లు మనల్ని మనమే నిందించుకుంటాం. దీన్ని అంగీకరించడానికి కొంత సమయం పడుతుంది. వయసు, అనుభవం మనకు ఎన్నో విషయాలు నేర్పుతాయి'' అని వివరించారు.

'నాయకన్' (1987) లాంటి హిట్ తర్వాత కమల్ - మణిరత్నం కాంబినేషన్‌లో వస్తోన్న చిత్రమిది. గ్యాంగ్‌స్టర్, యాక్షన్ డ్రామా ఫిల్మ్‌గా ఇది సిద్ధమవుతోంది. త్రిష, శింబు కీలకపాత్రల్లో కనిపించనున్నారు. కమల్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమా నాయకన్ కంటే బాగుంటుందని కమల్ హాసన్ పలు ఇంటర్వ్యూల్లో ధీమా వ్యక్తంచేశారు.

# సినీ పరిశ్రమ ఐసీయూలో ఉంది.. ఎగ్జిబిటర్ల వివాదంపై స్పందించిన నిర్మాత ఎస్‌కేఎన్



: కొన్ని రోజులుగా ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారిన సినిమా థియేటర్ల ఎగ్జిబిటర్ల వివాదంపై నిర్మాత శ్రీనివాస్ కుమార్ (ఎస్‌కేఎన్) స్పందించారు. 'ఘటికాచలం' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దీని గురించి మాట్లాడారు. ఈ వివాదంపై (సినీ పెద్దలు ఆలోచించాలన్నారు. అలాగే మీడియా కూడా సినీ రంగానికి సహకరించాలని కోరారు. ఇండస్ట్రీ ఐసీయూలో ఉందన్నారు. ఇది యాంటీ బయాటిక్స్ ఇవ్వాల్సిన సమయమన్నారు.

"పర్సంటేజీల విధానంపై కాకుండా థియేటర్లలో ప్రేక్షకుల పర్సంటేజీ పెంచే విషయంపై సినీ పెద్దలు ఆలోచన చేయాలి. టికెట్ ధరలు, తినుబండారాలు, ఓటీటీల వల్ల ప్రేక్షకులు థియేటర్లకు దూరమవుతున్నారు. దీన్ని ఎలా పరిష్కరించాలో ఆలోచించాలి. మార్నింగ్ షోకు వచ్చే ఆడియన్స్ తగ్గిపోతున్నారు. ఈవెనింగ్ షో, వీకెండ్స్‌లలో ఆడియన్స్ బాగా వస్తున్నారు. దీన్ని దృష్టిలోపెట్టుకొని టికెట్ ధరల విషయంలో ఓ నిర్ణయం తీసుకోవాలి. మాములు రోజుల్లో టికెట్ ధరలు తగ్గించడమా.. లేదంటే వీకెండ్స్‌లో ధరలు పెంచడమా అనే దానిపై ఆలోచన చేయాలి. ఆడియన్స్ థియేటర్‌కు రావడానికి ఆసక్తి చూపడం లేదు. రెండు వారాల్లో ఎలాగూ ఓటీటీకి వస్తుంది కదా.. ఇంక థియేటర్‌కు ఎందుకు అని అనుకుంటున్నారు. ఇప్పుడు హిందీ, తమిళంలో ఉన్నట్లు కచ్చితంగా 8 వారాల తర్వాతే ఓటీటీకి వచ్చేలా ఏర్పాటుచేయాలి. ఇలా ఎన్నో విషయాలపై చర్చ జరగాలి" అని చెప్పారు. ఇది తన (%ూఖచీ%) వ్యక్తిగత అభిప్రాయమని అన్నారు.

జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ చేయాలని నిర్ణయించుకున్నట్టు తెలుగు రాష్ట్రాల ఎగ్జిబిటర్లు తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. అద్దె ప్రాతిపదికన సినిమాల్ని ప్రదర్శిస్తుండడంతో తమకు ఆదాయం సరిపోవడం లేదని, మల్టీప్లెక్స్ తరహాలోనే వసూళ్లలో పర్సెంటేజీ విధానాన్ని అమలుచేయాలంటూ సింగిల్ థియేటర్ల యాజమాన్యాలు పట్టుబట్టాయి. మల్టీప్లెక్స్‌ల్లో పర్సెంటేజీల ప్రకారం ప్రదర్శనలు జరుగుతుండగా, తాము మాత్రం అద్దె ప్రాతిపదికన ఎందుకు సినిమాల్ని ప్రదర్శించాలని పలువురు యజమానులు తమ వాదనను ఇటీవల జరిగిన సమావేశంలో వినిపించారు.

# గీతా సందేశంతో.. రెండో రోజూ కేన్స్‌లో ఐశ్వర్య మెరుపులు



: 22వ సారి కేన్స్ వేడుకలకు హాజరయ్యారు ఐశ్వర్యారాయ్. మొదటిరోజు హాఫ్ వైట్ శారీలో భారతీయత ఉట్టిపడేలా రాయల్ లుక్‌లో కనిపించిన ఆమె.. రెండో రోజూ తన ప్రత్యేకతను చాటుకున్నారు. మోడ్రన్ దుస్తులు ధరించినప్పటికీ భారతీయ సంస్కృతి సంప్రదాయలకు విలువనిచ్చారు. తన డ్రెస్‌పై భగవద్గీత శ్లోకంతో అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

ప్రముఖ డిజైనర్ గౌరవ్ గుప్తా ఈ విషయాన్ని వెల్లడిస్తూ ఫొటోలు షేర్ చేశారు. "ఐశ్వర్య ధరించిన డ్రెస్‌కు ఒక ప్రత్యేకత ఉంది. ఆ బనారసీ కేప్‌పై 'భగవద్గీతలోని 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన' అనే శ్లోకాన్ని చేతితో సంస్కృతంలో ఎంబ్రాయిడరీ చేశారు" అని తెలిపారు. దీంతో ఈరోజు ఐశ్వర్య ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను, భగవంతుడు అందించిన అమూల్య సంపద భగవద్గీత గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. ఐశ్వర్య రెండోరోజు లుక్‌పై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. అలాగే భగవద్గీతకు ఇటీవల యునెస్కో (మెమొరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చోటు లభించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ఐశ్వర్య ప్రపంచానికి చాటిచెప్పడం కోసం ఈ డ్రెస్ ధరించి ఉంటారని అభిప్రాయపడుతున్నారు.

తొలిరోజు కూడా ఈ కేన్స్ క్వీన్ తన లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. కొన్నేళ్లుగా కేన్స్‌లో మెరుస్తున్న ఈ భామ ఈసారి భారతీయత ఉట్టిపడేలా.. చీరకట్టుతో నుదుటిన సిందూరం పెట్టుకొని సినీప్రియుల దృష్టిని ఆకట్టుకున్నారు.



సుహాసిని, త్రిష, మణిరత్నం, కమల్‌హాసన్, శింబు

# నేనెప్పుడూ నిత్య విద్యార్థినే

"స్టార్‌గా నాకు పుట్టినిల్లు తెలుగు చిత్ర పరిశ్రమే. నాకు ఎన్నో మంచి సినిమాల్ని నిర్మించే శక్తినిచ్చింది ఇక్కడి ప్రేక్షకులే" అన్నారు కథానాయకుడు కమల్ హాసన్ (%ఖుఝశ్రీ ఝుయిఅ%). ఇప్పుడాయన నుంచి వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'థగ్ లైఫ్' (%ఫ్తబస్త్ర ాఆటవ%). మణిరత్నం తెరకెక్కించిన ఈ సినిమాని రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. త్రిష (%తీఅంఫ్త్రఝ%) కథానాయిక. శింబు, జోజు జార్జ్, నాజర్, తనికెళ్ల భరణి, అభిరామి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా శ్రేష్ఠ్ మూవీస్ సంస్థ ద్వారా జూన్ 5న తెలుగులోకి రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం రాత్రి హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా హీరో కమల్‌హాసన్ మాట్లాడుతూ.. "మణిరత్నం అప్పటికీ ఇప్పటికీ దర్శకుడిగా చాలా మారారు. ఆ మార్పు ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తుంది. మా మధ్య నుంచి ఇన్నేళ్ల విరామం తర్వాత సినిమా రావడానికి కారణం నేనే. నన్ను అందరూ ద్రోణాచార్యుడు.. గురువు అంటున్నారు. దయచేసి నా నుంచి ఏ పాఠాలు ఆశించకండి. ఎందుకంటే సినిమాకి నేనెప్పుడూ నిత్య విద్యార్థినే. నేర్పడానికి సిద్ధంగా ఉండాలంటే ముందు నేనింకా నేర్చుకోవాలి. కెరీర్ ఆరంభం నుంచి నిత్యం నేనదే పని చేస్తున్నా. అందుకే నన్ను గురువు అనకండి. గుర్తుపెట్టుకోండి చాలు. నేను మంచి సినిమాలకు అభిమానిని. అలాంటి చిత్రాలు అందించేందుకు ఎంతైనా కష్టపడతా. నేను నా జీవితంలో ప్రతిదీ సినిమా ద్వారానే నేర్చుకున్నా. నటన ద్వారానే తమిళం, తెలుగు, మలయాళం.. ఇలా ప్రతి భాషా నేర్చుకున్నా. ఈ 'థగ్ లైఫ్' నాకెంతో ఇష్టమైన చిత్రం. మేమంతా ఎంతో ఇష్టపడి, కష్టపడి చేశాం. ఈ సినిమా నుంచి.. పాత్ర నుంచి బయటకు రావడానికి నాకు చాలా సమయమే పడుతుంది. నేనీ చిత్రం చూశా. తప్పకుండా ఇది 'నాయగన్' కంటే చాలా పెద్ద సినిమా అవుతుందని మాటిస్తున్నా. ప్రేక్షకుల స్పందన చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా" అన్నారు. "అందరిలాగే నేనూ కమల్ - మణిరత్నంల 'నాయగన్' చిత్రం చూస్తూ పెరిగాను. వాళ్లిద్దరూ కలిసి 37ఏళ్ల తర్వాత ఇలా ఈ సినిమాతో రావడం.. నేనిందులో భాగమవ్వడం చాలా ఆనందంగా ఉంది. దీన్ని ప్రేక్షకులు ఎలా ఆస్వాదిస్తారోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అంది త్రిష.

దర్శకుడు మణిరత్నం మాట్లాడుతూ.. "నా 'మౌనరాగం' సినిమా విడుదలయ్యాక ఓసారి నిర్మాత ముక్తా శ్రీనివాసన్ ఓరోజు మా ఇంటికి వచ్చారు. తను నా చేతికి ఓ కవర్ ఇచ్చి.. 'కమల్ సర్ అందులో ఉన్న హిందీ సినిమాని మిమ్మల్ని చూడమని చెప్పార'న్నారు. నేను ఆ చిత్రం చూశాక దాన్ని రీమేక్ చేయలేనని చెప్పేశా. కానీ, ఆ నిర్మాత అదే మాట నేరుగా కమల్‌కి చెప్పమని కారులో ఏవీఎం స్టూడియోకి తీసుకెళ్లారు. అప్పుడదే మాట మళ్లీ ఆయనతో చెప్పే.. 'సరే నాతో చేయడానికి ఏ కథతే బాగుంటుందో చెప్పమ'ని అనడంతో ఆశ్చర్యపోయా. అప్పుడలా చర్చిస్తూ అనుకోకుండా 'నాయగన్' చిత్రం పురుడుపోసుకుంది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత 'థగ్ లైఫ్' విషయంలోనూ అదే జరిగింది. ఓరోజు కమల్ ఫోన్ చేసి కలిసి సినిమా చేద్దామన్నారు. అలా ఇన్నేళ్ల విరామం తర్వాత మా ఇద్దరి కలయికలో రెండో సినిమా సాకారమైంది" అన్నారు. నిర్మాత సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. "కమల్‌హాసన్ గత రెండు చిత్రాల్ని తెలుగులో నేనే విడుదల చేశా. అవి బ్లాక్‌బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. ఈ చిత్ర ట్రైలర్, పాటలు చూశాక ఇది కమల్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలుస్తుందని నమ్మకం ఏర్పడింది" అన్నారు. ఈ కార్యక్రమంలో శింబు, సుహాసిని, అశోక్ సెల్వన్, అభిరామి, నాజర్, తనికెళ్ల భరణి తదితరులు పాల్గొన్నారు.

# పూరితో సినిమా కోసం ఎదురు చూస్తున్నా

"ఒకేసారి కాకుండా రెండు రోజులపాటు కథ వినాలనుకున్నా. కానీ దర్శకుడు పూరి జగన్నాథ్ కథ చెబుతుంటే అలా మూడున్నర గంటలు వింటూనే ఉన్నా. ఆయన కథ చెప్పిన తీరు అంతగా నచ్చింది. ఆయనతో కలిసి చేయనున్న సినిమా కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నా" అన్నారు ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి ఆయన కథానాయకుడిగా తెరకెక్కిన 'ఏస్' శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఆరుముగ కుమార్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రమిది. రుక్మిణీ వసంత్ కథానాయిక. దివ్య పిళ్లై కీలక పాత్ర పోషించారు. బి.శివప్రసాద్ తెలుగులో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు.

విజయ్ సేతుపతి మాట్లాడుతూ "యాక్షన్, హాస్యంతోపాటు రొమాంటిక్ అంశాల మేళవింపుతో కూడిన మంచి చిత్రమిది" అన్నారు. పూరితో ( కలిసి చేస్తున్న సినిమాపై అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ... "ఆ సినిమాకి ఇంకా పేరు ఖరారు చేయలేదు. పోస్టర్లు కూడా ఎవరో ఏఐ నుంచి తీసినవే వైరల్ అవుతున్నాయి. వచ్చే నెలలో ఆ సినిమా ప్రారంభం అవుతుంది. దర్శకుడు పూరి జగన్నాథ్ ఆ కథని తయారు చేసిన విధానం చాలా బాగుంది" అన్నారు.

దర్శకనిర్మాత మాట్లాడుతూ "విజయ్ సేతుపతి ఒక ఆల్‌రౌండర్. ఆయన సినిమా అంటే అన్ని రకాల వాణిజ్యాంశాలు ఉంటాయి. ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అన్నారు. తెలుగు ప్రేక్షకుల ముందుకు సినిమాని తీసుకొస్తున్న బి.శివప్రసాద్ మాట్లాడుతూ "ఈ సినిమా కథ, పాత్రలు అద్భుతంగా ఉండబోతున్నాయి. విజయ్ సేతుపతి మంచి వ్యక్తి. అన్నీ సెట్ అయితే ఆయనతో 'రొమాంటిక్ డాన్' అనే సినిమాని త్వరలోనే ప్రకటిస్తాం" అన్నారు.

# జూన్ నుంచి ఉస్తాద్ బరిలోకి

కథానాయకుడు పవన్ కల్యాణ్ ( సినిమాల విషయంలో వేగం పెంచారు. చేతిలో ఉన్న చిత్రాల్ని పూర్తి చేయడమే లక్ష్యంగా చిత్రీకరణల్ని పరుగులు పెట్టిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటికే 'హరి హర వీరమల్లు'ను పూర్తి చేసి 'ఓజీ' కోసం రంగంలో దిగిన ఆయన.. ఇప్పుడు 'ఉస్తాద్ భగత్ సింగ్'ను పునఃప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు.

ఇది జూన్ నుంచి కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకోనున్నట్లు చిత్ర బృందం హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం ప్రకటించింది. ఇది హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న సినిమా. అన్ని రకాల వాణిజ్య హంగులతో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబు కానుంది. ఇందులో శ్రీలీల (కథానాయికగా నటిస్తుండగా.. అశుతోష్ రాణా, నవాబ్ షా, అవినాశ్, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

# లోపం సూక్ష్మం నష్టం ఘనం

మన శరీరానికి కొంచెంగానే అవసరమైనా సూక్ష్మ పోషకాలు చాలా ఘనమైనవి. వీటిల్లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది థయమిన్ గురించి. స్థూల పోషకమైన పిండి పదార్థం శక్తిగా మారటానికిది తప్పనిసరి. ఇది లోపిస్తే జీవశక్తే ఉత్పన్నం కాదు. మెదడు, గుండె, ఊపిరితిత్తుల వంటి కీలక అవయవాలు చతికిల పడి, చేతులెత్తేస్తాయి. ముఖ్యంగా నవజాత శిశువులకు, పిల్లలకు ఈ థయమిన్ లోపం శాపంగా మారుతోంది. ఈ లోపాన్ని గుర్తించక ఇతరత్రా సమస్యలుగా పొరపాటు పడటం, అనవసర చికిత్సలు చేయటమూ చూస్తున్నాం. ఫలితంగా ఎంతోమంది పిల్లలు ప్రాణాలు కోల్పోతుండటం విషాదకరం. సకాలంలో థయమిన్ లోపాన్ని గుర్తించగలిగితే వీరిని చాలావరకూ కాపాడుకోవచ్చు. కాబట్టి దీనిపై అవగాహన కలిగుండటం అవసరం.



అత్యంత ముఖ్యమైన సూక్ష్మ పోషకాల్లో థయమిన్ (విటమిన్ బి1) ఒకటి. మనం రోజూ తినే ఆహారంతో పుష్కలంగా లభిస్తుంది. అన్ని కూరగాయలు, పండ్లు, మాంసం, గుడ్ల వంటి పదార్థాల్లో దండిగా ఉంటుంది. బియ్యం వంటి ధాన్యాలతోనూ సరిపడా లభిస్తుంది. ధాన్యాల్లో ఇది గింజల వెలుపలి పొర అయిన పెరికార్ప్‌లో ఉంటుంది. వడ్లను మరపట్టి, పాలిష్ చేసే క్రమంలో ఈ పొరతో పాటు థయమిన్ కూడా పోతుంది. అందువల్ల పాలిష్ పట్టిన, పాత బియ్యంతో వండిన అన్నాన్ని మాత్రమే ప్రధానంగా తినేవారిలో థయమిన్ లోపం తలెత్తే అవకాశం చాలా ఎక్కువ. ఉప్పుడు బియ్యం తినేవారిలో దీని లోపం తక్కువ. వడ్లను పాక్షికంగా ఉడికించి ఉప్పుడు బియ్యంగా మార్చే క్రమంలో థయమిన్ పోషకం ధాన్యం వెలుపలి పొర నుంచి లోపలికి చేరుకుంటుంది. కాబట్టి ఉప్పుడు బియ్యంలో థయమిన్ లోపించదు. దంపుడు బియ్యంలోనూ ఇది దండిగానే ఉంటుంది. అయితే మనలో చాలామంది బాగా పాలిష్ పట్టిన తెల్లటి బియ్యం వాడటం గమనార్హం. ఈ బియ్యంలో అప్పటికే థయమిన్‌తో కూడిన పొర పోతుంది. మరోవైపు చాలాసార్లు కడగటం వల్ల కొద్దోగొప్పో ఉన్న థయమిన్ కూడా నీటితో పాటు వెళ్లిపోతుంది. ఇక అన్నం వండేటప్పుడు గంజిని వార్చితే సంపూర్ణంగా థయమిన్‌ను కోల్పోయే అవకాశముంది. చాలాకాలం నిల్వ ఉంచిన బియ్యంలోనూ థయమిన్ మోతాదు తగ్గుతుంది. కొత్త బియ్యంతో వండిన అన్నంలో ఇది ఉంటుంది. కానీ మనదగ్గర కొత్త బియ్యం కన్నా పాత బియ్యాన్ని ఎక్కువగా ఇష్టపడటం కూడా లోపానికి కారణమవుతోంది.

జీవశక్తి నిస్తేజం

కూరగాయలు, పండ్లు, మాంసం, గుడ్డు వంటి పదార్థాలు తిననివారికి, అలాగే పాలిష్ పట్టిన తెల్లటి బియ్యం, పాత బియ్యాన్ని అదీ చాలాసార్లు కడిగి, గంజి వార్చి వండిన అన్నం మాత్రమే ప్రధానంగా తినే పేదవారిలో థయమిన్ లోపం తలెత్తుతుంది. ఇది బెరిబెరి అనే జబ్బుకు దారితీస్తుంది. ఇలాంటి అన్నం రోజూ తినేవారికి కేలరీలు బాగానే లభిస్తాయి గానీ అవి శక్తిగా మారవు. ఎందుకంటే మనం తినే ఆహారంలోని కేలరీలు శక్తిగా మారటానికి థయమిన్ తప్పనిసరి. దీని లోపం గలవారిలో ఏటీపీ (జీవశక్తి) ఉత్పత్తి కాదు. అందుకే బెరిబెరిని డిసీస్ ఆఫ్ ఎంప్టీ కేలరీస్ అని పరిగణిస్తారు. ఏటీపీ అనేది అడినోసిన్ డైఫాస్ఫేట్ (ఏడీపీ) నుంచి పుట్టుకొస్తుంది. ఈ ప్రతిచర్యకు థయమిన్ అవసరం. గ్లూకోజు ద్వారా థయమిన్ సమక్షంలోనే ఏడీపీ నుంచి ఏటీపీ వస్తుంది. థయమిన్ లోపిస్తే కొన్ని రసాయన ప్రతిచర్యల వల్ల గ్లూకోజు లాక్టేట్‌గా మారుతుంది. ఇది శరీరంలో పోగుపడుతుంది. ఏటీపీ తయారు కాకపోవటం వల్ల ఏడీపీ కూడా పోగుపడుతుంది. ఇది కొన్ని సమస్యలకు దారితీస్తుంది.

నాలుగు రకాలు

పిల్లల్లో వచ్చే ఇన్‌ఫెంటైల్ బెరిబెరిని వైద్యశాస్త్రం నాలుగు రకాలుగా పేర్కొంటుంది.

1. ఎన్‌కెఫలైటిక్ బెరిబెరి: ఏటీపీ ప్రధానంగా మెదడుకు.. ముఖ్యంగా మస్తిష్క మూలం, బేసల్ గ్యాంగ్లియాన్ భాగాలకు అవసరం. ఏటీపీ లేకపోతే ఇవి సరిగా పనిచేయవు. చివరికి మెదడు మొత్తంగానే పని చేయకపోవచ్చు. శ్వాస, గుండెకు సంబందించిన పనులను నియంత్రించే భాగాలూ మస్తిష్క మూలంలోనే ఉంటాయి. అందువల్ల గుండెతో పాటు శ్వాసకు సంబంధించిన సమస్యలూ తలెత్తుతాయి. గుండె వేగం పెరగటం, ఆయాసం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

2. కార్డియాక్ బెరిబెరి: మెదడుకే కాదు.. గుండెకూ ఏటీపీ పెద్ద మొత్తంలో కావాలి. ఇది తగినంత లభించకపోతే పంపింగ్ సామర్థ్యం తగ్గి, గుండె విఫలం (సీసీఎఫ్) కావొచ్చు. రక్తనాళాలు, సమీపంలోని కణజాలాలకు మధ్య ద్రవాల మార్పిడి అస్తవ్యస్తమై శరీరవ్యాప్తంగా వాపు (అనసర్కా) తలెత్తొచ్చు. ఈ సమస్యల ద్వారా కూడా ఎక్కువ మంది పిల్లలు చనిపోతుంటారు.

3. ఎఫోనిక్ బెరిబెరి: ఇందులో స్వరతంత్రులు బలహీనం కావటం వల్ల మాట పీలగా మారుతుంది (ఎఫోనియా).

4. డ్రై బెరిబెరి: ఇది నాడులను దెబ్బతీస్తుంది. ముఖ్యంగా కాళ్ల చేతుల్లో నాడులు దెబ్బతింటాయి (పెరిఫెరల్ న్యూరైటిస్). దీంతో కండరాల పటుత్వం తగ్గుతుంది. చివరికి కండరాల పక్షవాతమూ రావొచ్చు.

ఊపిరితిత్తుల్లో అధిక పీడనం కూడా

కార్డియాక్ బెరిబెరిలో వైద్యశాస్త్రం పేర్కొన్న లక్షణాలకు భిన్నంగా గుండె వైఫల్యంతో పాటు ఊపిరితిత్తుల నుంచి గుండెకు వచ్చే ధమనుల్లో అధిక రక్తపోటు (పల్మనరీ హైపర్‌టెన్షన్), ఆయాసం (రెస్పిరేటరీ డిస్ట్రెస్) కూడా ఉంటున్నట్టు అనుభవంలో తేలింది. ఏడీపీ పోగుపడటం వల్ల ఊపిరితిత్తిల్లోని రక్తనాళాల్లో మార్పులు మొదలవుతాయి. ఫలితంగా గుండె నుంచి ఊపిరితిత్తులకు రక్తాన్ని చేరవేసే ధమనిలో పీడనం పెరుగుతుంది. పిల్లల్లో దీన్ని కొందరు వైద్యులు అక్యూట్ బ్రాంకియోలైటిస్ లేదా బ్రాంకోన్యుమోనియాగా పరిగణించి, వాటికి చికిత్స చేయటమూ చూస్తున్నాం. అలాగే ఎన్‌కెఫలైటిక్ బెరిబెరిని మెదడు వాపుగా పొరపడటమూ చూస్తున్నాం. పిల్లల్లో రెప్పలు కిందికి వాలటం (టోసిస్), కళ్లు పక్కలకు, పైకీ కిందికీ కదల్చలేకపోవటం (ఎక్స్‌టర్నల్ ఆఫ్తాల్మోప్లేజియా), ఫిట్స్, శ్వాస ఆగి ఆగి తీసుకోవటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దాన్ని మెదడు వాపుగా భావించి, చికిత్స చేయటం గమనిస్తున్నాం. అసలు సమస్య అయిన థయమిన్ లోపాన్ని సరిచేయలేకపోవటం వల్ల ఎంతోమంది పిల్లల ప్రాణాలను పోగొట్టుకున్న సందర్భాలూ లేకపోలేదు. ఇది అత్యంత బాధాకరమైన విషయం.

రాన్రానూ పెరుగుతూ..

హైదరాబాదులోని జాతీయ పోషణ సంస్థ (ఎన్‌ఐఎన్) శాస్త్రవేత్తలు 1960–70లో చేసిన అధ్యయనంలో మనదేశంలో థయమిన్ లోపం లేదని పేర్కొన్నారు. ఇది ఒకరకంగా నిజమే కావొచ్చు. దీనికి రెండు అంశాలు కారణమై ఉండొచ్చు. ఒకటి– అప్పట్లో బియ్యాన్ని అంతగా పాలిష్ పట్టి ఉండకపోవటం. రాన్రానూ పరిస్థితి మారిపోయింది. బియ్యాన్ని పాలిష్ పట్టటం పెరిగిపోయింది. తెల్లగా, ఆకర్షణీయంగా కనిపించటమో, మరే కారణంతోనో ఇలాంటి బియ్యాన్నే ఎక్కువగా తినటం అలవాటైంది. రెండు– ఆ రోజుల్లో మనదగ్గర.. ముఖ్యంగా పిల్లల్లో ప్రొటీన్, పిండి పదార్థాల లోపం (అండర్ న్యూట్రిషన్) ఎక్కువగా ఉండేది. ఇటువంటి పోషణలోపం గలవారికి థయమిన్ అవసరమూ తక్కువే. సాధారణంగా వెయ్యి కేలరీలను పిండి పదార్థం రూపంలో తీసుకుంటే, 2 మి.గ్రా. థయమిన్ కావాలి. అదే ప్రొటీన్, పిండి పదార్థాల లోపం ఉందనుకోండి. వీటిని శక్తిగా మార్చే థయమిన్ అవసరమూ తగ్గుతుంది. ఒకవేళ వీరికి ప్రొటీన్, పిండి పదార్థం పెంచినట్టయితే థయమిన్ అవసరమూ పెరుగుతుంది. ఇది ఆ మేరకు లభించకపోతే బెరిబెరికి దారితీస్తుంది. దీన్ని అర్థం చేసుకోవటం ప్రధానం. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా బియ్యం, పప్పులు చవకగా అందించటం వల్ల ప్రొటీన్, పిండి పదార్థాల లోపం తగ్గి ఉండొచ్చు. కానీ అదే సమయంలో వారిలో ఉన్న థయమిన్ లోపమూ బెరిబెరిగా బహిర్గతమవుతుంది. పాలిష్ పట్టిన బియ్యం, పప్పుల్లో థయమిన్ ఉండదు. ఇది థయమిన్ లోపానికి, చివరికి బెరిబెరికి దారితీస్తుంది. పాలిష్ పట్టిన, పాత బియ్యం ఎక్కువగా తీసుకుంటూ కూరగాయలు, పండ్లు, మాంసం, గుడ్ల వంటివి తగినంతగా తీసుకోనివారిలో.. ముఖ్యంగా పిల్లల్లో ఈ జబ్బు ఎక్కువగా కనిపిస్తోంది. దీనినే వైద్యరంగంలో 'ఇన్‌ఫెంటైల్ బెరిబెరి' అనీ అంటారు. దీన్ని గత 20, 30 ఏళ్ల నుంచి ఎక్కువగా చూస్తున్నాం. బెరిబెరి జబ్బు రెండు రకాలు. 1. కార్డియాక్ బెరిబెరి. 2. ఎన్‌కెఫలైటిక్ బెరిబెరి. అరుదుగా ఎఫోనిక్ బెరిబెరి అని మూడో రకాన్నీ చూస్తుంటాం. అప్పుడప్పుడూ ఒకరిలోనే ఈ మూడు రకాలు కలిసి కనిపిస్తుంటాయి కూడా.

# చిగుళ్ల నుంచి రక్తమా?

బ్రష్‌తో పళ్లు తోముకుంటున్నప్పుడు రక్తం వస్తోందా? ఇది తొలి దశ చిగుళ్ల జబ్బుకు సంకేతం కావొచ్చు. నోట్లో నివసించే బ్యాక్టీరియా పళ్ల మీద పోగుపడి, గారగా మారుతుంది. సరిగ్గా బ్రష్ చేసుకోకపోతే చిగుళ్లు ఉబ్బి, ఎర్రగా అవుతాయి. చివరికి రక్తస్రావమవుతుంది. కాబట్టి ఉదయం నిద్ర లేచాక, రాత్రి పడుకునే ముందు బ్రష్‌తో పళ్లు తోముకోవటం మంచిది. పళ్ల మధ్య భాగాలను సన్నటి దారంతో శుభ్రం (ఫ్లాజింగ్) చేసుకోవాలి.

బ్రష్ పోచలు కఠినంగా ఉన్నా ఇబ్బందే. ఇవి సున్నితమైన చిగుళ్లను దెబ్బతీస్తాయి. కాబట్టి మెత్తటి పోచలు గల బ్రష్ వాడుకోవాలి.

పొగతాగే అలవాటు గలవారికి చిగుళ్ల జబ్బు ముప్పు రెండు రెట్లు ఎక్కువ.



పొగాకులోని రసాయనాలు రోగనిరోధక వ్యవస్థను బలహీనం చేస్తాయి. దీంతో చిగుళ్ల ఇన్‌ఫెక్షన్‌తో పోరాడే సామర్థ్యం తగ్గుతుంది. పొగ తాగటం వల్ల దెబ్బతిన్న చిగుళ్లు త్వరగా కోలుకోవు కూడా. ఎంత ఎక్కువకాలంగా పొగ తాగుతూ వస్తుంటే అంత ఎక్కువగా చిగుళ్లకు హాని కలుగుతుంది.

రక్తాన్ని పలుచగా చేసే మందులు వాడేవారికి చిగుళ్ల నుంచి తేలికగా రక్తం రావొచ్చు. కొన్నిరకాల మూర్ఛ మాత్రలు, రోగనిరోధక శక్తిని అణచిపెట్టే మందులు చిగుళ్లు త్వరగా ఎదిగేలా చేస్తాయి. ఈ కొత్త కణజాలం సున్నితంగా ఉంటుంది. పళ్లు తోముకుంటున్నప్పుడు త్వరగా రక్తస్రావం కావొచ్చు. కుంగుబాటు, అలర్జీ, రక్తపోటు తగ్గించే మందులతో నోరు పొడిబారుతుంది. ఇది సమస్యకు దారితీయొచ్చు.

గర్భిణుల్లో హార్మోన్ల ప్రభావంతో చిగుళ్లకు ఎక్కువ రక్తం సరఫరా అవుతుంది. దీంతో అవి ఉబ్బి, ఎర్రబడతాయి. గారకు కారణమయ్యే బ్యాక్టీరియా చిగుళ్ల మీద మరింత ఎక్కువగా దాడి చేసే అవకాశమూ ఉంది. అందువల్ల గర్భం ధరించిన సమయంలో సరిగ్గా పళ్లు తోముకోవటం మంచిది. తీపి పదార్థాలకు దూరంగా ఉండటమూ మేలే.

మధుమేహం కారణంగా రోగనిరోధకశక్తి తగ్గి, నోట్లో బ్యాక్టీరియాను ఎదుర్కొనే సామర్థ్యం తగ్గుతుంది. ఇది చిగుళ్ల ఉబ్బుకు దారితీస్తుంది. దీంతో తోముకుంటున్నప్పుడు రక్తం వస్తుంది. కాబట్టి మధుమేహం గలవారు గ్లూకోజును నియంత్రణలో ఉంచుకోవాలి.

# మొక్కల నుంచి తల్లిపాలు

చనుబాలకు బదులుగానో, అదనపు పోషణ కోసమో.. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 75 శాతం మంది పిల్లలకు తొలి ఆరు నెలల్లో పోతపాలు పడుతుంటారు. ఎదుగుతున్న శిశువులకివి అత్యవసర ఆహారంగా ఉపయోగపడినప్పటికీ చనుబాలతో లభించే పోషకాలను పూర్తిగా అందించలేవు. తల్లి పాలలో సుమారు 200 వరకూ ఓలిగోశాక్రైడ్లనే (హెచ్ఎంఓ) ప్రత్యేక చక్కెరలుంటాయి. ఇవి జబ్బుల బారినపడకుండా కాపాడటంతో పాటు పేగుల్లో మంచి బ్యాక్టీరియానూ వృద్ధి చెందిస్తాయి. ఈ చక్కెరల్లో చాలావాటిని తయారుచేయటం



కష్టం. అసాధ్యమన్నా అతిశయోక్తి కాదు. ఈ లోటును పూడ్చటానికి యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధకులు వినూత్న ప్రయత్నం చేశారు. పొగాకు జాతికి చెందిన నికొటియానా బెంథమియానా మొక్కలను జన్యుపరంగా మార్చి, హెచ్ఎంఓలను ఉత్పత్తి చేసేలా రూపొందించటంలో విజయం సాధించారు. మొక్కలు, చెట్లు సూర్యరశ్మి, కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి రకరకాల (మామూలు, సంక్లిష్ట) చక్కెరలను సృష్టిస్తాయి. సాధారణంగా మామూలు చక్కెరలు ఒకదగ్గర కలిసి, సంకెలగా మారి సంక్లిష్ట చక్కెరలు ఏర్పడతాయి. చనుబాలలోని ఓలిగోశాక్రైడ్లు కూడా సంక్లిష్ట చక్కెరలే. వీటి తయారీకి తోడ్పడే ఎంజైమ్‌ల విడుదలకు కారణమయ్యే జన్యువులను పరిశోధకులు వృద్ధి చేసి.. వాటిని మొక్కల్లో ప్రవేశపెట్టారు. దీంతో అవి ఇతర సంక్లిష్ట చక్కెరలతో పాటు మనకు తెలిసిన 11 హెచ్ఎంఓలనూ ఉత్పత్తి చేయటం విశేషం. ఇది మరింత ఆరోగ్యకరమైన, చవకైన పోతపాల తయారీకి ఉపయోగపడగలదని భావిస్తున్నారు. పెద్దవారికి ఇంకాస్త పుష్టికరమైన వృక్ష ఆధారిత పాలను అందించే అవకాశముంటుందనీ ఆశిస్తున్నారు.

# నడుంనొప్పికి వ్యాయామ మాత్ర

కొందరికి తరచూ.. ముఖ్యంగా ప్రయాణాలు చేసిన తర్వాత నడుంనొప్పి వేధిస్తుంటుంది. విశ్రాంతి, మందులతో తగ్గినట్టే తగ్గి కొద్ది నెలలకు సమస్య మళ్లీ తిరగబెడుతుంటుంది. ఇటువంటి వారు నొప్పి తగ్గిన తర్వాత వీలైనంత త్వరగా వ్యాయామం చేయటం మంచిది. ఎక్కువసేపు పడుకొని ఉండిపోతే వెన్నెముక, కటి భాగానికి అంటుకొని ఉండే కండరాలు బలహీనమవుతాయి. కాబట్టి నడక ఆరంభించటం మేలు. ఇది వెన్నుకు




రెండు పక్కలా ఉండే కండరాలను, వెన్ను ఎముకలను బలోపేతం చేస్తుంది. అలాగే ఫిజియో థెరపిస్టు సలహాతో ప్రత్యేకమైన వ్యాయామాలూ చేయాలి. యోగా కూడా వెన్నెముక దృఢం కావటానికి తోడ్పడుతుంది. క్రమం తప్పకుండా వ్యాయామాలు చేస్తుంటే నడుం నొప్పితో ఇబ్బంది పడకుండా ఎక్కువ రోజులు ప్రయాణాలు చేయొచ్చు. వ్యాయామం మందు మాదిరిగా, అద్భుతమైన మాత్రలా పనిచేస్తుంది.

# బాల ఒత్తిడి చిన్నది కాదు

పిల్లలంతా ఎప్పుడో అప్పుడు ఒత్తిడికి లోనవ్వటం మామూలే. హోంవర్క్ చేసేటప్పుడో, స్నేహితుల గురించో, వార్షిక పరీక్షలు రాసేటప్పుడో ఆందోళన చెందటం చూస్తూనే ఉంటాం. కానీ కొందరు పిల్లలు మరీ అతిగా ఒత్తిడికి గురవుతుంటారు. ఇది పెద్దయ్యాక శారీరక, మానసిక సమస్యలకు దారితీయొచ్చు. అందుకే బాల్యంలో ఎదుర్కొన్న విపత్కర పరిస్థితులు దీర్ఘకాలంలో ఎలాంటి ప్రభావాలు చూపుతాయన్న దానిపై శాస్త్రవేత్తలు అధ్యయనాలు నిర్వహిస్తున్నారు. సమస్యల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అన్వేషించటానికి ప్రయత్నిస్తున్నారు.

రోజువారీ జీవితంలో ఒత్తిడికి గురిచేసే అంశాలెన్నో ఎదురవు తుంటాయి. ఇవి చాలావరకూ అదుపు తప్పకుండానే చూసుకుంటాం. చిన్న పిల్లలకైతే తల్లిదండ్రులు, పెద్దవారు భరోసా కల్పిస్తే తేలికగానే కుదురు కుంటారు. నిజానికి మామూలు ఒత్తిడి జీవితంలో



ఎదగటానికి, నేర్చు కోవటానికి అత్యవసరం కూడా. సాధారణ ఒత్తిడిని సానుకూలంగా మలచుకుంటే పిల్లల సామర్థ్యం ఇనుమడిస్తుంది. నైపుణ్యాలూ పెరుగుతాయి. అయితే దీర్ఘకాలం కొనసాగుతూ వచ్చే ఒత్తిడితోనే ఇబ్బంది. శారీరకంగా, మానసికంగా, లైంగికంగా వేధింపులకు గురైతే తీవ్ర వేదన కలిగిస్తాయి. కుటుంబంలో కలహాలు సైతం పిల్లల మనసులను కుంగదీస్తాయి. తీవ్ర మానసిక సమస్యలతో బాధపడేవారితో, వ్యసనాలకు లోబడినవారితో జీవించటం.. చుట్టుపక్కల హింస, వివక్ష, తీవ్ర పేదరికం మూలంగానూ మానసిక సమస్యల ముప్పు పెరుగుతుంది. ఇవి చదువుల మీదే కాదు.. సామాజిక సంబంధాల పైనా విపరీత ప్రభావం చూపుతాయి. పిల్లలు అప్పుడప్పుడే ఒత్తిడికి స్పందించటం నేర్చుకుంటూ వస్తుంటారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy